
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 303

బుధవారం 24-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




రవిశాస్త్రికి 'లైఫ్‌టైమ్' అవార్డు

మూడేళ్ల వార్షిక అవార్డులు ప్రదానం చేసిన బీసీసీఐ - స్పోర్ట్స్‌లో



దలాల్‌స్ట్రీట్‌లో అమ్మకాల మోత


సెన్సెక్స్ 1,053 పాయింట్లు క్రాష్.
నిఫ్టీ నష్టం 330 పాయింట్లు - బిజినెస్‌లో



వాటి నుంచి విముక్తి కల్పించాలి

దేశాభివృద్ధికి వారసత్వ రాజకీయాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం అడ్డంకులుగా మారాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



బాలక్ రామ్

అయోధ్య మందిరంలో కొలువుదీరిన రామ్ లల్లాను ఇకపై బాలక్ రామ్‌గా.. ఆలయాన్ని బాలక్‌రామ్ మందిర్‌గా పిలవనున్నారు.

వివరాలు 6లో ▸



మంచి ప్రచారం ఇచ్చారు!

తన యాత్రను అడ్డుకుంటున్నారని రాహుల్ ఆరోపించగా.. ప్రజల్ని రెచ్చగొట్టిన రాహుల్‌పై కేసు నమోదుకు అసోం సీఎం ఆదేశాలిచ్చారు.

వివరాలు 6లో ▸



అమ్మాయి ఆరోగ్యానికి 7 పరీక్షలు

గర్ల్ చైల్డ్ డే సందర్భంగా అమ్మాయిలు ఆరోగ్యంగా పెరిగేందుకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

వివరాలు ఫ్యామిలీలో ▸



అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన వైఎస్సార్ ఆసరా నిధుల జమ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



మీరే నా సైన్యం

మన ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు

మన ప్రభుత్వ చేయూత, ఆసరాతో మహిళా సాధికారత

వారు బాగుంటేనే ఇల్లు, రాష్ట్రం బాగుంటుంది

అందుకే వారికి అన్ని విధాలా అండగా నిలిచాం

నాలుగో విడత 'ఆసరా' నిధులు విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

- ఈ పథకం కింద 79 లక్షల మందికి రూ.25,571 కోట్ల డ్వాక్రా రుణాలు చెల్లించాం.. పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ కింద రూ.4,968 కోట్లు ఇచ్చాం
- మొత్తంగా రూ.31 వేల కోట్లు అందించాం
- 56 నెలల్లో ఏకంగా నేరుగా రూ.2.53 లక్షల కోట్లు లబ్ధి
- అర్హతే ప్రాతిపదికగా రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాల అమలు
- మన ప్రభుత్వంలో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు
- ప్రస్తుతం 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ కనిపించనంత తేడా ఏపీలో కనిపిస్తోంది

2లో

"ప్రజలకు ఏ మంచీ చేయని వారికి, ప్రజలను మోసం చేసిన వారికి ఇంత మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రతి పేద ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించిన మీ బిడ్డకు, మంచి చేసిన మీ బిడ్డకు ఎలాంటి స్టార్ క్యాంపెయినర్లు లేరు. అయితే మీ బిడ్డ వాళ్లెవరినీ నమ్ముకోలేదు. వీళ్లందరి కంటే ఎక్కువగా నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని గట్టిగా చెబుతున్నాను. మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు. జెండాలు జత కట్టడమే టీడీపీ అజెండా. జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ అజెండా.


- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న

బిహార్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా సేవలు

జననాయకుడిగా చిరపరిచితుడు

- బిహార్‌లో ఓబీసీ రాజకీయాలకు నాంది పలికిన ఠాకూర్
- దేశ అత్యున్నత పురస్కారం పొందిన 49వ వ్యక్తి
- నాయకత్వ దార్శనికతతో చెరగని ముద్ర వేశారు: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: స్వాతంత్య్ర సమరయోధుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కర్పూరి ఠాకూర్‌ను కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో గౌరవించింది. నేడు ఆయన వందో జయంతి. ఠాకూర్ శతాబ్ది జయంతి ఉత్సవాల ప్రారంభానికి ఒకరోజు ముందే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం ఈ ప్రకటన వెలువరించడం విశేషం. జననాయకుడిగా అందరికీ చిరపరిచితుడైన ఠాకూర్ బిహార్‌లో ఓబీసీ రాజకీయాలకు నాంది పలికారు. భారతరత్న పొందిన వారిలో

మిగతా 4వ పేజీలో ▶

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటనపై సీఎం జగన్ హర్షం 4లో



గ్రూప్-1 పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న సర్వీస్ కమిషన్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అభ్యర్థులు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్ష మార్చి 17న నిర్వహిస్తామని, ఇందులో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

గంటా రాజీనామా ఆమోదం



సాక్షి, అమరావతి: విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు రాజీనామాను అసెంబ్లీ స్పీకర్ ఆమోదించారు. ఈ మేరకు ప్రభుత్వ శాసన వ్యవహారాల సెక్రటరీ జనరల్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. కొద్దికాలం క్రితం అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకి ఆయన స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా సమర్పించారు. దాన్ని పరిశీలించిన స్పీకర్ ఆమోదముద్ర వేశారు. విశాఖ నార్త్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

లోకేశ్ 'రెడ్ డైరీ' కేసు 30కి వాయిదా



టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను భయ భ్రాంతులకు గురిచేసేలా ఆ పార్టీ నేత నారా లోకేశ్.. అధికారులను బెదిరిస్తున్నారన్న సీఐడీ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. గతంలో ఆయనకు ఇచ్చిన 41ఏ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సీఐడీ అధికారులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

- వివరాలు 4లో

టీడీపీలో అయోమయం

- తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు.. క్షేత్ర స్థాయిలో దిగజారిన పార్టీ పరిస్థితి
- డబ్బున్న వారికే టికెట్.. పార్టీని వీడేందుకు పలువురు సిద్ధం
- గంటాను పట్టించుకోని చంద్రబాబు
- బండారు సత్యనారాయణమూర్తి సీటుపై అయోమయం
- తడాఖా చూపిస్తామంటున్న గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా, పీలా
- తీవ్ర నిరాశలో అయ్యన్న.. పార్టీ కార్యక్రమాలకూ దూరం
- ఉమ్మడి గోదావరి జిల్లాల నేతల్లో జనసేన చిచ్చు.. మోసపోయానని మండిపడుతున్న దేవినేని ఉమ
- సత్తెనపల్లిలో భగ్గుమంటున్న కోడెల శివరామ్
- చిలకలూరిపేటలో పుల్లారావు పరిస్థితి అగమ్యగోచరం
- ధర్మవరం, రాప్తాడులో పరిటాల శ్రీరామ్, సునీత అసంతృప్తి

4లో



పూర్తయిన వెలిగొండ రెండో సొరంగం

ఇలా 'వెలిగొండ'గా.. మరో కల సాకారం

పూర్తయిన రెండో సొరంగం తవ్వకం పనులు

- ఫిబ్రవరి మొదటివారంలో 2 టన్నెళ్లను జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్
- దుర్భిక్ష ప్రాంత రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం
- మొదటి సొరంగాన్ని 2021, జనవరి 13న పూర్తిచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆసియాలో అతి పొడవైన సొరంగాలను పూర్తిచేసి చరిత్ర సృష్టించిన సర్కార్
- ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాల్లో సాగునీటి సరఫరాకు మార్గం సుగమం
- అలాగే, 30 మండలాల్లో 15.25 లక్షల మంది తాగునీటి సమస్యకు పరిష్కారం
- 2014 నుంచి 2019 మధ్య ఈ ప్రాజెక్టును దోపిడీకి కేరాఫ్‌గా మార్చుకున్న చంద్రబాబు

13లో

ఆనందంతో విశాఖలో స్వీట్లు తినిపించుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు



థ్యాంక్యూ సీఎం సార్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో ఉప్పొంగిన అభిమానం

తమ సమస్యలు పరిష్కరించిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ సభలు

- జయహో జగన్ అంటూ నినాదాలు చేసిన అంగన్‌వాడీలు
- ఇలాంటి ప్రభుత్వమే కొనసాగాలని కోరుకుంటున్నట్లు వెల్లడి
- ప్రభుత్వ సానుకూల స్పందనతో సమ్మె వీడి విధుల్లోకి
- గర్భిణులు, పిల్లలకు సేవలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ప్రజల అభినందన

5లో

ఇదండీ వరస!



గాడి తప్పడానికి ఛాన్సే లేదా్సర్! ఎందుకంటే గతంలో ఎప్పుడూ గాడిలోనే లేదు!!




సభా ప్రాంగణం నిండిపోవడంతో బయటే వేచి ఉన్న అశేష జనసందోహం

మీరే నా సైన్యం

మన ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు

నాలుగో విడత 'ఆసరా' నిధులు విడుదల కార్యక్రమంలో సీఎం జగన్

> మహిళా సాధికారతను బాధ్యతగా భావించాం. అక్కచెల్లెమ్మలపై మమకారంతో 56 నెలల్లో మన ప్రభుత్వం ఒక్క ఆసరా పథకానికే ఏకంగా రూ.25,570 కోట్లు ఇచ్చామని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఎక్కడైనా దేశం, రాష్ట్రం బాగుందని చెప్పడానికి అక్కడ అక్కచెల్లెమ్మల బాగోగులు, వాళ్ల పిల్లలకు క్వాలిటీ ఎడ్యుకేషన్, అక్షరాస్యత పెరుగుదల, వారి ఆదాయంలో వృద్ధి, రాజకీయంగా వాటా.. తదితర అంశాలను పారామీటర్స్‌గా చూడాల్సి ఉంటుంది. ఈ అంశాలన్నింటిలో ఎక్కడైతే అక్కచెల్లెమ్మలు ముందంజలో ఉంటారో అప్పుడు ఆ రాష్ట్రం కూడా ముందంజలో ఉంటుంది. ఇవాళ ఈ దిశగా మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండటం సంతోషంగా ఉంది. - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అనంతపురం (ఉరవకొండ): 'ఎక్కడా కులం, మతం, ప్రాంతం, వర్గం.. చివరకు ఏ పార్టీ అని చూడకుండా, ఓటు వేయకపోయినా పర్వాలేదు.. అర్హతే ప్రామాణికంగా లబ్ధి చేకూరుస్తున్నాం. అక్కచెల్లెమ్మలు బాగుంటేనే కుటుంబం, రాష్ట్రం బాగుంటుందని మహిళా సాధికారతకు పెద్దపీట వేశాం. మన ప్రభుత్వం అందించిన చేయూత, ఆసరా వల్ల వారంతా సొంత కాళ్లపై నిలబడ్డారు. ఇతర రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలిచారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్‌లో బటన్ నొక్కి సుమారు 79 లక్షల మంది పొదుపు మహిళల ఖాతాల్లో రూ.6,394.83 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అక్కచెల్లెమ్మల సాధికారత ఉద్యమానికి మన ప్రభుత్వం అండగా ఉందన్నారు. పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని 2014లో చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని, తీరా గద్దెనెక్కాక మేనిఫెస్టోను చెత్త బుట్టలో పడేశాడని మండిపడ్డారు. 2016 అక్టోబర్ నుంచి అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశారన్నారు. చంద్రబాబు చర్యలతో అప్పట్లో పొదుపు సంఘాల రుణాలు తడిసి మోపెడయ్యి వడ్డీలు, చక్రవడ్డీలు కట్టుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. చంద్రబాబు మోసానికి ఏ గ్రేడ్, బీ గ్రేడ్ సంఘాలు కూడా కిందకు పడిపోయాయని గుర్తు చేశారు. మనందరి ప్రభుత్వం రాగానే 2019 ఎన్నికల నాటికి ఉన్న అప్పులన్నింటినీ మాఫీ చేస్తామని చెప్పామని, ఆ మాట మేరకు నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన వైఎస్సార్ ఆసరా అనే గొప్ప కార్యక్రమాన్ని ఇవాళ ఇక్కడ పూర్తి చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే మూడు దఫాల్లో రూ.19,176 కోట్లు ఇచ్చామని, ఇవాళ నాలుగో విడతగా ఇస్తున్న రూ.6,394.83 కోట్లతో కలిపి రూ.25,570 కోట్లు నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఎక్కడా లంచాలు, వివక్షకు తావే లేదన్నారు. ఈ సభలో సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

గతంలో ఏ పథకం కావాలన్నా లంచాలే

- గత 56 నెలల్లో అక్కచెల్లెమ్మల చెయ్యి పట్టుకుని నడిపిస్తూ సున్నా వడ్డీ కింద కోటి ఐదు లక్షల మందికి రూ.4,690 కోట్లు నేరుగా ఇచ్చాం. వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా కింద ఇచ్చిన రూ.31 వేల కోట్లతో కలిపి మొత్తంగా రూ.2.53 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం. గతంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ మొదలు రాష్ట్ర ముఖ్యమంత్రి దాకా లంచాలు పోయేవి. ఈ రోజు మన పార్టీకి ఓటు వేయకపోయినా ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.
- అక్కచెల్లెమ్మలపై ఇంత బాధ్యతగా, మమకారం చూపుతున్న ప్రభుత్వం మనదే. అమ్మ ఒడి పథకం కింద రూ.26,067 కోట్లు ఖర్చు చేశాం. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 31.27 లక్షల మంది మహిళలకు రూ.14,129 కోట్లు అందజేశాం. మరో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. నిర్మాణం పూర్తయిన ఒక్కో ఇంటి విలువ రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంటుంది. 25.45 లక్షల మంది తల్లులకు లబ్ధి చేకూరుస్తూ.. వారి పిల్లలకు విద్యా దీవెన కింద రూ.11,900 కోట్లు ఇచ్చాం. వసతి దీవెన కింద మరో రూ.4,275 కోట్లు అందించాం. కాపు నేస్తం కింద రూ.2,028 కోట్లు, ఈబీసీ నేస్తం కింద రూ.1257 కోట్లు అందించాం.
- పేదల పింఛన్ 64.30 లక్షల మంది అందుకుంటున్నారు. ఏ ఒక్కరూ రోడ్డు మీదకు రావాల్సిన అవసరం లేకుండా ప్రతి నెలా ఒకటవ తేదీన ఉదయాన్నే గుడ్ మార్నింగ్ చెబుతూ చిరునవ్వుతో వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము చేతుల్లో పెడుతున్నారు. 56 నెలల్లో పింఛన్ల కోసం రూ.84,730 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో రూ.56 వేల కోట్లు కేవలం నా అవ్వలు, అక్కచెల్లెమ్మలకే ఖర్చు చేశామని చెప్పడానికి సంతోషపడుతున్నా.
- చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నా అక్కచెల్లెమ్మలకు జగనన్న తోడు ద్వారా వడ్డీ లేని రుణాలు రూ.2610 కోట్లు, చేదోడు ద్వారా రూ.404 కోట్లు ఖర్చు చేశాం.



స్వయం సహాయక సంఘాలకు చెక్‌ను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

గతంలో ఇవన్నీ ఎందుకు లేవు?

- ఇన్ని కార్యక్రమాలు గతంలో ఎందుకు లేవు? అక్కచెల్లెమ్మలను పట్టించుకున్న నాథుడే లేడు. వారి పిల్లల చదువుల గురించి ఎవరైనా పట్టించుకున్నారా? గతంలో కూడా ఒక పాలన ఉండేది. అప్పుడు కూడా ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. మారిందల్లా కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. అప్పుల గ్రోత్ రేట్ చూస్తే మీ బిడ్డ ప్రభుత్వంలో గ్రోత్ రేట్ తక్కువ. గతంలో దోచుకో.. పంచుకో.. తినుకో.. ఈ రోజు మీ బిడ్డ ప్రభుత్వంలో బటన్ నొక్కుతున్నాడు.. నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి. ఎవరూ లంచాలు అడగడం లేదు.
- వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత కార్యక్రమాన్ని 14 రోజుల పాటు (ఫిబ్రవరి 5 వరకు) పండుగ వాతావరణంలో పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల మధ్య నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. గ్రామ సచివాలయాల్లో అక్కచెల్లెమ్మలకు మైక్‌లు ఇచ్చి ఏ రకంగా మహిళా సాధికారత జరిగిందన్న కథలు రాష్ట్రానికే కాదు.. దేశానికి కూడా వినిపించాలి.

ఇవాళ 99 శాతం రుణాల రికవరీ

- రాష్ట్రంలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాల ద్వారా ఎంత మంచి జరిగిందని ఒకసారి ఆలోచించండి. చంద్రబాబు 2014కు ముందు రుణాలు మాఫీ చేస్తానని మేనిఫెస్టోలో చెప్పారు. గెలిచిన తర్వాత మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారు. రుణమాఫీ మాట గాలికి వదిలేశారు. సున్నా వడ్డీని రద్దు చేశారు. అప్పట్లో రూ.14,210 కోట్ల రుణాలు తడిసి మోపెడై వడ్డీలు, చక్రవడ్డీలుగా మారాయి. చంద్రబాబు మోసాలతో పొదుపు సంఘాలు ఏ, బీ గ్రేడ్ నుంచి సీ, డీ గ్రేడ్‌లకు పడిపోయాయి. ఎన్‌పీఏలు, అవుట్ స్టాండింగ్‌లో 19 శాతానికి పడిపోయాయి.
- ఈ రోజు మీ బిడ్డ పాలనలో అవే సంఘాలు తలెత్తుకుని నిలబడ్డాయి. రుణాల రికవరీ 99 శాతంతో పొదుపు సంఘాలు మెరుగ్గా ఉన్నాయి. అక్కచెల్లెమ్మల సాధికారతకు మన ప్రభుత్వం ఎంతగా నిలబడిందో గమనించండి. ఎప్పుడూ లేని విధంగా అక్కచెల్లెమ్మలకు నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఏకంగా చట్టం చేశాం. ప్రతి సచివాలయంలో మహిళా పోలీసును ఏర్పాటు చేశాం. దిశ యాప్ తీసుకువచ్చాం. కోటి 40 లక్షల మంది అక్కచెల్లెమ్మల సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ అండగా, రక్షణగా నిలిచింది.

రాష్ట్రంలో జగన్ ప్రభంజనం



రాష్ట్రంలో మరోసారి జగన్ ప్రభంజనం ఖాయం. మహిళలు ఈ రోజు ఆత్మవిశ్వాసంతో కుటుంబాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. గతంలో ఒక ఎస్సీ కుర్రాడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వడానికి టీడీపీ కండువా కప్పుకోవాలని పయ్యావుల కేశవ్ సోదరుడు బలవంతం చేశాడు. మన ప్రభుత్వంలో అలా ఎప్పుడూ జరగలేదు. పచ్చ కండువా వేసుకున్నా, ఎర్ర కండువా వేసుకున్నా అర్హత ఉంటే చాలు పథకాలు ఇస్తున్నాం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వారిలో కొందరిని ప్రలోభపెట్టి పచ్చ కండువా వేసి ఆహ్వానించారు. ఇప్పుడు మేము అదే పని చేసి ఉంటే.. పయ్యావుల కేశవ్‌తో సహా ఒక్క ఎమ్మెల్యే అయినా మీ వెంట ఉండేవారా చంద్రబాబూ? నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో ఇన్‌పుట్ సబ్సిడీపై మాట్లాడగా.. ఆ బకాయి కిరణ్ ప్రభుత్వానిది కాబట్టి ఇచ్చేది లేదని చెప్పిన దుర్మార్గుడు చంద్రబాబు. అదే వైఎస్ జగన్ రూ.25 వేల కోట్లకు పైగా పొదుపు సంఘాల బకాయిలు చెల్లించడం చరిత్రాత్మకం.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త

పుట్టింటికంటే ఎక్కువ ఇచ్చారు



అన్నా.. మీరు ఆడపడుచులకు పుట్టింటి కంటే ఎక్కువ ఇచ్చారు. వైఎస్సార్ ఆసరా మాకు చాలా సాయం చేసింది. మేం చాలా సంతోషిస్తున్నాం. మీరు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మాకు సాయం చేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.30 వేలు లబ్ధి పొందాను. ఈ డబ్బుతో ఫ్యాన్సీ షాప్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతంలో మా పొదుపు సంఘాలు అప్పులు కట్టలేక నిలిచిపోయాయి. ఈ రోజు మీ మేలు వల్ల ఏ బ్యాంకైనా వెంటనే పిలిచి మరీ లోన్లు ఇస్తున్నాయి. మా ఇద్దరు పిల్లల చదువులు, ఇంటి స్థలం, నా భర్తకు లక్షల విలువయ్యే వైద్యం.. ఆ తర్వాత విశ్రాంతి సమయంలో కూడా సాయం.. ఇలా ఎన్నో విధాలుగా అండగా నిలిచారు. మీకు రుణపడి ఉంటాం.

– మమత, పొదుపు సంఘం సభ్యురాలు, వజ్రకరూరు, అనంతపురం జిల్లా



లబ్ధిదారుల సమక్షంలో బటన్ నొక్కి నాలుగో విడత ఆసరా నిధులను విడుదల చేస్తున్న సీఎం జగన్



అనంతపురం జిల్లా ఉరవకొండలో సభా ప్రాంగణానికి వెళుతూ అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు

ఉరవకొండ సభలో సీఎం వైఎస్ జగన్

- జెండాలు జత కట్టడమే టీడీపీ అజెండా
- జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ అజెండా
- పక్క రాష్ట్రంలో శాశ్వతంగా ఉంటున్న చంద్రబాబు స్టార్ క్యాంపెయినర్లు మీడియా అధిపతులు.. బాబు దత్త పుత్రుడు, ఆయన వదిన, పసుపు– కమలాల మనుషులు
- ఇతర పార్టీల్లోనూ రకరకాల రూపాల్లో బాబు బినామీలు



సాక్షి, అనంతపురం (ఉరవకొండ): 'ప్రజలకు ఏ మంచీ చేయని వారికి, ప్రజలను మోసం చేసిన వారికి ఇంత మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రతి పేద ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించిన మీ బిడ్డకు, మంచి చేసిన మీ బిడ్డకు ఎలాంటి స్టార్ క్యాంపెయినర్లు లేరు. అయితే మీ బిడ్డ వాళ్లెవరినీ నమ్ముకోలేదు. వీళ్లందరి కంటే ఎక్కువగా నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని గట్టిగా చెబుతున్నాను. మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగవ విడత నిధుల విడుదల సభలో మాట్లాడారు. 'జెండాలు జత కట్టడమే వారి అజెండా.. జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ అజెండా' అని తెలిపారు. వారందరికీ భిన్నంగా తనకున్నంత మంది స్టార్ క్యాంపెయినర్లు దేశ చరిత్రలోనే కాదు.. రాజకీయ చరిత్రలో ఎవరికి ఉండరన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మాత్రం మీరే మీ బిడ్డకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలవాలని కోరారు. జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో మీ బిడ్డకు మీరే సైనికుల్లా నిలవాలన్నారు. మనం వేసే ఓటు.. నొక్కే బటన్ ఎందుకు నొక్కుతున్నామో మనసులో పెట్టుకోవాలని చెప్పారు. మీరు వేసే ఓటు ఒక్క జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడమే కాదు.. పేద కుటుంబాలు పేదరికం నుంచి బయట పడేందుకనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటేనే అది జరుగుతుందని మనసులో పెట్టుకోవాలని చెప్పారు.

వారికి మంచి చేసిన చరిత్రే లేదు

'చంద్రబాబుకు, ఆయన ఎల్లో మీడియాకు, ఆయన గజదొంగల ముఠాకు మంచి చేసిన చరిత్ర లేదు. చెడు మాత్రమే చేసిన చరిత్ర వారిది. ఎప్పుడూ మోసాలే. చంద్రబాబుకు తోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, వీరందరికీ ఒక దత్తపుత్రుడు తోడు. ఇటువంటి వారికి రోజూ సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తోంది. నిజంగా ఇది కలికాలమే' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఏ మంచి చేయకపోయినా, ఏ పథకాలు అమలు చేయకపోయినా చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్లు చాలా మంది ఉన్నారని, చంద్రబాబును భుజాన ఎత్తుకుని మోసే పెద్ద ముఠా ఉందని చెప్పారు. వాళ్లందరూ పక్క రాష్ట్రంలో ఉంటారన్నారు. 'పక్క రాష్ట్రంలో పర్మినెంట్ రెసిడెంట్‌గా ఉన్న చంద్రబాబు దత్తపుత్రుడు, చంద్రబాబు వదిన, మరో స్టార్ క్యాంపెయినర్, పక్క పార్టీలోకి వెళ్లిన మరో స్టార్ క్యాంపెయినర్, ముగ్గురు మీడియా అధిపతులు పొరుగు రాష్ట్రంలో ఉంటారు. అక్కడ ఉన్న మీడియా అధిపతులు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5.. వీళ్లందరూ చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్లే. వీరు కాకుండా రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీలోకి ప్రవేశించిన చంద్రబాబు అభిమాన సంఘమంతా కూడా.. ఆయన్ను జాకీ పెట్టి ఎత్తేందుకు కష్టపడుతున్నారు. ఇంకొంత మంది స్టార్ క్యాంపెయినర్లు కూడా చంద్రబాబుకు తోడుగా ఉన్నారు. బీజేపీలో తాత్కాలికంగా తలదాచుకున్న పసుపు కమలాలు.. ఇంకొంత మంది స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. అమరావతిలో బాబు భూములకు బినామీలు ఉన్నట్లు.. మనుషుల్లో, ఇతర పార్టీల్లో రకరకాల రూపాల్లో బినామీలుగా చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్లుగా కనిపిస్తారు. టీవీల్లో విశ్లేషకుల పేరుతో కనిపిస్తారు. మేధావుల పేరుతో వేదికల్లో కనిపిస్తారు. వీళ్లందరూ బాబు కోసం పని చేస్తారు. కారణం దోచు కోవడం, పంచుకోవడంలో వీళ్లందరూ కూడా భాగస్వాములే కాబట్టి' అని సీఎం జగన్ నిప్పులు చెరిగారు.

బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.33 కోట్లు

జీడిపల్లి రిజర్వాయర్‌కు సంబంధించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చే పనులు వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఉరవకొండ నియోజకవర్గంలో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రూ.33 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

ఏపీ మైనింగ్‌కు జాతీయ అవార్డు

- స్టేట్ మైనింగ్ మంత్రుల సదస్సులో అవార్డును ప్రదానం చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- ఏపీలో మైనింగ్ సంస్కరణలపై సీఎం, గనులశాఖ మంత్రికి కేంద్రం ప్రశంసలు



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటరెడ్డి

సాక్షి, అమరావతి: మేజర్ మినరల్స్ మైనింగ్ లీజుల జారీలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక విధానాలకు జాతీయస్థాయి అవార్డు లభించింది. భోపాల్‌లో మంగళవారం జరిగిన స్టేట్ మైనింగ్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చేతులు మీదుగా రాష్ట్ర గనుల శాఖ సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావు, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ సమక్షంలో 'అవార్డ్ ఆఫ్ అప్రిసియేషన్'ను వీజీ వెంకటరెడ్డికి ప్రహ్లాద్ జోషి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీసుకువచ్చిన పలు సంస్కరణలను కేంద్ర మంత్రి అభినందించారు. మైనింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత పారదర్శకంగా అవలంబిస్తున్న విధానాల వల్ల అనతికాలంలోనే జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలవడం ప్రశంసనీయమని కొనియాడారు.

మొదటి స్థానం సాధించడమే లక్ష్యం: వీజీ వెంకటరెడ్డి

అవార్డును అందుకున్న సందర్భంగా గనులశాఖ సంచాలకుడు వీజీ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో సీఎం వైఎస్ జగన్ అనేక సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు. గతంలో ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా లీజు జారీ చేసే విధానం ఉండేదని, దీనివల్ల అనేక ఇబ్బందులు రావడమే కాకుండా ఎక్కువ శాతం మైనింగ్ బ్లాక్‌ల్లో ఆపరేషన్స్ జరగకుండా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మైనింగ్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు ఆక్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. 2022–23లో 146 మైనర్ మినరల్ బ్లాక్ లకు, 2023–24లో ఇప్పటివరకు 134 మైనర్ మినరల్స్ బ్లాక్‌లకు ఆక్షన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు.

నేతాజీకి సీఎం జగన్ ఘన నివాళి

సాక్షి,అమరావతి: స్వతంత్ర భారతావనే లక్ష్యంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాడి దేశం కోసం ప్రాణత్యాగం చేశారని సీఎం వైఎస్ జగన్ కొనియాడారు. యువతలో స్ఫూర్తిని నింపి వారిని స్వతంత్ర పోరాటంలో భాగస్వాములను చేశారని, ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పిస్తున్నారని పేర్కొంటూ ఎక్స్‌లో మంగళవారం సీఎం పోస్ట్ చేశారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా జేఈఈ మెయిన్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించి తొలిరోజు ఐదేళ్ల కోర్సులు బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్‌లో ప్రవేశానికి పేపర్–2 పరీక్ష జరగనుంది. ఆ తర్వాత 27, 29, 30, 31, ఫిబ్రవరి1వ తేదీల్లో బీటెక్‌లో ప్రవేశాలకు పేపర్–1 పరీక్ష నిర్వహిస్తారు. రెండు పేపర్లు కలిపి దేశ వ్యాప్తంగా 12.30 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఏపీ నుంచి 1.34 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 300కు పైగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఏపీలో 28 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ మోడల్‌లో ప్రవేశ పరీక్ష జరగనుంది.

ఫ్యూచర్ స్కిల్స్ అమలుకు ప్రత్యేక విభాగం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ హైస్కూళ్లలో అమలు

సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తేనున్న ఫ్యూచర్ స్కిల్స్ బోధన, అమలు కార్యాచరణకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులిచ్చారు. ఏపీలోని 6,790 హైస్కూళ్లలో చదువుతోన్న విద్యార్థులకు ఎనిమిదో తరగతి నుంచి ఐటీ రంగంలో ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం 10 కోర్సులను ఎంపిక చేశారు. ఇందులో ఇంటర్నెట్ థింకింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) తదితర కోర్సులున్నాయి. వీటి అమలుకు 3 పాఠశాలలకు ఒకరు చొప్పున కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో బీటెక్/ఎంటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ప్రతి నెలా రూ.12 వేల వేతనంతో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా నియమించారు. ఈ మొత్తం ప్రాజెక్టు సమన్వయం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ఉన్నత స్థాయి కమిటీని నియమించారు. కమిటీ విధివిధానాలను సమన్వయం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రామలింగాన్ని మిషన్ డైరెక్టర్‌గా నియమించారు.


SMART BAZAAR
Reliance
ఫుల్ పైసా వసూల్ సేల్
24th -28th Jan
Also On JioMart
ఫుల్ పైసా వసూల్ లాంటి గొప్ప ఆఫర్లు కావాలా?
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
ఇంట్లో కూర్చొనే ఫుల్ పైసా వసూల్ లాంటి గొప్ప ఆఫర్లు కావాలా?
జియోమార్ట్ యాప్ పై షాపింగ్ చేయండి!
SMART SUPERSTORE
fresh Signature
BUY ANY 3 GET ANY 1 FREE
BUY ANY 2 GET ANY 1 FREE
26%
33%
50%
₹60
BHARAT DAL
₹209
₹1345
₹269
₹299
₹97/ ₹113
₹539
₹80
₹170
₹450
₹65
₹1499
LIVESMART
₹499
కంటే తక్కువలో ఫ్యాషన్ 2000+ స్టైల్
టీ-షర్ట్స్ ₹199
కుర్తా ₹199
డెనిమ్స్ ₹399
లెగ్గింగ్స్ ₹299
₹599
₹499
₹5999
60%
10% INSTANT DISCOUNT
SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Trxn. Valid only on one Trxn. per credit card. Validity: 24 Jan - 28 Jan 2024. T&C Apply.
Paytm CASHBACK
Get up to ₹300
Cashback on minimum payment of ₹1500
Minimum Assured ₹30 Cashback. Offer Valid Once per user from 23rd January to 28th January 2024. *T&C apply
Pay with MobiKwik
₹300
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి

క్లుప్తంగా...

14 మంది ఉద్యోగుల్ని విధుల్లోకి తీసుకుంటాం

సుప్రీం కోర్టుకు తెలిపిన ఏపీ ట్రాన్స్‌కో

సాక్షి, న్యూఢిల్లీ: జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 14 మంది ఉద్యోగుల్ని విధుల్లోకి తీసుకుంటామని ఏపీ ట్రాన్స్‌కో సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు విరుద్ధంగా తమను తెలంగాణకు పంపారంటూ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ హిమ కోహ్లి, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం విచారించింది. గత విచారణలో భాగంగా న్యాయస్థానం ఉద్యోగుల్ని వెనక్కి తీసుకోవడానికి జనవరి 16 వరకు ట్రాన్స్‌కోకు గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా ఉద్యోగుల్ని విధుల్లోకి తీసుకుంటామంటూ ఏపీ ట్రాన్స్‌కో కోర్టులో అఫిడవిట్‌దాఖలు చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 2 గంటలలోపు ఉద్యోగుల్ని విధుల్లోకి తీసుకోవాలంటూ ఆదేశాలు జారీచేసింది.

'మార్గదర్శి కేసుల' విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై సుప్రీంకోర్టులో దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. మార్గదర్శిపై కేసులు ఉమ్మడి హైకోర్టు క్వాష్ చేయడం తగదంటూ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లతో పాటు మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం ముందు కొచ్చాయి. అయితే మంగళవారం రాజ్యాంగ ధర్మాసనం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనారిటీ హోదాపై విచారణ చేపట్టింది. జస్టిస్ సూర్యకాంత్ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడు కావడంతో మార్గదర్శి కేసులు విచారణకు రాలేదు. ఆయా కేసుల తదుపరి విచారణ తేదీని ధర్మాసనం నిర్ణయించాల్సి ఉంది.

మాజీ ఎమ్మెల్యే 'నల్లమిల్లి'పై కేసు

బిక్కవోలు: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మరికొందరు టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చిత్రపటాలను కాల్చినట్టు రెండు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని చెప్పారు. ఇళ్లపల్లి సర్పంచ్ లొల్ల భద్రం ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితోపాటు 19 మందిపై, రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

ఐపీఎస్ అధికారి ఉజేలాకు హైకోర్టు ముందస్తు బెయిల్

సాక్షి, అమరావతి: ఐపీఎస్ అధికారి కృపానంద్ త్రిపాఠి ఉజేలాకు హైకోర్టు ఊరటనిచ్చింది. హోంగార్డుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న ఉజేలాకు హైకోర్టు మంగళవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పునిచ్చారు.


'రెడ్ డైరీ' కేసు విచారణ 30కి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేలా నారా లోకేశ్.. అధికారులను బెదిరిస్తున్నారన్న సీఐడీ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 30కి వాయిదా వేసింది. గతంలో ఆయనకు ఇచ్చిన 41ఏ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సీఐడీ అధికారులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించిన విషయాన్ని ఆధారాలతో సహా నివేదించింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని పిటిషన్‌లో కోరింది. కాగా ఈ కేసులో జారీ చేసిన నోటీసులను తీసుకునేందుకు లోకేశ్ సుముఖత చూపలేదు. ఆ నోటీసులు అందించేందుకు వెళ్లిన సీఐడీ అధికారులకు ఆయన అందుబాటులోకి రాలేదు. దాంతో నోటీసులను పోస్టులో లోకేశ్ నివాసానికి పంపారు. ఆ నోటీసులను తీసుకునేందుకు లోకేశ్ నిరాకరించారు. నోటీసులను లోకేశ్ మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించినా కూడా ఆయన స్పందించలేదు. దాంతో ఆ విషయాన్ని కూడా సీఐడీ అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో న్యాయస్థానం ద్వారా నోటీసులు జారీ చేయాలని కోర్టు రిజిస్ట్రార్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. లోకేశ్ గానీ, ఆయన తరఫు న్యాయవాదులు గానీ విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని లోకేశ్ తరఫు న్యాయవాదులు ఏసీబీ న్యాయస్థానాన్ని మంగళవారం కోరారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

టీడీపీలో అయోమయం

తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'లా తయారైంది. పార్టీ టికెట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోలేక తల బొప్పి కట్టిపోతోంది. జనసేనతో పొత్తుపై పార్టీ నేతలంతా పెదవి విరుస్తుండటంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. తమ టికెట్ సంగతి తేలిస్తేనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామని ఎక్కడికక్కడ నేతలు తెగేసి చెబుతుండటంతో తండ్రీ కొడుకులకు నిద్ర కరువైంది.



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఇప్పటికే పాతాళానికి కుంగిన ఆ పార్టీ.. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇంకా లోతుకు కూరుకుపోతోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పూర్తిగా అయోమయం నెలకొంది. పలు చోట్ల పార్టీకి ఇన్‌ఛార్జిలు లేకపోవడాన్ని బట్టే ఆ పార్టీ పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతోంది. నాయకులు ఉన్న చోట కూడా కుమ్ములాటలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆ పార్టీకి రాజీనామా చేశారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. అదే బాటలో మరికొందరు టీడీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేనతో ఇప్పటికే పొత్తులో ఉంటూ.. బీజేపీతో కూడా పొత్తు ప్రయత్నాలు చేస్తుండటంతో గందరగోళం ఇంకా పెరిగిపోయింది. తమ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందో, ఏ స్థానంలో తాము పోటీలో ఉంటామో తెలియక టీడీపీ క్యాడర్ అయోమయంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పలుచోట్ల కీలక నేతలు చంద్రబాబును ధిక్కరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనకుండా ముందు తమ సంగతి తేల్చాలని పట్టుబడుతున్నారు.

గాల్లో గంటా శ్రీనివాసరావు సీటు

సీనియర్ నేత గంటా శ్రీనివాసరావును చంద్రబాబు గాల్లో పెట్టడంతో ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకసారి గెలిచిన చోట మళ్లీ పోటీ చేయని గంటా వచ్చే ఎన్నికల్లో తనకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల సీటు ఇవ్వాలని కోరుతుండగా చంద్రబాబు ఎటూ తేల్చడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఆయన తంటాలు పడుతున్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబం కూడా టీడీపీపై రగిలిపోతోంది. పార్టీకి అండగా ఉన్న తమను దూరం పెడుతున్నారని వాపోతోంది. అయ్యన్న తనకు అనకాపల్లి ఎమ్మెల్యే సీటు, తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కానీ ఎవరో ఒకరికి మాత్రమే సీటు ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేయడంతో అయ్యన్న అలక వహించారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా.. మౌనంగా ఉంటున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి సీటు జనసేనకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తితో రగిలి పోతున్నారు. తన సీటు జనసేనకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్న ఆయన.. అవసరమైతే పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు సీట్లు ఇవ్వకపోతే టీడీపీ సంగతి చూస్తామని గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద్‌లు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేశారు.

కాకినాడలో టీడీపీకి హెచ్చరికలు

కాకినాడ సిటీ స్థానాన్ని జనసేనకు ఇస్తే తాను మరో దారి చూసుకుంటానని మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు స్పష్టం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఇప్పటికే బహిరంగంగా తన సీటు జనసేనకు ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే తాను ప్రత్యామ్నాయం చూసుకుంటానని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ కూడా పార్టీని ధిక్కరిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సీటు తనకివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతుండగా, చంద్రబాబు మరో వ్యక్తికి ఇవ్వాలని చూస్తున్నారు. తేడా వస్తే ఆయన జంప్ అవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య జనసేన చిచ్చు పెట్టింది. ఇక్కడ అధిక శాతం సీట్లు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో టీడీపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

దేవినేని ఉమకు సీటు లేదు

ఎన్టీఆర్ జిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు లేదని చెప్పడంతో ఆయన లోలోన కుంగిపోతూ ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. మైలవరం సీటును ఆయనకు కాదని కొత్త వ్యక్తికి ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పని చేసిన తనను మోసం చేశారని వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో దివంగత కోడెల శివప్రసాద్ తనయుడు శివరామ్ ఇప్పటికే తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఆయన స్థానంలో బీజేపీ నుంచి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి సీటు ఇస్తుండడంతో ఆయన టీడీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. చిలకలూరిపేట సీటు విషయంలో భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మధ్య పోటీ నెలకొంది. సీటు లేకపోతే టీడీపీని వదిలేందుకు పుల్లారావు ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉండడంతో మొదటి నుంచి అక్కడ పని చేసిన మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం దక్కలేదంటూ ఆయన టీడీపీని వీడాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అనంత, కర్నూలు జిల్లాల్లోనూ అదే తీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ప్రస్తుత ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి గ్రూపులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నాయి. ఎవరికి సీటిచ్చినా రెండో వర్గం తిరుగుబాటు చేసే పరిస్థితి నెలకొంది. మరోవైపు ధర్మవరం ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ అక్కడి నుంచి పోటీ చేయాలని చూస్తుండగా, గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీలోకి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి సీటు తనదేనని చెప్పుకుంటున్నారు. దీంతో పరిటాల ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తనను నమ్మించి పని చేయించుకుని ఇప్పుడు మాట మారిస్తే ఊరుకోనని ఆయన హెచ్చరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒకరికే టికెట్ అని చంద్రబాబు చెప్పడంతో రాప్తాడులో పరిటాల సునీత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల ఇన్‌ఛార్జిగా భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమించడంతో ఆ నియోజకవర్గంలో అసమ్మతి రాజుకుంది. బ్రహ్మానందరెడ్డి టీడీపీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆలూరు సీటు ఇవ్వకపోతే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి సుజాతమ్మ చంద్రబాబుకు ఝలక్ ఇవ్వనున్నారు. డోన్ అభ్యర్థిగా చంద్రబాబు.. ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించగా, కేఈ ప్రభాకర్ తాను రేసులో ఉన్నట్లు స్పష్టం చేశారు. చంద్రబాబు తీరుపై కేఈ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో మాజీ మంత్రి అఖిలప్రియ మండిపడుతున్నారు. అదే జరిగితే ఆమె టీడీపీకి గుడ్‌బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

ఏపీ గ్రిడ్‌తో 'సెంబ్‌కార్ప్' అనుసంధానం

ఇక నేరుగా ఏపీట్రాన్స్‌కో లైన్ ద్వారా రాష్ట్ర గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా



సాక్షి, అమరావతి: విద్యుత్ వృథాకు అడ్డుకట్ట వేయడంతోపాటు విద్యుత్ ఆదా చేయడం ద్వారా వినియోగదారులపై భారం తగ్గించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు ఏపీ ట్రాన్స్‌కో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సెంబ్‌కార్ప్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేపట్టింది. 5 కిలోమీటర్ల పొడవున ఈ లైన్ పూర్తికావడంతో మంగళవారం ఏపీట్రాన్స్‌కో అధికారులు సెంబ్‌కార్ప్ థర్మల్ ప్లాంటు లైన్‌ను పవర్‌గ్రిడ్ లైన్ నుంచి తప్పించి ఏపీగ్రిడ్ లైన్‌కు అనుసంధానం చేశారు. దీంతో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లైన్లతో సంబంధం లేకుండా నేరుగా ఏపీట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ లైన్ల ద్వారా ఏపీ గ్రిడ్‌కు, అక్కడ నుంచి డిస్కంలకు విద్యుత్ సరఫరా అవుతోంది.

ఏడాదికి రూ.365 కోట్లు ఆదా

విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)లో భాగంగా సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్)కు చెందిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని థర్మల్ పవర్ ప్లాంటు నుంచి రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటి వరకూ ఈ ప్లాంటు నుంచి పవర్‌గ్రిడ్‌కు చెందిన ట్రాన్స్‌మిషన్ లైన్ ద్వారా ఏపీ ఏపీట్రాన్స్‌కోకు చెందిన రాష్ట్ర గ్రిడ్‌కు, అక్కడి నుంచి డిస్కమ్‌లకు విద్యుత్ సరఫరా అవుతోంది. పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లైన్ వినియోగించుకున్నందుకు ఆ సంస్థకు యూనిట్‌కు రూ.0.72 పైసలు చొప్పున ఏపీ ట్రాన్స్‌కో చెల్లిస్తోంది. అంటే రోజుకు సగటున రూ.కోటి పవర్‌గ్రిడ్‌కు ట్రాన్స్‌కో ఇవ్వాల్సి వస్తోంది. సెంబ్‌కార్ప్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో ఏపీ గ్రిడ్‌ను నేరుగా అనుసంధానం చేయడం వల్ల ఈ ఖర్చు ఆదా కానుంది. రోజుకు 15 మిలియన్ యూనిట్ల చొప్పున ఏడాదికి సుమారు 5,475 మిలియన్ యూనిట్ల విద్యుత్ 'సెంబ్‌కార్ప్' నుంచి రాష్ట్ర గ్రిడ్‌కు సరఫరా అవుతోంది.

శుభపరిణామం: మంత్రి పెద్దిరెడ్డి

తక్కువ సమయంలోనే ఈ లైన్ నిర్మాణం పూర్తిచేసి సెంబ్‌కార్ప్‌ను నేరుగా ఏపీ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం రాష్ట్రానికి ఎంతో మేలు చేకూర్చే పరిణామమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న

▶ మొదటి పేజీ తరువాయి

ఠాకూర్ 49వ వ్యక్తి. చివరిసారిగా 2019 ఏడాదిలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రదానం చేసింది. బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న తొలి కాంగ్రెసేతర సోషలిస్ట్ నేతగా చరిత్ర సృష్టించారు. బిహార్‌కు ఆయన రెండుసార్లు సీఎంగా సేవలందించారు. తొలిసారిగా సీఎంగా 1970 డిసెంబర్ నుంచి 1971 జూన్ వరకు పనిచేశారు. 1977 డిసెంబర్ నుంచి 1979 ఏప్రిల్ వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. గతంలో డిప్యూటీ సీఎంగానూ చేశారు. 'ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయానికి ప్రతిరూపం ఠాకూర్. అణగారిన వర్గాల తరఫున పోరాడి వారిలో మార్పు రావడానికి ఎంతగానో కృషిచేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని జీవన విధానంగా మార్చుకున్న మహానుభావుడు. ఈ పురస్కారం ఆయన చేసిన కృషికి మాత్రమే కాదు భావితరాలకు స్ఫూర్తిగా, గొప్ప ప్రేరణగా నిలుస్తుంది' అని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

విద్యార్థి దశలోనే స్వతంత్రపోరాటంలోకి..

ఠాకూర్ బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లాలో కర్పూరి గ్రామ్‌లో 1924 జనవరి 24వ తేదీన జన్మించారు. ఈ గ్రామం పూర్వం బ్రిటిష్ ఇండియా పాలనలో బిహార్–ఒడిశా ప్రావిన్స్‌లో పితౌజియా పేరుతో పిలవబడేది. పితౌజియా గ్రామం పేరును ఈయన పేరిట కర్పూరిగ్రామ్‌గా మార్చారు. అతి సామాన్య నాయీ బ్రాహ్మణ రైతు కుటుంబంలో కర్పూరి ఠాకూర్ జన్మించారు. ఠాకూర్‌కు చిన్నప్పటి నుంచి విప్లవభావాలు ఎక్కువే. కాలేజీ విద్యను మధ్యలోనే వదిలేసి భారత స్వతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఠాకూర్‌ను 1942, 1945లో అరెస్ట్‌చేసి జైలులో పడేసింది. స్వాతంత్ర్యం సిద్ధించాక మొదట్లో గ్రామంలోని పాఠశాలలో టీచర్‌గా పనిచేశారు. రామ్ మనోహర్ లోహియాకు ప్రభావితులై రాజకీయాల్లో చేరారు. జయప్రకాశ్ నారాయణ్‌కు సన్నిహితంగా మెలిగేవారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయనతో కలసి పోరాటం చేశారు.

జననాయకుడు

బిహార్‌లో బీసీలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మంగేరీ లాల్ కమిషన్ సిఫార్సులను 1978లో అమలుచేశారు. మండల్ కమిషన్‌కు ఈ సిఫార్సులే ప్రేరణగా నిలిచాయి. అత్యంత వెనుకబడిన కులాలు అనే భావనను తొలిసారిగా మంగేరీ కమిషనే తీసుకొచ్చింది. 1952లో తొలిసారిగా సోషలిస్ట్ పార్టీ తరఫున తేజ్‌పూర్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి బిహార్ శాసనసభకు ఎన్నికయ్యారు. తుదిశ్వాస విడిచేదాకా ఎమ్మెల్యేగానే కొనసాగారు. 1970లో బిహార్ రాష్ట్రవ్యాప్తంగా మద్యపాన నిషేధం అమలుచేసి అందరి మన్ననలు పొందారు. రాష్ట్రంలో ఓబీసీలు రాజకీయాల్లో కీలకంగా మారడం వెనక ఈయన పాత్ర ఉంది. జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లకు ఠాకూర్ రాజకీయ గురువు. 1988లో తుదిశ్వాస విడిచారు. ఈయన కుమారుడు ప్రస్తుతం రామ్‌నాథ్ ఠాకూర్ రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు.

అణగారిన వర్గాల పెన్నిధి: మోదీ

ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. ' పేద, అణగారిన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా అంకితభావంతో పనిచేశారు. సమాజంలోని వివక్ష, అసమానతలు పారద్రోలి వెనకబడిన వర్గాలకు అన్నింటా అవకాశాలు దక్కేందుకు జీవితాంతం కృషిచేశారు. ఆయన నాయకత్వ దార్శనికత భారత సామాజిక, రాజకీయ ముఖచిత్రంపై చెరగని ముద్ర వేసింది. ఈ పురస్కారం ఆయన కృషికి మాత్రమేకాదు సమున్నతమైన సమసమాజ స్థాపన కోసం మనం చేసే ప్రయత్నాలకు చక్కని ప్రేరణ'' అని మోదీ శ్లాఘించారు.

సీఎం జగన్ హర్షం

సామాజిక న్యాయం, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం ఉద్యమించిన సోషలిస్టు నేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు ఆయన మరణానంతరం భారతరత్న ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

కళ్యాణ'మస్తు' ఉన్నా ఏడుపేనా రామోజీ?

గత ప్రభుత్వాని కంటే రెట్టింపు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- టీడీపీ ప్రభుత్వ హయాంలో దరఖాస్తుకే తీవ్ర ఇబ్బందులు
- ప్రస్తుతం ఉన్న చోట నుంచే వార్డు, గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తులు
- నాడు కళ్యాణమిత్రల ఇష్టారాజ్యం.. నేడు స్థానికంగానే ధ్రువీకరణ
- ప్రతి మూడు నెలలకు ఒకసారి నేరుగా వధువు తల్లి ఖాతాకే ఆర్థిక సాయం
- వాస్తవాలు వక్రీకరించి 'ఈనాడు' తప్పుడు రాతలు



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు వికృత రాతలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం జిమ్మడమే లక్ష్యంగా దురుద్దేశపూరిత కథనాలను అచ్చేస్తున్న ఈనాడు రామోజీరావు పేద బిడ్డల పెళ్లికి ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. బడుగు, బలహీనవర్గాలవారి వివాహాలకు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన సాయం కంటే దాదాపు రెట్టింపుకు పైగా సాయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్నా రామోజీ పచ్చకళ్లకు కనిపించడం లేదు. అంతేకాకుండా గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలను చెల్లించినా తనకేమీ పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే 'కళ్యాణమస్తు.. జాప్యం మస్తు' అంటూ ఒక విష కథనాన్ని సోమవారం ఈనాడు పత్రికలో అచ్చేశారు. అసత్యాలు, అబద్ధాలతో సాగిన ఈ కథనానికి సంబంధించి అధికారులు వెల్లడించిన వాస్తవాలివిగో..

పేదింటి బిడ్డల పెళ్లికి ఉద్దేశించిన కళ్యాణమస్తు పథకం కింద 43,490 జంటలకు గత టీడీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాల్సి ఉంది. అయితే 2018 నుంచి రూ.177.96 కోట్లు చెల్లించకుండా ఎగనామం పెట్టింది. ఆర్థిక సాయం చేస్తామని ఆశపెట్టి వారిని నిండా ముంచింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలన్నింటినీ విడుదల చేసింది. ఈ విషయాన్ని ఈనాడు తన కథనంలో ఉద్దేశపూర్వకంగా విస్మరించింది. పైగా లబ్ధిదారులకు ఆర్థిక సాయం విడుదలలో గత టీడీపీ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ఒక్కపదం రాస్తే ఒట్టు.

లబ్ధిదారులకు తప్పిన అవస్థలు..

గత ప్రభుత్వం హయాంలో లబ్ధిదారుల ఎంపికలో కళ్యాణమిత్రలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా దరఖాస్తుల నమోదు, పరిశీలన, ధ్రువీకరణను సులభం చేసింది. దీంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పాయి. దరఖాస్తులు, ధ్రువీకరణను సైతం డిజిటలైజ్ చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో 2.6 లక్షల మంది వలంటీర్లు సహాయమందిస్తుండటంతో లబ్ధిదారుల ఎంపిక మరింత సులువైంది.

ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆశయంతో..

ఆడ పిల్లల చదువులను ప్రోత్సహించాలనే మహోన్నత లక్ష్యంతో వివాహాలు చేసుకునేవారు కనీసం పదో తరగతి చదివి ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను పదో తరగతి వరకు తప్పనిసరిగా చదివిస్తున్నారు. అలాగే కళ్యాణమస్తు పథకానికి అర్హులు కావాలంటే వధువులకు 18 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉండాలని ప్రభుత్వం మరో నిబంధన పెట్టింది. దీంతో అందరూ ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాశయం ఆచరణలో మంచి ఫలితాలు ఇస్తోంది. పేద పిల్లలకు జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన వంటి పథకాల ద్వారా ఉన్నత విద్యకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు. ముస్లిం, మైనారిటీలు విద్యలో తక్కువ శాతం ఉన్నారని.. కాబట్టి ప్రభుత్వం పదో తరగతి నిబంధన సడలించాలని ఈనాడు తన కథనంలో రాయడం సంకుచితమే అవుతుంది. కళ్యాణమస్తు పథకానికి ముడిపెట్టి వారిని చదువుకు దూరం చేసే ప్రయత్నం 'ఈనాడు' చేయడం దుర్మార్గం. కళ్యాణమస్తు, షాదీ తోఫా కోసం ప్రభుత్వం పదో తరగతి చదివి ఉండాలనే నిబంధన పెట్టడం వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ఉన్నతాశయమే తప్ప మరొకటి కాదు.

కళ్యాణమస్తు/షాదీ తోఫా చివరి విడత ప్రకారం.. వధూవరుల విద్యాభ్యాసం ఇలా..

విద్యార్హత	వధువులు	వరుళ్లు
పదో తరగతి ఉత్తీర్ణత	6,327 (60.6%)	5,650 (54%)
గ్రాడ్యుయేషన్	3,147	3,091
పోస్ట్ గ్రాడ్యుయేషన్	471	806
ఇతర కోర్సులు	566	964
మొత్తం	10,511	10,511

పట్టికను పరిశీలిస్తే దాదాపు 40% మంది యువతులు, 45 % మంది యువకులు గ్రాడ్యుయేషన్, అంతకంటే ఎక్కువ చదివినవారేనని స్పష్టంగా తెలుస్తోంది

జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనలతో లబ్ధి ఇలా...

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లు
జగనన్న అమ్మఒడి	3,035	13.01
జగనన్న విద్యా దీవెన/ జగనన్న వసతి దీవెన ఏదో ఒకటి	2,272	10.01
ఈ రెండు పథకాలు	2,735	22.45
మొత్తం పథకాల్లో ఏదో ఒకటి	8,042	45

గత ప్రభుత్వం కంటే ఆర్థిక సాయం పెంచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

కేటగిరి	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం (రూ.)	గత ప్రభుత్వం (రూ.)
ఎస్సీ	1,00,000	40,000
ఎస్సీ కులాంతర వివాహం	1,20,000	75,000
ఎస్టీ	1,00,000	50,000
ఎస్టీ కులాంతర వివాహం	1,20,000	75,000
బీసీ	50,000	35,000
బీసీ కులాంతర వివాహం	75,000	50,000
మైనారిటీలు	1,00,000	50,000
విభిన్న ప్రతిభావంతులు	1,50,000	1,00,000
భవన నిర్మాణ కార్మికులు	40,000	20,000

పెళ్లిళ్లకు నిబంధనలు అంటూ ఈనాడు అసత్య ఆరోపణలు...

ప్రస్తుత ప్రభుత్వం పెళ్లిళ్లకు ఆర్థిక సాయంఅందించడంలో నిబంధనలు పెడుతోందంటూ ఈనాడు అసత్య ఆరోపణలు చేసింది. కొత్తగా ఆంక్షలు విధించడం వల్ల లబ్ధిదారుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని అబద్ధాలను అచ్చేసింది. గతేడాది నవంబర్ 23న జరిగిన చివరి విడతలో దరఖాస్తులు, ఆర్థిక సాయం విడుదల గమనిస్తే 'ఈనాడు' వక్రరాతల్లో డొల్లతనం అర్థమవుతోంది.

దరఖాస్తులకు గడువు ఆగస్టు-అక్టోబర్ 2023 వరకు	ఆర్థిక సాయం విడుదల: నవంబర్ 23, 2023
వచ్చిన దరఖాస్తుల సంఖ్య 11,807	అనర్హతకు గురయిన దరఖాస్తులు 1,196
ఆమోదం పొందిన దరఖాస్తులు 10,611	

ఈ జంటలకు ప్రభుత్వం రూ.81.64 కోట్లు పంపిణీ చేసింది.((అంతేకాకుండా ముందుగా దరఖాస్తు చేసుకున్న వారిలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను ప్రభుత్వం మరోసారి పరిశీలించి 267 జంటలకు రూ.2.15 కోట్లను అందించింది)) ఈనాడు తన కథనంలో గత ప్రభుత్వంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి అనే లెక్కలే ప్రస్తావించకపోవడం గమనార్హం. కానీ గతానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రతి దరఖాస్తులను పరిశీలించి, ధ్రువీకరించి, జాబితాలను కూడా సోషల్ ఆడిట్‌లో అందుబాటులో ఉంచుతోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద ఆర్థిక సాయం అందిస్తోంది.

నాడు-నేడు తేడా ఇలా..

- గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్థిక సాయం అనే మాటే కల్ల. ప్రస్తుత ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి నమోదైన లబ్ధిదారులందరికీ ఒకేసారి విడుదల చేస్తోంది.
- గత ప్రభుత్వం హయాంలో పట్టణ ప్రాంతాల్లోని మెప్మా కార్యాలయాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలోని 15,004 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్థానికంగానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.
- గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ఐకేపీల పరిధిలోని మండల సమాఖ్యల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులు ఉన్న చోట నుంచే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎంపిక చేస్తోంది.
- గత ప్రభుత్వం బకాయిలను విడుదల చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వివాహం జరిగిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకుంటే మూడు నెలలకు ఒకసారి అప్పటి వరకు వచ్చినవాటన్నింటికీ ఆర్థిక సాయం అందిస్తోంది. ఎలాంటి లంచాలకు తావు లేకుండా నేరుగా వధువుల తల్లుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తోంది.

‘టాలెంట్ హంట్’కు సిద్ధం!

- నేటి నుంచి నియోజకవర్గ స్థాయిలో నిర్వహణ
- ఆన్‌లైన్‌లో లైవ్‌తో పాటు స్కోర్ అప్‌డేట్లకు ఏర్పాట్లు

కీలక ఘట్టంలోకి ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడాపోటీలు కీలక ఘట్టంలోకి ప్రవేశించాయి. గ్రామ/వార్డు సచివాలయం, మండలస్థాయి పోటీలను దిగ్విజయంగా ముగించుకుని నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటేందుకు జట్లు ఉరకలేస్తున్నాయి. బుధవారం నుంచి 175 నియోజకవర్గ కేంద్రాల్లో పూర్తిస్థాయి ప్రొఫెషనల్ రీతిలో పోటీలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఏర్పాట్లు చేసింది. క్రిక్‌క్లబ్ యాప్, ‘ఆడుదాం ఆంధ్రా’ వెబ్‌సైట్ ద్వారా యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్ష వీక్షణం, ప్రత్యక్ష స్కోరును తిలకించేలా సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు కామెంట్రీలను నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ప్రభుత్వం 15 ఏళ్లకు పైబడిన మహిళలు, పురుషులకు 5 క్రీడాంశాల్లో మెగా టోర్నీకి శ్రీకారం చుట్టింది. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ (డబుల్స్)లో నియోజకవర్గ స్థాయి నుంచి నగదు బహుమతులను ప్రకటించింది. పోటీలను పక్కా ప్రొఫెషనల్ విధానంలో ఆయా క్రీడా ఫెడరేషన్ల నిబంధనల ప్రకారం నిర్వహించనుంది. టీ10 విధానంలో పూర్తిస్థాయి మ్యాచ్ బాల్‌తో క్రికెట్ పోటీలు, వాలీబాల్‌లో (25–25–15), బ్యాడ్మింటన్‌లో (21–21–21) బెస్ట్ ఆఫ్ త్రీ పాయింట్ల విధానాన్ని అమలు చేయనుంది. ఖోఖోలో 2 ఇన్నింగ్స్‌కు 9 నిమిషాలు, కబడ్డీ పురుషుల సెషన్‌కు 20 నిమిషాలు, మహిళలకు 15 నిమిషాలు చొప్పున సమయాన్ని కేటాయించింది.

భోజన, వసతి సౌకర్యాలతో..

మండలస్థాయి పోటీల్లో విజేతలకు ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసింది. వీరిని నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపేందుకు అవసరమైన చోట రవాణా, భోజన, వసతులను పర్యవేక్షిస్తోంది. ఈ నెలాఖరులోగా షెడ్యూల్ ప్రకారం పోటీలను పూర్తి చేసే లక్ష్యంతో సిబ్బందిని సమాయత్తం చేస్తోంది. 27 నుంచి పూర్తిస్థాయిలో క్రికెట్ పోటీలు ఊపందుకునేలా కార్యాచరణ రూపొందించింది. మండలాలు, మునిసిపాలిటీలు కలిపి 753 యూనిట్ల నుంచి 75,000 మందికిపైగా క్రీడాకారులు నియోజకవర్గ పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రతిభ వేట ప్రారంభం..

నియోజకవర్గ స్థాయి నుంచే ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)లకు చెందిన ప్రతినిధులు నియోజకవర్గాల్లోని పోటీలను పరిశీలించి ‘టాలెంట్ హంట్’ చేపట్టనున్నారు. ప్రో కబడ్డీ సంస్థ, ప్రైమ్ వాలీబాల్, ఏపీ ఖోఖో క్రీడా సంఘం, బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారుల బృందాలు యువతలోని ప్రతిభను గుర్తించి నివేదిక రూపొందించనున్నాయి.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో విజేతలకు నగదు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ స్థాయి	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ	35,000	60,000	5,00,000
ద్వితీయ	15,000	30,000	3,00,000
తృతీయ	5000	10,000	2,00,000

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో నగదు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ స్థాయి	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి
ప్రథమ	20,000	35,000	2,00,000
ద్వితీయ	10,000	20,000	1,00,000
తృతీయ	5000	10,000	50,000

అసలు ఆట ఇప్పుడే మొదలైంది



ఆంధ్రాను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తున్నాం. ఇది ఏటా కొనసాగిస్తాం. ప్రతిభ ఎక్కడ ఉన్నా వెతికిపట్టుకుని ప్రపంచ వేదికలపై నిలబెట్టడమే సీఎం జగన్ లక్ష్యం. ఇకపై అన్నీ కీలక ఘట్టాలే. ఇప్పుడే అసలు ఆట మొదలైంది. క్రీడాకారులు ప్రతి దశలోనూ అద్భుత ప్రతిభ కనబర్చాలి.

– ఆర్కే రోజా, క్రీడా శాఖ మంత్రి

ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్లు అందజేశాం



నియోజకవర్గ స్థాయి పోటీలకు సర్వం సిద్ధమైంది. ఎప్పటికప్పుడు జేసీలు, శాప్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. క్రీడాకారులకు భోజన వసతి సౌకర్యాలపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది తగిన ఆదేశాలిచ్చాం. మండలస్థాయి విజేతలకు ప్రొఫెషనల్ స్పోర్ట్స్ కిట్లు అందించాం. పూర్తిగా ప్రొఫెషనల్స్ తరహాలో టోర్నీ జరగనుంది.

– ధ్యాన్‌చంద్ర, శాప్ ఎండీ

బలిమెల నీటి వినియోగంపై కుదిరిన ఒప్పందం

ఆంధ్రాకు 25.5230, ఒడిశాకు 28.5966 టీఎంసీలు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): జిల్లాలోని జలవిద్యుత్ కేంద్రాలకు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయం నీటి నిల్వలపై మంగళవారం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. మంగళవారం జరిగిన సమావేశంలో అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. బలిమెల, జోలాపుట్టు జలాశయాల్లో మొత్తం 54.1196 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ఏపీకి 25.5230, ఒడిశాకు 28.5966 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం వ్యవసాయ, విద్యుత్ ఉత్పత్తి అవసరాల నిమిత్తం రోజువారీగా ఏపీ మూడు వేల క్యూసెక్కులు, ఒడిశా 1500 క్యూసెక్కులు వాడుకునేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో ఉప్పొంగిన అభిమానం.. విధులకు హాజరు

సాక్షి, అమరావతి: తమ సమస్యలు పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వం పట్ల అంగన్‌వాడీల్లో అభిమానం ఉప్పొంగింది. సమ్మెకు స్వస్తి పలికి విధుల్లో చేరిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ప్రభుత్వానికి అభినందన కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛందంగా సభలు ఏర్పాటు చేశారు. తమ డిమాండ్లలో 10 ఆమోదించి తక్షణం అమలు చేస్తున్నందుకు సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. సమస్యలన్నీ పరిష్కరించినందుకు ‘థ్యాంక్యూ సీఎం సార్’ అంటూ కృతజ్ఞతలు తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటూ కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వం కొనసాగాలని కోరుకుంటున్నామని, వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడానికి పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి పేద వర్గాల సేవలకు అవాంతరాలు తొలగించడం పట్ల కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యక్రమాలు యథావిధిగా సాగుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పట్ల, అలాగే వర్కర్లు, హెల్పర్ల పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి నుంచి సానుకూల వైఖరితోనే వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించడంతో పాటు వర్కర్లు, హెల్పర్లకు మెరుగైన వేతనాలు సీఎం వైఎస్ జగన్ పాలనలోనే అందిస్తున్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అంగన్‌వాడీ వర్కర్ల సగటు నెల వేతనం రూ.6,100 ఉంటే సీఎం జగన్ నాలుగున్నరేళ్లగా వర్కర్లకు రూ. 11,500 చొప్పున అందిస్తున్నారు.



విశాఖలో ఆనందంతో నృత్యం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

విశాఖలో సంబరాలు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): తమ సమస్యల పరిష్కారం కావడంతో మంగళవారం విశాఖపట్నంలోని గాంధీ విగ్రహం వద్ద భీమిలి, పెందుర్తి, విశాఖ అర్బన్ ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీల కార్యకర్తలు, హెల్పర్లు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం పంచుకున్నారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటాన్ని పట్టుకుని ‘జై జగన్’ అంటూ నృత్యాలు చేశారు. బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు బృందావతి, అధ్యక్షురాలు వై.తులసీ, కార్యదర్శి ఎల్.దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వం కొనసాగాలని మనసారా కోరుకుంటున్నాం



గతంలో అంగన్‌వాడీలు ఉద్యమాలు చేస్తే అణచివేసేందుకే ప్రయత్నాలు జరిగేవి. ఇప్పుడు వైఎస్సార్ ప్రభుత్వం అత్యంత సానుకూలంగా వ్యవహరించడంతో శాంతియుతంగానే మా సమస్యలు పరిష్కారమయ్యాయి. సీఎం వైఎస్ జగన్ మా 11 డిమాండ్లలో పది ఆమోదించి అమలు చేయడం పట్ల ఆనందంగా ఉంది. ఇలాంటి ప్రభుత్వం కొనసాగాలని మనసారా కోరుకుంటున్నాం.

– మహాలక్ష్మి, చాగల్లు అంగన్‌వాడీ వర్కర్, తూర్పుగోదావరి జిల్లా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మా సమస్యలను సానుకూలంగా పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మంగళవారం నర్సీపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ‘థ్యాంక్యూ సీఎం సార్’ కార్యక్రమాన్ని నిర్వహించాం. ప్రభుత్వం మాకు అండగా ఉందనే భరోసా దక్కడంతో సమ్మె విరమించి విధుల్లో చేరాం.

– రావాడ వెంకట సత్యవేణి, గొలుగొండపేట–1 అంగన్‌వాడీ వర్కర్, అనకాపల్లి జిల్లా

చంద్రబాబు గుర్రాలతో తొక్కించింది మరవలేం



సమస్యల పరిష్కారానికి ఆందోళన చేసిన అంగన్‌వాడీలను చంద్రబాబు హయాంలో గుర్రాలతో తొక్కించి, బాష్పవాయువును ప్రయోగించిన చేదు ఘటనను ఎప్పటికీ మరిచిపోలేం. సీఎం జగన్ మాత్రం మమ్మల్ని అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించిన తీరుతో ఉద్యోగ భద్రత లభించింది. మళ్లీ జగన్ ప్రభుత్వం రావడానికి సహకరిస్తాం.

– పి.విజయకుమారి, చాగల్లు అంగన్‌వాడీ వర్కర్, తూర్పుగోదావరి జిల్లా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



అంగన్‌వాడీల 11 డిమాండ్లలో 10 ఆమోదించి తక్షణం అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం, చనిపోతే మట్టి ఖర్చులు రూ. 20 వేలు ఇవ్వడం వంటి అనేక నిర్ణయాలతో మాకు చాలా మేలు జరుగుతుంది.

– అమిదెల సోములమ్మ, చిత్రకాయ పుట్టు అంగన్‌వాడీ వర్కర్, పెదబయలు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

మా కోర్కెలు తీర్చిన ఏకైక ప్రభుత్వం ఇది



రాష్ట్ర వ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లు తీర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఏవో కొన్ని డిమాండ్లు ఆమోదించి, మిగిలినవి తర్వాత చూద్దాం అని ప్రభుత్వం అంటుందని అనుకున్నాం. కానీ, మేము అడిగిన ప్రతీ డిమాండ్‌ను ఆమోదించి మనసున్న ముఖ్యమంత్రి అని వైఎస్ జగన్ మరోమారు నిరూపించారు.

– కొర్ర కన్యాకుమారి, వెల్లపాలెం అంగన్‌వాడీ హెల్పర్, పెదబయలు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పండి

పార్టీ ఫిరాయించిన నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాల మేరకు రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు మంగళవారం నోటీసులు జారీచేశారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో ఈ నెల 25వ తేదీలోపు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా పోటీ చేసి శాసనసభకు ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలు పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఈ నెల 8న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన స్పీకర్ తమ్మినేని సీతారాం.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు చట్ట ప్రకారం నోటీసులివ్వాలని లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారు.

ఏపీడీడీసీఎఫ్ఎల్ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీడీడీసీఎఫ్ఎల్) చైర్మన్‌గా చిల్లకూరు సుధీర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పశుసంవర్థక, డెయిరీ డెవలప్‌మెంట్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులిచ్చారు. సుధీర్‌రెడ్డి ఈ పదవిలో ఆర్నెల్ల పాటు కొనసాగనున్నారు. బుధవారం మంగళగిరి ఏపీఐఐసీ భవన్‌లోని ఏపీడీడీసీఎఫ్ఎల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు రూ.వెయ్యి చెల్లింపు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- మున్సిపల్ కార్మికులు, యూనియన్ నేతలకు ఇచ్చిన హామీ మేరకు సర్కారు చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు ఏక విడతన రూ.వెయ్యి చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఏ మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే వారికి ఆ మున్సిపాలిటీల జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలంటూ మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్ల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటీవల మున్సిపల్ కార్మికులు, ఆయా సంఘాల యూనియన్ నాయకులకు మంత్రుల బృందం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు.

ఆ దివ్య దరహాసం వెనుక..

బాలరాముని రూపకల్పనకు శిల్పి అరుణ్ తపస్సు ● స్కూళ్లకు వెళ్లి బాలల ముఖ కవళికల అధ్యయనం ● శిల్పశాస్త్ర పరిజ్ఞానమంతా రంగరించిన వైనం

రెండు రోజులుగా దేశమంతా ఎటు చూసినా బాలరాముడే. ఎక్కడ విన్నా అతన్ని గురించిన చర్చే. సోషల్ మీడియాలోనూ అయోధ్యలో కొలువు దీరిన రామ్ లల్లా ముచ్చట్లే. అతని ఫొటోలే. అందరినీ అమితంగా ఆకట్టుకుంటున్నది బాలరాముని మందస్మిత వదనం. సమ్మోహనమైన ఆ నవ్వుకు సెలబ్రిటీలు మొదలుకుని సామాన్యుల దాకా అందరూ ముగ్ధులవుతున్నారు. అమితమైన కరుణతోపాటు అంతులేని దివ్యత్వాన్ని వర్షిస్తున్న ఆ కళ్లు నిజంగా అద్భుతమంటూ కొనియాడుతున్నారు. అదే సమయంలో బాలలకు సహజమైన అమాయకత్వంతో చూస్తున్న ఆ నయనాల సొగసు వర్ణనాతీతమని ముక్త కంఠంతో చెప్తున్నారందరూ. బాలరాముని కళ్లను అంత అందంగా తీర్చిదిద్దినందుకు మైసూరుకు చెందిన ప్రఖ్యాత శిల్పి అరుణ్ యోగిరాజ్ ప్రతిభను ఎంత పొడిగినా తక్కువేనంటున్నారు. విగ్రహ రూపకల్పనకు, ముఖ్యంగా కళ్లను అంతలా తీర్చిదిద్దేందుకు ఆయన అక్షరాలా తపస్సే చేశారు. చిన్నపిల్లల ముఖ కవళికలను దగ్గరగా ఒడిసిపట్టేందుకు ఎన్నోసార్లు స్కూళ్లకు వెళ్లారు. శిల్పశాస్త్రాన్ని ఆమూలాగ్రం పదేపదే అధ్యయనం చేశారు. అరుణ్ దీక్ష, శ్రమ, పట్టుదలకు రాముని కరుణ తోడైందని భార్య విజేత చెబుతున్నారు. విగ్రహ రూపకల్పనకు అనువైన కృష్ణ శిలను ఎంచుకోవడం వంటివాటి వెనక దాగున్న సాంకేతికత మొదలుకుని దాన్ని అత్యంత అందంగా చెక్కేదాకా ప్రతి దశలోనూ అరుణ్ ఎదుర్కొన్న సవాళ్ల తదితరాలను ఆమె మీడియాతో వివరంగా పంచుకున్నారు.



శిల్పి అరుణ్ యోగిరాజ్ | అరుణ్ భార్య విజేత

శాస్త్ర ప్రమాణాల మేరకు...

విగ్రహ తయారీలో అరుణ్ పూర్తిగా శిల్ప శాస్త్ర ప్రమాణాలను అనుసరించారు. ఆ మేరకే బాల రాముని ముఖారవిందపు స్వరూప స్వభావాలను ఖరారు చేశారు. ముఖ్యంగా కళ్లు, ముక్కు, చుబుకం, పెదాలు, చెంపల నిష్పత్తి తదితరాలను శాస్త్రంలో నిర్దేశించిన మేరకు నిర్ణయించారు. ''అరుణ్ చేతిలో నిజంగా అద్భుతమైన కళ దాగుంది. విగ్రహం ఎలా ఉండాలో రామ జన్మభూమి ట్రస్టు ప్రతినిధులు క్లుప్తంగా చెప్పారు. నవ్వుతున్న ముఖం, దివ్యత్వం, ఐదేళ్ల స్వరూపం, రాకుమారుని రాజసం... ఇవీ అరుణ్‌తో పాటు మరో ఇద్దరు శిల్పులు జీఎల్‌భట్, సత్యనారాయణ పాండేకు వాళ్లు నిర్దేశించిన ప్రాతిపదికలు. అవి మినహా మిగతాదంతా అరుణ్ ఊహ, భావుకతల ఫలమే. ఇందుకోసం చిన్నపిల్లల స్కూళ్లకు వెళ్లి గంటల కొద్దీ గడిపాడు. వాళ్ల ముఖ కవళికలు, అవి పలికించే భావాలను లోతుగా పరిశీలించాడు. వాటిని పేపర్‌పై ఎప్పటికప్పుడు స్కెచ్‌లుగా గీసుకున్నాడు. అవయవాల పొందిక నిమిత్తం శరీర నిర్మాణ శాస్త్ర పుస్తకాలు తిరగేశాడు. అందుకే విగ్రహం అంత వాస్తవికంగానూ, అదే సమయంలో ఎంతో ముగ్ధ మనోహరంగానూ రూపుదిద్దుకుంది'' అని విజేత వివరించారు. ''అరుణ్ నిజంగా అత్యంత అదృష్టశాలి. మా ఆయనతో రాముడే ఇంతటి మహత్కార్యం చేయించుకున్నాడు'' అంటూ మురిసిపోయారు.

గుండ్రని ముఖమండలం...

ఉత్తరాది సంప్రదాయంలో రూపొందే శిల్పాల ముఖం, ముఖ లక్షణాలు కాస్త కొనదేరి ఉంటాయి. అయోధ్య బాలరాముని ముఖమండలం గుండ్రని రూపుతో కనువిందు చేస్తోంది. ఇది దక్షిణాదిలో శిల్పాల రూపకల్పనలో ఎక్కువగా కన్పిస్తుందని ఢిల్లీలోని ప్రముఖ చరిత్రకారుడు, రచయిత విక్రం సంపత్ అన్నారు. ''కానీ కాస్త చక్కని చుబుకం, ఉబ్బెత్తు చెంపలు, బుల్లి పెదాలు, వాటిపైనే గాక ముఖమంతటా పరుచుకున్న మార్మిక మందహాసం

51 అంగుళాల వెనక...

రామ్ లల్లా విగ్రహం ఎత్తును 51 అంగుళాలుగా నిర్ణయించడం వెనక కూడా శాస్త్రీయ కారణాలున్నట్టు విజేత చెప్పారు. ''ఏటా రామనవమి రోజున సూర్య కిరణాలు సరిగ్గా బాల రాముని నుదిటిపై పడాలన్నది ట్రస్టు నిర్ణయం. ఆలయ నిర్మాణం తదితరాల దృష్ట్యా విగ్రహం సరిగ్గా 51 అంగుళాల ఎత్తుంటేనే అది సాధ్యం'' అన్నారు. అవసరమైన మేరకు పలు విషయాల్లో పలురకాల సాఫ్ట్‌వేర్ల సాయమూ తీసుకున్నా అంతిమంగా కేవలం సుత్తి, ఉలి ఉపయోగించి విగ్రహాన్ని ఆసాంతం అరుణ్ తన చేతులతోనే చెక్కారని వివరించారు.


బాలరాముని మందస్మిత వదనం

కృష్ణ శిలే ఎందుకు?

విగ్రహ రూపకల్పనకు కృష్ణ శిలనే ఎంచుకోవడం వెనక శాస్త్రీయ కారణాలున్నాయి. ఆమ్లాలతో ఈ శిల ప్రతి చర్య జరపదు. వేడి, తీవ్ర వాతావరణ చర్యలకు కూడా స్పందించదు. ''కనుక పాలు తదితరాలతో అభిషేకం చేసినప్పుడు వాటితో చర్య జరపదు. దాంతో రెండు లాభాలు. వాటిని ప్రసాదంగా తీసుకున్నా ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావమూ ఉండదు. ఈ లక్షణం వల్ల విగ్రహం కనీసం వెయ్యేళ్ల దాకా చెక్కుచెదరదు. దానిపై కనీసం గీత కూడా పడదు'' అని విజేత వివరించారు. అత్యున్నత నాణ్యతతో కూడిన కృష్ణ శిలలు కొన్నిచోట్ల మాత్రమే దొరుకుతాయి. బాలరామున్ని రూపొందించేందుకు వాడిన కృష్ణ శిల ఆ కోవలోదేనని విజేత చెప్పారు. ఇది మైసూరు సమీపంలోని హెచ్‌డీ కోటె దగ్గర లభ్యమైంది.

... ఇలాంటి దివ్య లక్షణాలన్నీ బాలరాముని ముఖంలో ప్రస్ఫుటమవుతున్న తీరు మాత్రం నిజంగా అద్భుతమేనని చెప్పారాయన. ఈ విషయంలో శిల్పిగా అరుణ్ పనితనాన్ని ఎంత పొగిడినా తక్కువేనన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మూడు కూనలకు జన్మనిచ్చిన చీతా

భోపాల్/న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కు(కేఎన్‌పీ)లో జ్వాల అనే చీతా ఈ నెల 20న మూడు కూనలకు జన్మనిచ్చింది. గత ఏడాది మార్చిలో కూడా జ్వాలకు మూడు కూనలు పుట్టాయి. అయితే, వీటిలో ఒకటి మాత్రమే బతికింది. జనవరి 3వ తేదీన ఆషా అనే చీతా కూడా మూడు కూనలకు జన్మనిచ్చిన విషయాన్ని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ మంగళవారం 'ఎక్స్'లో గుర్తు చేశారు. దీంతో, కేఎన్‌పీలో ఉన్న మొత్తం కూనలు ఏడుకు చేరాయని చెప్పారు. అదేవిధంగా, 2023 మార్చి నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో మూడు కూనలు సహా మొత్తం 10 చీతాలు చనిపోయాయని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కేఎన్‌పీ ఏడు కూనలు, ఆరు మగ, ఏడు ఆడ చీతాలు కలిపి మొత్తం 20 ఉన్నాయన్నారు. దేశంలో అంతరించిపోయిన చీతాల సంఖ్యను పెంచేందుకు కేంద్రం 2022, 2023 సంవత్సరాల్లో నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

పార్లమెంట్ భద్రత విధుల్లో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది


న్యూఢిల్లీ: పార్లమెంట్ భవన సముదాయం భద్రత కోసం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్)నకు చెందిన 140 మంది సిబ్బందిని మోహరించారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. గత డిసెంబర్ 13వ తేదీన పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో అయిదుగురు వ్యక్తులు లోపలికి ప్రవేశించి ఎంపీలపైకి రంగుల పొగను వదిలిన ఘటన కలకలం రేపిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ ఈ మేరకు చర్యలు తీసుకుంది. సోమవారం సీఐఎస్‌ఎఫ్‌కు చెందిన 140 సిబ్బంది పార్లమెంట్ సముదాయం భద్రతా విధుల్లో చేరారు. వీరికి అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారి సారథ్యం వహిస్తున్నారు. ఇందులో అగ్నిమాపక విభాగానికి చెందిన 36 మంది సిబ్బంది కూడా ఉన్నారు. వీరంతా ఎక్స్ రే యంత్రాలు, డిటెక్టర్లతో సందర్శకుల షూలు, భారీ జాకెట్లు, బెల్టులను స్కాన్ చేయనున్నారు.

21 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతి

జెరూసలేం: గాజాలో ఇజ్రాయెల్ రక్షణ దళా(ఐడీఎఫ్)నికి తొలిసారి ఎదురుదెబ్బ తగిలింది. ఒకే ఘటనలో 27 మంది సైనికులు మృతి చెందారు. అక్టోబర్ 7వ తేదీన హమాస్‌పై యుద్ధం మొదలయ్యాక ఇంతమంది సైనికులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారి. యుద్ధం నిలిపేసి, బందీలను విడుదలయ్యేలా చూడాలంటూ నెతన్యాహు ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెరుగుతున్న సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనను ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ పరిణామంపై ప్రధాని నెతన్యాహు స్పందిస్తూ.. పూర్తి స్థాయి విజయం సిద్ధించే దాకా యుద్ధం కొనసాగుతుందని ప్రకటించారు.

విద్యార్థి వీసాల్లో కెనడా భారీ కోత

ఒట్టావా: అంతర్జాతీయ విద్యార్థి వీసాలపై కెనడా ప్రభుత్వం భారీ కోతలు ప్రకటించింది. విద్యార్థులకు ఇళ్ల కొరతను నివారించడం, వ్యవస్థాపరమైన లోపాలను సవరించడమే తమ నూతన విధాన లక్ష్యమని తెలిపింది. కెనడా ప్రభుత్వ నిర్ణయం భారత నుంచి వచ్చే విద్యార్థులపై గణనీయంగా ప్రభావం చూపనుంది. 2024లో కొత్తగా జారీ చేసే విద్యార్థి వీసాల్లో 35 శాతం వరకు తగ్గుదల ఉంటుందని ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు. దీనివల్ల గత ఏడాది సుమారు 5.60 లక్షల విద్యార్థి వీసాలను జారీ చేసిన కెనడా ప్రభుత్వం ఈడాది 3.64 లక్షల వీసాలకు మాత్రమే ఆమోదం తెలపనుంది. ఈ పరిమితి రెండేళ్లు అమల్లో ఉంటుందని మంత్రి మిల్లర్ చెప్పారు. దీని ప్రభావం ఉన్నత చదువుల కోసం కెనడా రావాలనుకునే భారతీయ విద్యార్థులపై పడనుంది. తాజా మార్పులు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నేత జెన్నీ క్వాన్ మండిపడ్డారు. కెనడాకు వచ్చే ప్రతిభావంతులైన విద్యార్థులకు అడ్డంకిగా మారుతాయని అన్నారు.


మంగళవారం ఉదయం అయోధ్య రామమందిరం వద్ద రామ్‌లల్లా దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

- అయోధ్యలో తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లు
- 5 లక్షల మందికి పైగా దర్శనం
- 30 కిలోమీటర్ల దాకా ట్రాఫిక్ జామ్

అయోధ్య: అయోధ్య అక్షరాలా భక్తజన సంద్రంగా మారుతోంది. అంగరంగ వైభవంగా కొలువుదీరిన బాలరామున్ని కళ్లారా దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచీ భక్తులు సరయూ తీరానికి పోటెత్తుతున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ట వేడుక ప్రధానంగా వీఐపీలకు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. సాధారణ భక్తులకు మంగళవారం నుంచి అనుమతిస్తామని ముందుగానే ప్రకటించారు. దాంతో తెల్లవారుజాము మూడింటి నుంచే భారీ క్యూ లైన్లు మొదలయ్యాయి. ఉదయానికల్లా అవి విపరీతంగా పెరిగిపోయాయి. ఆలయానికి దారితీసే ప్రధాన రహదారి రామ్ పథ్ భక్తుల వరదతో నిండిపోయింది. వారి జై శ్రీరాం నినాదాలతో పరిసరాలన్నీ ప్రతిధ్వనించాయి. పోలీసు సిబ్బంది కష్టమ్మీద వాటిని నియంత్రించారు. ఉదయం ఆరింటి నుంచి 11.30 దాకా దర్శనాలను అనుమతించారు. ఆ సమయంలో ఏకంగా 2.5 లక్షల నుంచి 3 లక్షల మంది దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఏడింటికి రెండో విడతలో మరో 2 లక్షల పై చిలుకు భక్తులకు దర్శనం జరిగినట్టు అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం అయోధ్యను సందర్శించి భక్తులకు దర్శన ఏర్పాట్లు తదితరాలను స్వయంగా పర్యవేక్షించారు.

దేశ నలుమూలల నుంచీ...

అయోధ్యకు తరలివస్తున్న భక్తుల్లో మహారాష్ట్ర, తెలంగాణ మొదలుకుని అటు పశ్చిమబెంగాల్, అసోం దాకా పలు రాష్ట్రాల వారున్నారు. వీరిలో చాలామందికి అయోధ్య సందర్శన ఇదే తొలిసారి. వీరిలో చాలామంది కనీసం రెండు మూడు రోజుల పాటు ఉండి నగరాన్ని పూర్తిగా సందర్శించేలా ప్లాన్ చేసుకున్నవారే. పలువురు భక్తులు రైల్వేస్టేషన్, బస్టాండ్ల నుంచి నేరుగా లగేజీతో సహా ఆలయానికి వచ్చేస్తున్నారు! సోమవారం మాదిరిగానే మంగళవారం కూడా తెల్లవారుజామునే ఆలయ పరిసరాల్లో రామ్ ధున్ మారుమోగింది. అయోధ్యకు వాహనాల ట్రాఫిక్ కూడా ఊహాతీతంగా పెరిగిపోయింది. దాంతో నగరానికి 30 కిలోమీటర్ల దూరం దాకా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతం: మోదీ

అయోధ్య భవ్య మందిరంలో సోమవారం బాల రాముని ప్రాణప్రతిష్ట మహోత్సవం జరిగిన తీరు మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతంగా ఉండిపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వేడుకకు సంబంధించిన వీడియోలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రాణప్రతిష్ట క్రతువులో ముఖ్య యజమానులుగా పాల్గొన్న 14 మంది దంపతుల్లోనూ ఇదే భావన వ్యక్తమైంది. దాన్ని సాటిలేని దివ్యానుభూతిగా అభివర్ణించారు. దాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని వారణాసిలోని మణికర్ణిక ఘాట్ శ్మశానవాటిక కాటికాపరి కుటుంబానికి చెందిన అనిల్ చౌదరి, సప్నాదేవి దంపతులు అన్నారు. వీరందరినీ దేశ నలుమూలల నుంచీ ప్రత్యేకంగా ఎంపిక చేయడం తెలిసిందే.

అయోధ్య రామయ్య ఇకపై బాలక్ రామ్

అయోధ్య మందిరంలో కొలువుదీరిన రామ్ లల్లాను ఇకపై బాలక్ రామ్‌గా పిలవనున్నారు. స్వామి ఐదేళ్ల బాలుని రూపులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆలయ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్‌గా పిలవనున్నట్టు ప్రకటించారు. వారణాసికి చెందిన ఆయన సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ''ఇప్పటిదాకా దాదాపు 60 దాకా ఆలయాల ప్రాణప్రతిష్టల్లో పాలుపంచుకున్నా. వాటన్నింట్లోనూ అయోధ్య ప్రాణప్రతిష్ట సర్వోత్తమం. ఆ సందర్భంగా అత్యంత అలౌకికానుభూతికి లోనయ్యా'' అని దీక్షిత్ చెప్పుకొచ్చారు.

ఆరు హారతులు, నైవేద్యాలు

బాలక్ రామ్ రోజూ ఆరు హారతులు అందుకోనున్నాడు. స్వామికి ఉదయం మంగళారతితో మొదలు పెట్టి శృంగార, భోగ, ఉపతన, సంధ్యా హారతుల అనంతరం చివరగా శయనారతితో నిద్ర పుచ్చుతారు. బాలక్ రాముడు సోమవారం తెలుపు వస్త్రాల్లో, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం గోధుమ, శనివారం నీలం, ఆదివారం గులాబీ రంగు వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిస్తాడు. రబ్డీ, ఖీర్, పళ్లు, పాలతో పాటు పలురకాల నైవేద్యాలు అందుకుంటాడు.

శాశ్వత సభ్యత్వం లేకపోవడం అర్ధరహితం

భద్రతా మండలిలో భారత ప్రాతినిధ్యంపై కుబేరుడు ఎలాన్ మస్క్

న్యూయార్క్: విశ్వమానవాళిలో అత్యధిక జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ప్రాతినిధ్యం లేకపోవడాన్ని కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా తప్పుబట్టారు. భద్రతా మండలి వంటి ఐరాస అనుబంధ విభాగాల్లో తక్షణం సంస్కరణలు అవసరమని వ్యాఖ్యానించారు. ఐరాస భద్రతా మండలిలో కనీసం ఒక్క ఆఫ్రికన్ దేశానికి చోటు దక్కకపోవడాన్ని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అమెరికాలో పుట్టిన ఇజ్రాయెల్ పెట్టుబడిదారుడు మైఖేల్ ఐసన్‌బర్గ్ స్పందించారు. 'ఆఫ్రికా దేశాల పరిస్థితి తెల్సిందే. మరి భారత్ సంగతేంటి?' అని ప్రశ్నించారు. దీనిపై ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు. ''ప్రపంచంలోని అత్యధిక జనాభా ఉన్న దేశాలకు ఐరాస సరైన ప్రాతినిధ్యం కల్పించట్లేదు. ఐరాస అనుబంధ విభాగాల్లో వెంటనే సంస్కరణలు తేవాలి. అసాధారణ అధికారాలను అనుభవిస్తున్న దేశాలు తమ అపరిమిత అధికారాలను వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ అసలు సమస్య. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో జన భారత్‌గా కీర్తింపబడుతున్న ఇండియాకు ఐరాస భద్రతా మండలిలో ఇన్నేళ్లయినా సభ్యత్వం లేకపోవడం అర్ధరహితం, హాస్యాస్పదం'' అని మస్క్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''భద్రతా మండలిలో సంస్కరణలాభిలాషిగా, విశ్వశ్రేయస్సు కోరే దేశంగా భారత్ ఏనాడో పేరొందింది. అలాంటి భారత్‌కు మెంబర్‌షిప్ దక్కాల్సిందే. 21వ శతాబ్దపు భౌగోళిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా భద్రతా మండలి కూర్పు లేదు' అని మస్క్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికాలకు మాత్రమే భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉంది.

బంధుప్రీతి, అవినీతి నుంచి దేశానికి విముక్తి కల్పించాలి

మహిళలు, యువతకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం సిద్ధించాక దేశాభివృద్ధికి వారసత్వ రాజకీయాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం అడ్డంకులుగా మారాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని ఇటువంటి దుష్ట శక్తుల నుంచి విముక్తం చేయాలని ప్రజలకు ముఖ్యంగా మహిళలు, యువతకు ఆయన పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారసత్వ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాత అనే రెండు దుష్ట శక్తులు దేశ ప్రజాస్వామ్యాన్ని శాసించడం మొదలుపెట్టాయని పేర్కొన్నారు. 'మన దేశాన్ని గొప్పగా మార్చాలంటే రాజకీయ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సమాజం అనే పునాదులు గట్టిగా ఉండాలని నేతాజీ అనేవారు. కానీ, దురదృష్టవశాత్తూ, ఆయన ఆదర్శాలపై తీవ్రంగా దాడి జరిగింది'అని ప్రధాని పేర్కొన్నారు. 'దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి నేతాజీకి బాగా తెలుసు. వాటి గురించి ప్రతి ఒక్కరినీ ఆయన హెచ్చరించేవారు. దేశ ప్రజాస్వామ్యాన్ని బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు శాసించడం మొదలు పెట్టాక దేశం వెనుకబాటుకు గురైంది. వీటి నుంచి విముక్తి కల్పించే శక్తి యువత, మహిళలకు ఉంది'అని ప్రధాని పేర్కొన్నారు.

నేతాజీ స్ఫూర్తి కొనసాగుతుంది

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన అలుపెరగని పోరాటం ఇప్పటికీ మనలో స్ఫూర్తిని రగిలిస్తోందని పేర్కొన్నారు. నేతాజీ జయంతిని ఏటా పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటారు.

బహిరంగంగా దండించే అధికారం ఎవరిచ్చారు?

గుజరాత్ పోలీసులను మందలించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: 2022లో గుజరాత్‌లోని ఖేడాలో ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అయిదుగురిని బహిరంగంగా కొట్టిన ఘటనపై సుప్రీంకోర్టు ఆ రాష్ట్ర పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్తంభానికి కట్టేసి కొట్టే అధికారం ఎవరిచ్చారని నిలదీసింది. నిర్బంధం, అనుమానితుల విచారణలకు సంబంధించి సుప్రీంకోర్టు 1996లో ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోనందుకు కోర్టు ధిక్కారంగా పరిగణిస్తూ గుజరాత్ హైకోర్టు నలుగురు పోలీసులకు 14 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ ఏవీ పర్మార్, సబ్ ఇన్‌స్పెక్టర్ డీబీ కుమావత్, హెడ్ కానిస్టేబుల్ కేఎల్ దభి, కానిస్టేబుల్ ఆర్‌ఆర్ దభీలు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఈ అఘాయిత్యాలను ఏమనాలి? అందరూ చూస్తుండగానే ప్రజలను స్తంభానికి కట్టేసి కొడతారా. అలా చేసే అధికారం మీకుందా? కోర్టు జోక్యం చేసుకోవాలంటూ మళ్లీ మీదే వస్తారు. అయితే, వెళ్లండి, కస్టడీని అనుభవించండి. మీరు పనిచేసే చోట మీరే అతిథులుగా ఉండండి. అక్కడ మీకు ప్రత్యేక ఆతిథ్యం కూడా దొరుకుతుంది'అని ధర్మాసనం తీవ్రస్వరంతో పేర్కొంది. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే పదేపదే కోరడంతో 14 రోజుల జైలు శిక్షపై ధర్మాసనం స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్డుకుని..మంచి ప్రచారం ఇచ్చారు!

- అస్సాం సీఎంపై రాహుల్ వ్యంగ్య బాణం
- ఆయనపై కేసు పెట్టాలని హిమంత బిశ్వ శర్మ ఆదేశం

గువాహటి: అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తుతున్నాయి. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తమ భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడ్డంకులు కల్పిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తుండగా, రాహుల్ ప్రజలను రెచ్చగొడుతున్నారని సీఎం శర్మ అంటున్నారు. మంగళవారం అస్సాంలోని గువాహటిలో భారత్ జోడో న్యాయ్ యాత్రను పోలీసులు అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రాహుల్ గాంధీ డొమ్‌డొమాలో మీడియాతో మాట్లాడారు. అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం తమ యాత్రకు అవరోధాలు కల్పిస్తోందని ఆయన ఆరోపించారు. ఇటువంటి చర్యలతో తమ యాత్రకు లాభమే తప్ప నష్టం లేదన్నారు. యాత్రకు మరింత ప్రచారం వస్తుందని చెప్పారు. ఇప్పటికే యాత్ర ఇక్కడ ప్రధాన చర్చనీయాంశంగా మారిందన్నారు. సీఎం శర్మ దేశంలోని అత్యంత అవినీతి పరులైన సీఎంలలో ఒకరు. మేం వెళ్లిన ప్రతిచోటా జనం ఇదే చెబుతున్నారన్నారు.


గువాహటిలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

హోం మంత్రి అడ్డుకుంటున్నారు

భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా మేఘాలయలోని ప్రైవేట్ వర్సిటీ విద్యార్థులతో తాను మాట్లాడకుండా కేంద్ర హోంశాఖ నుంచి అందిన ఆదేశాల మేరకు అధికారులు అడ్డుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అస్సాం సరిహద్దుల్లో ఉన్న మేఘాలయలోని రి భోయ్ జిల్లాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విద్యార్థులు, పౌర సంఘాల నేతలతో మంగళవారం ఉదయం మాట్లాడాల్సి ఉందన్నారు. అయితే, హోం శాఖ, అస్సాం సీఎం శర్మ నుంచి అందిన ఆదేశాల మేరకు నిర్వాహకులు అనుమతి నిరాకరించారని చెప్పారు. దీంతో, కార్యక్రమ వేదికను ఓ హోటల్‌కు మార్చుకోవాల్సి వచ్చిందని అనంతరం న్యాయ్ యాత్రలో భాగంగా జరిగిన ర్యాలీలో రాహుల్ ప్రకటించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బారికేడ్లను విరగొట్టాలంటూ ప్రజలను రెచ్చగొట్టి నక్సలైట్ల మాదిరి చర్యలకు దిగుతున్నారని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొడుతున్న రాహుల్‌పై కేసు నమోదు చేయాలంటూ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్ కన్హయ్య కుమార్‌లపై కేసులు నమోదు చేశారు.

గణతంత్ర వేడుకల్లో అయోధ్య రాముడు

సాక్షి, న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక ధామం అయోధ్యలో రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ట వైభవోపేతంగా జరిగిన మరుసటి రోజే ఆయనను మరోసారి గుర్తుచేస్తూ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో బాలరాముని దివ్యప్రతిమతో రాష్ట్ర శకటాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. దీంతో ఈ ఏడాది ఢిల్లీలో కర్తవ్యపథ్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో అయోధ్య బాలరాముడు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. యూపీ సర్కార్ అయోధ్య రామాలయం, మహాకుంభమేళ ఇతివృత్తంతో శకటానికి తుదిరూపునిచ్చింది. త్వరలో ప్రయాగ్‌రాజ్ నగరంలో జరగబోయే మాఘ మేళా, 2025లో జరగబోయే మహాకుంభ మేళాలను ప్రతిబింబించేలా ఈ శకటాన్ని రూపొందించారు. శకటంలో ఇద్దరు సాధువులు, భారీ కలశాల ప్రతిమలకు చోటు కల్పించారు. ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో మొత్తం 30 శకటాలు ప్రదర్శించనున్నారు. గణతంత్ర దినోత్సవం తర్వాత జనవరి 26 నుంచి 31వ తేదీ వరకు ఎర్రకోట సమీపంలో 'భారత్ పర్వ్'లో ప్రజల సందర్శనార్థం ఈ శకటాలను ప్రదర్శనకు ఉంచుతారు.

క్లుప్తంగా...

30న కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా దేశ వ్యాప్తంగా అమరులైన వైద్యులను స్మరిస్తూ ఈ నెల 30వ తేదీన కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరస్‌పై పోరాటంలో దేశ వ్యాప్తంగా రెండు వేల మందికిపైగా వైద్యులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారిలో మన రాష్ట్రానికి చెందిన 124 మంది వైద్యులు ఉన్నారని తెలిపారు. ఈ పోరాటంలో వైద్యుల పట్ల ప్రభుత్వం, ప్రజలు చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.

సైక్లింగ్‌లో సురేశ్‌కు రజతం



సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ సైక్లింగ్ క్రీడాకారుడు కుమ్మర సురేశ్‌బాబు రజత పతకం సాధించాడు. చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీలో మంగళవారం జరిగిన పోటీల్లో వ్యక్తిగత 10 కిలోమీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సురేశ్ కుమార్ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం కేరళలోని శాయ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల జూనియర్ ఆసియా గేమ్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

11న 'దేశీయ గో-జాతుల' సమస్యలపై రాష్ట్ర సదస్సు

సాక్షి, అమరావతి: దేశీయ గో–జాతుల అనారోగ్య సమస్యలపై రైతు నేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కొర్నెపాడులోని ఫౌండేషన్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సదస్సు ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ సదస్సులో దేశీ ఆవుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు గోవులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశీ గోవులకు గర్భకోశ, పొదుగు, పాల సంబంధిత వ్యాధులకు చికిత్సా విధానాలపై సలహాలు సూచనలు ఇస్తారన్నారు. ఈ సదస్సుకు గో–పోషకులు అందరూ ఆహ్వానితులేనని, భోజన వసతి కూడా ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 97053 83666, 70939 73999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.

'స్కిల్' నిందితుడి అప్రూవర్ పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో నిందితుడి(ఏ–13)గా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్‌షా దాఖలు చేసిన అప్రూవర్ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు తదితరులు నిబంధనలకు విరుద్ధంగా నిధులు కొల్లగొట్టేందుకు బోగస్ ఇన్వాయిస్‌లను తానే సమకూర్చానని ఆ పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు(ఏ–22), షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా తనను కలసి బోగస్ ఇన్వాయిస్‌లు అడిగారని తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ నిమిత్తం చంద్రకాంత్‌షా మంగళవారం ఏసీబీ కోర్టుకు హాజరుకాగా.. కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు గడువు కావాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరారు. న్యాయస్థానానికి సీఐడీ సమర్పించిన పత్రాల కాపీలు కావాలని కోరారు. కోర్టు స్పందిస్తూ.. అందుకు ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులను ఆదేశించింది. ఆ తర్వాతే చంద్రకాంత్‌షా వాంగ్మూలాన్ని నమోదు చేస్తామని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది.

నేడు 'ఉమ్మిడి' జ్యువెలర్స్ ఎగ్జిబిషన్

- విజయవాడలో రెండు రోజుల పాటు నిర్వహణ

విజయవాడ: ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ ఎగ్జిబిషన్ విజయవాడ నగరంలో బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఉమ్మిడి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లెమన్‌ట్రీ ప్రీమియర్‌లోని టాంగెరైన్ హాల్ 1, 2ల్లో జ్యువెలర్స్ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. 123 ఏళ్ల వారసత్వం కలిగిన తమ బ్రాండ్ నుంచి సాంప్రదాయిక, వారసత్వ ఆభరణాలతో పాటు వైవిధ్యభరితమైన వివాహ ఆభరణాల్లో లక్ష్మీ హారాలు, నెమలి హారాలు కస్టమర్ల మనస్సు దోచుకుంటాయని తెలిపారు. ప్రత్యేకంగా రూపుదిద్దిన బంగారు ఆభరణాలు, శోభాయమానమైన వెండి వస్తువులు, ట్రెండీ జ్యువెలరీ ఈ ప్రదర్శనలో ఉంటాయని పేర్కొన్నారు. మా ఆభరణాల్లో ప్రతిదాన్ని చెన్నైలోని మా క్రియేటివ్ సెంటర్‌లో ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మీ ఓటును సరిచూసుకోండి!



తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

ఓటు లేకపోతే వెంటనే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసేందుకు వీలు

ఓటు ఉందో.. లేదో తెలుసుకోవడానికి బీఎల్‌వోలతో పాటు ఆన్‌లైన్ ద్వారా అవకాశం

సత్తెనపల్లి: తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల కమిషన్.. దానిని ఆన్‌లైన్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంచింది. జాబితాలో మీ పేరు ఉందో.. లేదో.. వెంటనే సరిచూసుకోవచ్చు. ఏమైనా అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక సెల్ కూడా ఏర్పాటు చేసింది. ఒకవేళ జాబితాలో మీ ఓటు లేకపోతే.. ఫారం–6 పూర్తి చేసి ఓటరుగా నమోదు చేసుకోవడానికి నామినేషన్ల చివరి రోజు వరకు అనుమతిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. మీ ఓటును సంబంధిత పోలింగ్ కేంద్రం బూత్ లెవల్ అధికారి వద్ద గానీ, స్మార్ట్‌ఫోన్, వెబ్‌సైట్‌ల ద్వారా గానీ సులభంగా తెలుసుకోవచ్చు.

'స్మార్ట్'గా తెలుసుకోండిలా..

https://ceoandhra.nic.in వెబ్‌సైట్‌లోకి వెళితే పైభాగంలో పీడీఎఫ్ ఎలక్టోరల్ రోల్స్ అనే విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే అసెంబ్లీ నియోజకవర్గాలు అనే విభాగం కనిపిస్తుంది. అక్కడ తుది జాబితా–2024పై క్లిక్ చేసి మీ జిల్లా, మీ శాసనసభ నియోజకవర్గం నమోదు చేయాలి. ఆ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా పీడీఎఫ్ ఫైల్స్‌లో వస్తాయి. మీ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల జాబితాను డౌన్‌లోడ్ చేసుకొని.. మీ ఓటు ఉందో? లేదో? చూసుకోవచ్చు. అలాగే https://voterportal.eci.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే.. 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' అనే విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి.. మీ ఓటర్ గుర్తింపు కార్డు నంబర్‌ను నమోదుచేస్తే జాబితాలో మీ పేరు ఉందో..? లేదో..? ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది? సీరియల్ నంబర్ ఎంత? తదితర వివరాలన్నీ కనిపిస్తాయి. మీ ఓటర్ గుర్తింపు కార్డు నంబర్ తెలియకపోతే.. 'అడ్వాన్స్‌డ్ సెర్చ్' విభాగంలోకి వెళ్లి మీ పేరు, తండ్రి పేరు, జిల్లా, శాసనసభ నియోజకవర్గం వివరాలు పొందుపరిచి జాబితాలో మీ పేరు ఉందో? లేదో? తెలుసుకోవచ్చు. అలాగే www.nvsp.in వెబ్‌సైట్‌లోకి వెళితే.. 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' అనే విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై డీటెయిల్స్,' 'సెర్చ్ బై ఎపిక్ నంబర్' అనే రెండు ఉప విభాగాలు ఉంటాయి. మీ పేరు, తండ్రి పేరు, జిల్లా, నియోజకవర్గం తదితర వివరాలు నమోదు చేసి లేదా ఓటర్ గుర్తింపు కార్డు సంఖ్యను నమోదు చేసి ఓటరు జాబితాలో మీ పేరు ఉందో? లేదో? తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌తో చిటికెలో..

గూగుల్ ప్లే స్టోర్‌లో ఎన్నికల సంఘానికి సంబంధించిన 'ఓటర్ హెల్ప్ లైన్' యాప్ ఉంటుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని మీ ఫోన్ నంబర్, వివరాలతో రిజిస్టర్ చేసుకొని.. లాగిన్ కావాలి. యాప్‌లో 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' అనే విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై బార్‌కోడ్, సెర్చ్ బై క్యూఆర్ కోడ్, సెర్చ్ బై డీటెయిల్స్, సెర్చ్ బై ఎపిక్ నంబర్' అనే నాలుగు ఆప్షన్లు కనిపిస్తాయి. మీ ఓటరు గుర్తింపు కార్డుపై ఉన్న బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మీ ఓటు ఉందో? లేదో? తెలుసుకోవచ్చు. కార్డు నంబర్ ఉంటే ఎపిక్ నంబర్ ద్వారా సరిచూసుకోవచ్చు. లేకపోతే మీ పేరు, తండ్రి పేరు, వయసు, జిల్లా, నియోజకవర్గం తదితర వివరాలు పొందుపరచడం ద్వారా తెలుసుకునే వీలుంది.

పోలింగ్ కేంద్రంలోనూ అవకాశం..

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. వారి వద్ద ఆ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల జాబితా ఉంటుంది. అందులో మీ ఓటు ఉందో? లేదో? సరిచూసుకోవచ్చు. ఓటు లేకపోతే వెంటనే బీఎల్‌వో ద్వారా గానీ వెబ్‌సైట్ ద్వారా గానీ ఫారం–6 పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడాలి

ఏపీ ఎడిబుల్ ఆయిల్స్ ట్రేడ్ ఓనర్స్ అసోసియేషన్



మాట్లాడుతున్న పెంచుల్ రెడ్డి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని వంట నూనెల వ్యాపారులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఎడిబుల్ ఆయిల్స్ ట్రేడ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచుల్ రెడ్డి కోరారు. మంగళవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఆయిల్ విజిలెన్స్ యాక్ట్ అమల్లో ఉన్నప్పుడు రోజుకో వ్యాపారిని అరెస్టు చేసి, దుకాణంలో ఉన్న సరుకు మొత్తాన్ని సీజ్ చేసేవారన్నారు. మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ చట్టం నుంచి యావత్ వ్యాపారులను విముక్తి చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా తిరిగి కేంద్ర ప్రభుత్వం వంట నూనె లూజ్ అమ్మకాలు జరపరాదని, ప్యాకింగ్‌లో మాత్రమే విక్రయించాలని చట్టాన్ని తెచ్చారని తెలిపారు. ఆ చట్టాన్నీ రాష్ట్రంలో అమలు చేయకుండా మహానేత నిలుపుదల చేయించారన్నారు. తిరిగి 2023లో ఇదే లూజ్ ఆయిల్ ప్యాకింగ్ చట్టాన్ని కేంద్రం అమలు చేయాలని ప్రయత్నించిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆ చట్టాన్ని నిలుపుదల చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయిల్ వ్యాపారులంతా ప్రభుత్వానికి అండగా నిలబడి సహకరించాలని కోరారు. రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ ట్రేడ్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీతిరాల వెంకట హరనాథ్, కోశాధికారి చేతకొండ వరచక్రపాణి, ఉపాధ్యక్షుడు నల్లమీడు గాంధీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఈసీ గంగిరెడ్డి



ఈసీ గంగిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ భారతిరెడ్డి, ఈసీ సుగుణమ్మ

- తండ్రికి నివాళులర్పించిన కుమార్తె వైఎస్ భారతిరెడ్డి, సతీమణి సుగుణమ్మ, కుమారుడు దినేష్‌రెడ్డి
- ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు

పులివెందుల: ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిరస్మరణీయులని ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో మంగళవారం డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 75వ జయంతి సందర్భంగా డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్సార్ సమాధుల తోటలోని ఈసీ గంగిరెడ్డి ఘాట్ వద్ద ఆయన కుమార్తె, సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి రెడ్డి, గంగిరెడ్డి సతీమణి డాక్టర్ సుగుణమ్మ, గంగిరెడ్డి కుమారుడు డాక్టర్ దినేష్‌రెడ్డిలతో పాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, పలువురు కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈసీ గంగిరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈసీ గంగిరెడ్డి పేదలకు సేవ చేయడంలో ఎంతో ముందుండేవారని చెప్పారు. వైద్య వృత్తి ద్వారా అనేక మందికి ప్రాణదానం చేసి ప్రాణదాతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పులివెందుల సీఎం కార్యాలయ కో–ఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వరప్రసాద్, వెంగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే 3 రాజధానులకు బాబు మోకాలడ్డు

1,213వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: అధికారంలో ఉండగా రాజధానిని అమరావతి పేరుతో అడ్డగోలుగా చేసిన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మూడు రాజధానులకు మోకాలడ్డుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,213వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రూ.లక్షల కోట్ల అవినీతికి అడ్డాగా చంద్రబాబు అమరావతిని ఎంచుకుని ప్రపంచం నివ్వెరపోయే అవినీతికి పాల్పడ్డాడనేందుకు.. తన తోడు దొంగ సింగపూర్ మంత్రి ఈశ్వరన్ పదవి కోల్పోయి కేసుల్లో ఇరుక్కోవడమే నిదర్శనమన్నారు. బాబును కూడా వెంటనే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ స్టార్ పవన్, ఎల్లో మీడియా, దళిత దళారులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు రాష్ట్రంలో అరాచకాలు సృష్టించేందుకు పథకం రూపొందిస్తున్నాడని అన్నారు. ఏపీలో రాజకీయాలు తెలియని షర్మిల మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ.. నిర్ణయాన్ని ప్రకటించడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలకు అర్థమైందని, ఇక ఆమెకు ఏపీలో ప్రజాదరణ అంతంత మాత్రమేనని స్పష్టం చేశారు. నాయకులు పులి దాసు, మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

అక్రమాల్లేని ఎన్నికల నిర్వహణకు ఈఎస్ఎంఎస్

- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ముగిసిన శిక్షణ కార్యక్రమం
- వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అమలుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఈఎస్ఎంఎస్ వినియోగం

సాక్షి, అమరావతి: ఏవిధమైన అక్రమాలకు తావులేకుండా వచ్చే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న వాటి సమాచారం కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సులువుగా పంచుకునేందుకు రూపొందించిన ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్)ను వచ్చే ఎన్నికల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం అధికార బృందం మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో పాటు పలు కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బెంగళూరు, ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పాల్గొని ఇఎస్ఎంఎస్ వినియోగాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వ్యవస్థ వినియోగంలో పలువురు అధికారుల సందేహా



శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

లను భారత ఎన్నికల సంఘం డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ్ నివృత్తి చేశారు.

మానవ తప్పిదాలకు అవకాశం ఉండదు

శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. ఇఎస్ఎంఎస్ వినియోగంతో ఆటోమేటిక్‌గా డాటా జనరేట్ అవ్వడం, సేవ్ అవ్వడం వల్ల మానవ తప్పిదాలకు, డూప్లికేషన్‌కు అవకాశం ఉండదన్నారు. పోలీస్, ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్, వాణిజ్య పన్నులు, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఈ వ్యవస్థను వినియోగించేటప్పుడు ఏ శాఖ ఎటువంటి విధులను నిర్వహించాలి అనే అంశంపై ప్రొటోకాల్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రామాణిక ఆపరేషన్ విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ వ్యవస్థ వినియోగంపై ఏమైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే తక్షణమే వాటిని నివృత్తి చేసేందుకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) ఎస్.బాగ్చీ, ఐజీపీ పి.వెంకటరామిరెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో డైరెక్టర్ ఎం.రవిప్రకాష్, వాణిజ్యపన్నుల శాఖ స్పెషల్ కమిషనర్ అభిషేక్ కిశోర్, అదనపు సీఈవో పి.కోటేశ్వరరావు తదితరులతో పాటు ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్ వ్యవస్థ వినియోగం ఇలా..

- కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థల మధ్య ఆటంకాల్లేని సమాచార పంపిణీ కోసం ఇఎస్ఎంఎస్ వ్యవస్థను రూపొందించారు.
- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక క్షేత్రస్థాయి సమాచారం రియల్ టైం అప్‌డేట్స్ కోసం ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు డబ్బు, మందు ఇతర ప్రలోభాలను కట్టడి చేయడమే ఈ టెక్నాలజీ ఉద్దేశం.
- గతంలో వివిధ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్న డబ్బు, ఇతర విలువైన కానుకల వివరాలను మాన్యువల్‌గా ఎంటర్ చేయాల్సి వచ్చేది. దీంతో ఎక్కువ సమయం పట్టేది. ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్ ద్వారా అమలయ్యే ఈఎస్ఎంఎస్ వల్ల ఎన్‌ఫోర్సుమెంట్ ఏజెన్సీలు తీసుకునే చర్యలు, వాటికి సంబంధించిన వివరాలు అన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు కావడమే కాకుండా అప్‌డేట్ సమాచారం అందుబాటులో ఉంటుంది.
- గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తొలిసారి ఈ వ్యవస్థను విజయవంతంగా వినియోగించారు.

మెడికవర్‌లో అధునాతన రోబోటిక్ టెక్నాలజీ మిషన్

డావిన్సీ రోబో మిషన్‌ను ప్రారంభించిన స్వరూపానందేంద్ర



రోబోటిక్ మిషన్‌ను ప్రారంభిస్తున్న విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర

ఎంవీపీ కాలనీ: విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సల కోసం అధునాతన రోబోటిక్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. నగరంలోనే తొలిసారిగా ఫోర్త్ జెన్ –డావిన్సీ రోబో మిషన్‌ను ఆసుపత్రి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆసుపత్రి ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఈ రోబోటిక్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడి తరువాత సమాజంలో విశిష్ట స్థానం ఉన్నది ఒక్క వైద్యుడికేనన్నారు. అందుకే శాస్త్రాలు సైతం వైద్యోనారాయణ హరిహిం.. అంటూ కీర్తించాయన్నారు. మెడికవర్ ఆసుపత్రి ద్వారా రోగులకు అందిస్తున్న సేవలకు రాజశ్యామల అమ్మవారి దీవెనలు ఉంటాయన్నారు. ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ రోగులకు నిబద్ధతతో సేవలందించడం ద్వారా మెడికవర్ ఆసుపత్రి ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు. దేశవ్యాప్తంగా 35 బ్రాంచ్‌ల ద్వారా ఆసుపత్రి సేవలందిస్తున్నట్లు తెలిపారు.

శకటం సిద్ధం



గణతంత్ర దినోత్సవం కోసం మంగళవారం ఢిల్లీలో జరిగిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో ఆంధ్రప్రదేశ్ శకటం

(ఇతివృత్తం: ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యను మార్చడం - విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా చేయడం)

గుంటూరు జీజీహెచ్‌లో అత్యాధునిక ఐసీయూ

- రూ. 3 కోట్లు వెచ్చించి 25 పడకలతో నిర్మాణం
- ప్రారంభించిన మంత్రి రజిని



యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రజిని

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటుచేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మంగళవారం ప్రారంభించారు. రూ. 3 కోట్లు వెచ్చించి 25 పడకలతో ఈ ఐసీయూను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే నాడు– నేడు కార్యక్రమంలో భాగంగా గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి రూ. 500 కోట్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల అభివృద్ధికి రూ. 3,820 కోట్లు ఖర్చుచేస్తున్నామని వివరించారు. గతంలో ఉన్న 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాడు– నేడు కార్యక్రమంలో భాగంగా వైద్య సౌకర్యాలు మెరుగుపరిచినట్లు చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలు అందజేయడంతో పాటు వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించి వైద్య కళాశాలల రూపురేఖలు మార్చామన్నారు. ప్రభుత్వం కొత్తగా 17 వైద్య కళాశాలలను అందుబాటులోకి తెస్తుందని, వీటిలో ఐదు కళాశాలలను ఇప్పటికే ప్రారంభించామని మంత్రి చెప్పారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సొంతింటి కలను నిజం చేశారు



మా ఆయన 20 ఏళ్ల క్రితం నన్ను విడిచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి నా ఇద్దరు ఆడ పిల్లలతో మా నాన్న పెనుబోయిన పేర్రాజు ఇంటికి చేరుకున్నాను. కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేదాన్ని. కష్టాలు అనుభవిస్తూ పిల్లల్ని పెంచి పెద్ద చేశాను. ఇటీవలే వారిద్దరికీ పెళ్లిళ్లు జరిపించాను. పేదలందరికీ ఇళ్లు పథకం కోసం దరఖాస్తు చేసుకోగా ఏలూరు జిల్లా భీమడోలు – ద్వారకా తిరుమల ప్రధాన రహదారి పక్కన సూర్యచంద్రరావుపేటలో ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చారు. ఇల్లు నిర్మించుకోవడానికి రూ.1.80 లక్షలను మంజూరు చేశారు. ఆ నగదుతో పాటు నా దగ్గర ఉన్న కొంత డబ్బుతో ఇంటిని అందంగా నిర్మించుకున్నా. బెడ్‌రూమ్, హాలు, కిచెన్, వరండా, బాత్‌రూం కట్టుకున్నాను. ఒంటరి మహిళనైన నాకు జగనన్న తోబుట్టువై అండగా నిలిచారు. నా సొంతింటి కల నెరవేర్చారు.

– పెనుబోయిన నాగశ్రీ, సూర్యచంద్రరావుపేట
(వై.నాగవెంకటశ్రీనివాస్, విలేకరి, ద్వారకాతిరుమల)

వ్యవసాయం కోసం అప్పుచేయట్లేదు



మాది వ్యవసాయ కుటుంబం. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం చిరికివానిపాలెం. ఎకరా 10 సెంట్ల సాగు భూమి ఉంది. సీఎం జగన్ ప్రభుత్వం ఏటా ఖరీఫ్, రబీ కాలాల్లో పంటకు రైతు భరోసా కింద పెట్టుబడి సహాయంగా ఏడాదికి రూ.13,500 అందిస్తోంది. ఇప్పటి వరకు ప్రతి ఏటా రైతు భరోసా నగదు నా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. నా భార్య, పిల్లలతో కలిసి వ్యవసాయ పనులు చేసుకోవడంతో పంటకు అందిస్తున్న పెట్టుబడి సహాయం మాకు ఎంతో ఉపయోగపడుతోంది. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు తక్కువ ధరలకే అందుబాటులో ఉంటున్నాయి. ఈ నెల నుంచి పింఛన్ రూ.3 వేలు ఇస్తున్నారు. నా భార్య ఎర్రయమ్మకు ఆసరా పథకం కింద మూడు విడతలుగా ఇప్పటికి రూ.30 వేలు వచ్చింది. మంగళవారం చివరి విడత ఇచ్చారు. చేయూత కింద ఏడాదికి 18,750 వంతున మూడేళ్లుగా వస్తోంది. ఇప్పుడు వ్యవసాయం కోసం మేము అప్పు చేయట్లేదు.

– చిరికి నారాయణమూర్తి, చిరికివానిపాలెం
(సురభి ఎస్.జె.వి.సత్యనారాయణ, విలేకరి, కె.కోటపాడు)

మా చదువులు ఒడ్డెక్కుతున్నాయి



మా నాన్న గల్ఫ్‌కు పనుల కోసం వెళ్లేవారు. మా అమ్మ, నేను, సోదరుడు కలసి తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడులో ఉండేవాళ్లం. మా చదువులకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ తరుణంలో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా సమస్యలకు పరిష్కారం దొరికింది. ఇంజినీరింగ్ చదువుతున్న నాకు, మా సోదరుడికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఏటా రూ.63,000 అందుతోంది. ప్రభుత్వ సహకారంతో మా నాన్న కూడా ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సీఎం జగన్ మేలును ఎప్పటికీ మరచిపోం.

– మల్లిడి దీప్తి, పెంటపాడు, పశ్చిమగోదావరి జిల్లా
(యడ్లపల్లి మురళీకృష్ణ, విలేకరి, తాడేపల్లిగూడెం)

దురుద్దేశాలతోనే నాపై 'పిల్'

హైకోర్టులో సీఎం వైఎస్ జగన్ ప్రాథమిక కౌంటర్ దాఖలు

- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ వ్యాజ్యం
- నాపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఎంపీ రఘురామకృష్ణరాజు పని
- అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరినందుకే వ్యక్తిగత కక్ష పెంచుకున్నారు
- నాపై అతని కక్షపూరిత ధోరణి, శత్రుత్వం ప్రజలందరికీ తెలుసు
- రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిపై, అధికారులపై కూడా ఇంతే..
- తప్పుడు, నిరాధార ఆరోపణలు చేసి నా బెయిల్‌ను రద్దుచేయాలని కోర్టును కోరారు
- తెలంగాణ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది
- అతనిపై పలు క్రిమినల్ కేసులున్నా, వాటిని దాచిపెట్టి ఈ పిల్ దాఖలు చేశారు
- ఈ వ్యాజ్యాన్ని భారీ జరిమానాతో కొట్టేయండి
- ప్రతివాదుల జాబితా నుంచి నా పేరు తొలగించండి
- తదుపరి విచారణ ఫిబ్రవరి 12కి వాయిదా



సాక్షి, అమరావతి: దురుద్దేశాలు, రాజకీయ కారణాలతో ఎంపీ రఘురామకృష్ణరాజు తనపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. తనపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారని వివరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు అతనిపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ స్పీకర్‌కు తమ పార్టీ తరఫున లేఖ రాశామన్నారు. ఈ కారణంతోనే అప్పటి నుంచి రాఘురామకృష్ణరాజు తనపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారని తెలిపారు. తనపై ద్వేషాన్ని తెలియజేసేందుకు ఆయన పలు మార్గాలను ఎంచుకున్నారని వివరించారు. అతని కక్షపూరిత ధోరణి, శత్రుత్వం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇందులో భాగంగా.. అనేక సందర్భాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారని జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఇదే రీతిలో రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, అధికారులపై కూడా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. తనపై పలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తూ తన బెయిల్‌ను రద్దుచేయాలంటూ రఘురామకృష్ణరాజు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేకపోవడంతో హైకోర్టు దానిని కొట్టేసిందన్నారు. నిజానికి.. ఆయన సదుద్దేశంతో కోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. అతనిపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి తన పిటిషన్‌లో ప్రస్తావించకుండా దాచిపెట్టారని సీఎం వివరించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌ను భారీ జరిమానాతో కొట్టేయాలని ముఖ్యమంత్రి జగన్ న్యాయస్థానాన్ని కోరారు. అంతేకాక.. ప్రతివాదుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కూడా అభ్యర్థించారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు, ఆయా ప్రభుత్వ శాఖల పనితీరుపై దూషణలు చేసేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని ఆయన తన కౌంటర్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సీబీఐ దర్యాప్తు జరపండి..

రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు ఆ పథకాలవల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని.. వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ పిల్ విచారణార్హతపై అభ్యంతరం లేవనెత్తారు. దీంతో న్యాయస్థానం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో సహా 40 మందికి నోటీసులు జారీచేసి, పిల్ విచారణార్హతపై అభ్యంతరాలుంటే తెలియజేస్తూ అఫిడవిట్‌లు దాఖలుచేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యంతరాలతో ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు.

అతను ప్రజాస్ఫూర్తి కలిగిన వ్యక్తికానే కాదు..

అసలు రఘురామకృష్ణరాజు ప్రజాస్ఫూర్తి కలిగిన వ్యక్తి కానేకాదని జగన్ తన కౌంటర్‌లో పేర్కొన్నారు. ఎంపీ తన వ్యాజ్యంలో అవసరమున్న వారిని కాకుండా.. అవసరంలేని వారిని ప్రతివాదులుగా చేర్చారన్నారు. ఈ పిల్‌పై న్యాయస్థానం విచారణ జరపడానికి ముందే వివిధ సందర్భాల్లో విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి తనతో పాటు ఇతరులపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఆయన చేసిన నిరాధార ఆరోపణలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలను జగన్ తన అఫిడవిట్ ద్వారా కోర్టు ముందుంచారు. రఘురామకృష్ణరాజుపై ఉన్న కేసులు, ఆ కేసుల్లో దాఖలైన చార్జిషీట్‌లను కూడా కోర్టుకు సమర్పించారు. అసలు 'పిల్' నిర్వచన పరిధిలోకి ఈ వ్యాజ్యం రాదని తెలిపారు. అందులో రఘురామకృష్ణరాజు చేసిన అభ్యర్థనలు నిర్దిష్టంగా లేవన్నారు.

కౌంటర్లకు తిరుగు సమాధానం ఇవ్వండి..

ఇక మంగళవారం జరిగిన విచారణలో జగన్ దాఖలు చేసిన ఈ ప్రాథమిక కౌంటర్ గురించి అతని తరఫు న్యాయవాది సన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే, పలువురు ప్రతివాదులు ఈ వ్యాజ్యంలో ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్‌ను తమకు అన్వయింప చేసుకుంటున్నామని తెలిపారు. మరికొందరు తాము కూడా కౌంటర్లు దాఖలు చేశామని చెప్పారు. ఈ సమయంలో రఘురామకృష్ణరాజు తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. కొందరు తమకు ఇప్పుడే తమ కౌంటర్లు ఇచ్చారని తెలిపారు. సమయమిస్తే వాటికి సమాధానమిస్తామని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. కౌంటర్లు దాఖలు చేయని వారుంటే కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వాటన్నింటికీ పిటిషనర్ తిరుగు సమాధానం (రిప్లై) దాఖలు చేయవచ్చని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

నిరాహార దీక్ష పేరుతో అత్యవసర విచారణ కోరలేరు

కేసు పూర్వాపరాల ఆధారంగానే విచారణ.. జనుపల్లి శ్రీనివాసరావుపై హైకోర్టు మండిపాటు

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన జనుపల్లి శ్రీనివాసరావుపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. శ్రీనివాసరావు నిరాహార దీక్ష చేస్తున్నారని, అందువల్ల తమ వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించాలంటూ అతని తరఫు న్యాయవాదులు అభ్యర్థించడంపై హైకోర్టు మండిపడింది. నిరాహార దీక్ష పేరుతో అత్యవసర విచారణ కోసం తమను ఒత్తిడి చేయలేరని వారికి తేల్చి చెప్పింది. ఓ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరిపేందుకు నిరాహార దీక్ష అన్నది ఎంత మాత్రం కారణం కాకూడదని స్పష్టం చేసింది. శ్రీనివాసరావు వ్యాజ్యంపై ఇప్పటికే పూర్తిస్థాయిలో వాదనలు విన్నామని గుర్తు చేసింది. అత్యవసర విచారణకు తిరస్కరించిన న్యాయస్థానం.. శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జనుపల్లి శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు జరిపిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ).. హత్య చేయాలన్న ఉద్దేశంతోనే పదునైన కత్తితో జగన్‌మోహన్‌రెడ్డిపై శ్రీనివాసరావు దాడి చేసినట్లు తేల్చింది. హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని శ్రీనివాసరావు చాలా జాగ్రత్తగా ఎంచుకున్నారని, దాచిపెట్టేందుకు అనువుగా ఉండేలా ఆ కత్తిని ఎంచుకున్నారని కోర్టుకు సైతం నివేదించింది. ప్రాణాంతక గాయం చేసేందుకు ఆ కత్తి సరిపోతుందని స్పష్టం చేసింది. అందువల్ల శ్రీనివాసరావుకు బెయిల్ ఇవ్వొద్దని కోరింది. దీంతో ఎన్ఐఏ కోర్టు శ్రీనివాసరావుకు బెయిల్ నిరాకరించింది. ఈ నేపథ్యంలో బెయిల్ కోసం శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరుపుతున్న జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం ఇప్పటికే పూర్తిస్థాయి వాదనలు విన్నది.

కేసు పూర్వాపరాల ఆధారంగానే విచారణ..

తాజాగా మంగళవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. ఎన్ఐఏ తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి వెంకటయజ్ఞదత్ స్పందిస్తూ.. కేసులో వాదనలు వినిపించేందుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) బి.నరసింహశర్మ వస్తారని, విచారణను బుధవారానికి వాయిదా వేయాలని అభ్యర్థించారు. దీనిపై శ్రీనివాసరావు తరఫు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. శ్రీనివాసరావు జైల్లో నిరాహారదీక్ష చేస్తున్నారని, అందువల్ల తమ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ధర్మాసనం ఒకింత తీవ్రంగా స్పందించింది. తాము కేసు పూర్వాపరాల ఆధారంగానే విచారణ జరుపుతామంది.

జిల్లా వార్తలు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

- కులగణన సర్వే వేగవంతం చేయండి
- మండల అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో వచ్చే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మండలాధికారులతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీటి సరఫరా, కులగణన, ఆడుదాం ఆంధ్రా, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో తీరమండలా గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేయించటం, తాగునీటి చెరువుల సామర్థ్యాన్ని బట్టి కాలువల ద్వారా నీటిని నింపటం వంటి చర్యలు సక్రమంగా చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లాలో మొబైల్ యాప్ తయారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది దీనిని రెండు రోజుల్లోగా డౌన్‌లోడ్ చేసుకుని ఆపరేట్ చేయాలన్నారు. తాగునీటి సమస్య ఎక్కడ ఏర్పడినా వెంటనే యాప్‌లో నమోదు చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

కులగణన సర్వే పూర్తిచేయాలి

జిల్లాలో నిర్వహిస్తున్న కులగణన సర్వే వేగంగా నిర్వహించాలని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజాబాబు సూచించారు. జర్నలిస్టుల హౌస్ సైట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీఓలకు సూచించారు.

3.32 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు అంశంపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 3.32 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. సోమవారం ఒక్క రోజున నాలుగు వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు



ఆసరా చెక్కులను అందజేస్తున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా చేయూత ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే వైఎస్సార్ ఆసరా, చేయూత, తదితర సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన రూ.36.45 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు నాలుగు విడతలుగా ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగో విడత ద్వారా రూ.6,394 కోట్ల మేర ఆర్థిక సహకారాన్ని డ్వాక్రా మహిళలకు అందించారని చెప్పారు. రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించలేదని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసి మోసపూరిత హామీలిచ్చారని దుయ్యబట్టారు. రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి హామీని విస్మరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ బాబు, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండల సమైక్య అధ్యక్షులు దారావత్ శ్యామల, కాకాని పద్మ, గంగిపోగు శిరీష, ఏఓ, ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్ వర్సిటీ విద్యార్థినికి బంగారు పతకం



విద్యార్థిని షానూన్

తాడేపల్లిరూరల్: సౌత్ ఇండియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థిని బంగారు పతకం సాధించింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ కిశోర్ బాబు వివరాలు వెల్లడించారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో తెనాలిలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ ఇండియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో వర్సిటీలో బీఏ (ఐఏఎస్) మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని షానూన్ బంగారు పతకం సాధించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. షానూన్‌ను వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, బీఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివ నాగయ్య, ఉప విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్ అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సాక్షి, అమరావతి: ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆ విభాగం డైరెక్టర్ వి.ఆంజనేయులు మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్‌ను అసోసియేసన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా కొద్ది కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌ను కోరారు. తమ విజ్ఞప్తులపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణరావు తెలిపారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో విజయవాడ, వైజాగ్, రాయలసీమ రీజినల్ కమిటీల అధ్యక్షులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ సత్యం, డాక్టర్ జయప్రకాశ్, ఇతర ప్రతినిధులు ఉన్నారు.

చేతి రాత మెరుగు పరుచుకోవాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన ఢిల్లీరావు, లక్ష్మీశా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అందమైన చేతి రాత.. ఉజ్వల భవితకు వెలుగు రేఖ అని కృష్ణా జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విద్యార్థులు తమ చేతి రాతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. చక్కటి చేతి రాత ద్వారా మేధో వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జాతీయ చేతి రాత దినోత్సవం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. అందమైన చేతిరాత ద్వారా విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థీ చేతి రాత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. లిజనింగ్, రీడింగ్, స్పీకింగ్, రైటింగ్ (ఎల్ఆర్ఎస్ఆర్)లో లిజనింగ్, రైటింగ్ నైపుణ్యాలు అత్యంత ముఖ్యమైనవని వివరించారు. ఈ నైపుణ్యాలు పెంపొందించుకుంటే మిగిలిన నైపుణ్యాలను తేలిగ్గా సముపార్జించవచ్చని పేర్కొన్నారు.

అందమైన చేతిరాత ఓ జీవన నైపుణ్యం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీశా మాట్లాడుతూ.. అందమైన చేతిరాత జీవన నైపుణ్యం (లైఫ్ స్కిల్) అని పేర్కొన్నారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేసినప్పటి నుంచే అందమైన చేతిరాతపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని సూచించారు. చేతి రాత నిపుణుడు భువనచంద్ర మాట్లాడుతూ.. కలెక్టర్ ఢిల్లీరావు కుమారుడు జీవితేష్ ఆగస్టులో జరిగే అంతర్జాతీయ ఎన్నారై కాలిగ్రఫీ లైవ్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి చేతిరాత పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ ఢిల్లీరావు, గృహ నిర్మాణ సంస్థ ఎండీ జి.లక్ష్మీశా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి చేతిరాత శిక్షణ కేంద్రం చైర్మన్ ఎల్.శేఖర్, ఉషోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ మహ్మద్ రఫీ, రావూస్ ఇంగ్లిష్ మీడియం ప్రిన్సిపాల్ కాలేషా, లిటిల్ ఏంజెల్స్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శ్రీనివాస్, నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయండి



రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, రవాణాశాఖ అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కృషి చేయాలని రవాణాశాఖ అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతకు సంబంధించి అవగాహన కలిగించే పోస్టర్లు, పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ.. రహదారి భద్రత కోసం అధికారులు మరింతగా కృషి చేయాలని, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. 2023 సంవత్సరంలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 306 మంది మరణించారన్నారు. ద్విచక్రవాహనాలు నడుపుతూ 110 మంది మరణించటం బాధాకరమన్నారు. ఈ ప్రమాదాల్లో 896 మంది గాయపడ్డారన్నారు. డ్రైవర్లకు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎమర్జెన్సీ కేర్, ఇంజినీరింగ్ విభాగాల కో–ఆర్డినేషన్‌తో పాటు పోలీస్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల శాఖ, వైద్య–ఆరోగ్య శాఖల భాగస్వామ్యంతో ప్రమాదాలు తగ్గించేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి ఎం.పురేంద్ర, ఆర్టీఓ విజయసారధి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సిద్ధిఖ్, సోనీ ప్రియ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రబోధాత్మకంగా చైతన్యగీతాలు



చైతన్య గీతాలను ఆలపిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

విజయవాడ కల్చరల్: సోషలిస్టు వ్యవస్థాపకుడు మహోన్నత నేత ఐవీ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యాన విజయవాడ లెనిన్ సెంటర్‌లోని నగరపాలక సంస్థ మైదానంలో నిర్వహిస్తున్న చైతన్య గీతాల కార్యక్రమాలు కళాకారుల ప్రతిభకు అద్దంపడుతున్నాయి. ప్రజానాట్యమండలి కళాకారులు మంగళవారం కాలికి గజ్జెలు కట్టి చైతన్య గీతాలను ఆలపించారు. ఆచార్య సి.నారాయణరెడ్డి, శ్రీశ్రీ, దాశరథి, వంగపండు ప్రసాదరావు తదితరులు రచించిన గీతాలను వీనుల విందుగా ఆలపించారు. విజయవాడ నగరానికి చెందిన గాయనీ గాయకులు ధర్భాఫణీంద్ర, మీనాకుమారి, ఆదిరాల జయప్రభ తెలుగు సినీ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, యువ కవి అనిల్ డ్యానీ, సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రతినిధి మనోహర్ నాయుడు, ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రతినిధి లక్ష్మయ్య తదిరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



మేడికొండూరు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మందపాడులోని శ్రీనివాస పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థిని మైత్రి చరిత ఈ నెల 26, 27, 28 తేదీల్లో మహారాష్ట్రలోని లాథూడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థినిని ఆమె తల్లిదండ్రులను డైరెక్టర్ గౌతమి, ప్రిన్సిపాల్ కరీముల్లా, పీఈటీ కిషోర్ అభినందించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్‌ జిల్లా

బుధవారం । 24 । జనవరి । 2024



వైఎస్సార్‌ సీపీ జెండా ఎగురవేయాలి
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరులో వైఎస్సార్‌ సీపీ జెండాను ఎగురవేసి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని మంత్రి జోగి రమేష్‌ అన్నారు. -10లో▸



త్వరలో అ'పూర్వ' సమ్మేళనం
కోనేరుసెంటర్‌: కృష్ణా వర్సిటీ పూర్వ విద్యార్థుల సమావేశం త్వరలోనే నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని వర్సిటీ వీసీ ఆచార్య జి.జ్ఞానమణి తెలిపారు.

అయోధ్య ఆలయం సాకారం


న్యాయ సమ్మతితో అయోధ్యలో రామమందిర నిర్మాణం సాకారమైందని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. గుడివాడలో రామ మందిర ప్రతిష్ఠ విజయోత్సవ మహాసభను మంగళవారం నిర్వహించారు. -10లో▸

న్యూస్‌రీల్‌

రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



విజయవాడ కల్చరల్‌: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో 25వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు టీటీడీ దేవాలయాల సూపరింటెండెంట్‌ మేడారపు కాంతికుమార్‌ తెలిపారు. మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పుష్య మాసం పౌర్ణమి, మనగుడి కార్యక్రమంలో భాగంగా బందరురోడ్డు పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో 50 మంది జంటలకు మాత్రమే పాల్గొనే అవకాశంవుంటుందన్నారు. పూజా ద్రవ్యాలను టీటీడీ, ధర్మప్రచార పరిషత్‌ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అనంతరం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ 24వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలోపు 703 2255 499 కు ఫోన్‌ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దేవాలయ అర్చకుడు శశికుమార్‌, కల్యాణమండపం మేనేజర్‌ భాస్కర రెడ్డి, ధార్మిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ కానూరుకు చెందిన సుగ్గున సాయితేజ కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ముగ్గురు రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తతతో ఉండి ప్రమాదాలను నివారించడంలో కృషి చేసిన విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు జీఎం మ్యాన్‌ ఆఫ్‌ ద మంత్‌ సేఫ్టీ అవార్డులు అందుకున్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్‌ నిలయం నుంచి జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌ విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్‌, హైదరాబాద్‌, నాందేడ్‌ డివిజన్‌ల డీఆర్‌ఎంలతో వర్చువల్‌ సమావేశం నిర్వహించారు. భద్రత చర్యలపై సమీక్షించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో లోకోపైలట్‌ జె.శ్రీధర్‌, పాయింట్‌మెన్‌ సీహెచ్‌ విజయ్‌కుమార్‌, అసిస్టెంట్‌ పాయింట్‌మెన్‌ సీహెచ్‌ శివాజీలకు జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌ సేఫ్టీ అవార్డులను అందజేశారు. విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌ అవార్డులు సాధించిన ఉద్యోగులను అభినందించారు.

సందర్శకులకు మధురానుభూతి



గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): విజయవాడ నడిబొడ్డున స్వరాజ్‌ మైదాన్‌లో దేశానికే తలమానికంగా ఏర్పాటు చేసిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం, స్మృతివనం సందర్శనకు వచ్చే వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌. ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం కలెక్టర్‌ ఢిల్లీరావు అంబేడ్కర్‌ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణాన్ని పరిశీలించారు. మ్యూజికల్‌ ఫౌంటేన్‌, ఉద్యానవనం, మ్యూజియం తదితరాలను సందర్శించారు. కలెక్టర్‌ ఢిల్లీరావు మాట్లాడుతూ స్మృతివనాన్ని సందర్శించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు వస్తున్నారని తెలిపారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.



రిపబ్లిక్‌ డ్రిల్‌



గణతంత్ర దినోత్సవానికి విజయవాడ ముస్తాబవుతోంది. వేడుకలకు వేదికైన ఇందిరాగాంధీ మునిసిపల్‌ స్టేడియం త్రివర్ణమయమవుతోంది. ప్రాంగణం మొత్తాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జెండా ఆవిష్కరణకు గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రి కూడా హాజరు కానుండటంతో పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గౌరవ వందనంతో పాటు మార్చ్‌ఫాస్ట్‌ చేసేందుకు అనుగుణంగా స్టేడియాన్ని సిద్ధం చేస్తున్నారు. మంగళవారం పోలీసులు నిర్వహించిన మాక్‌ డ్రిల్‌ దృశ్యాలను చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ

ఆడపడుచుల సాధికారతకు ఆసరా

- వైఎస్సార్‌ ఆసరా నాలుగో విడత నగదు విడుదల
- జిల్లాలో 3,22,820 మందికి రూ. 279 కోట్లు లబ్ధి
- లబ్ధిదారులకు చెక్కు అందజేసిన ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు



లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న కలెక్టర్‌ ఢిల్లీరావు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నేతృత్వంలో మహిళా సాధికారత కోసం విప్లవాత్మక పథకాలు అమలుచేస్తోందని, ఇందులో భాగంగానే వైఎస్సార్‌ ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తోందని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి అనంతపురం జిల్లా, ఉరవకొండలో వైఎస్సార్‌ ఆసరా నాలుగో విడత ఆర్థిక సాయాన్ని పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని ఏవీఎస్‌ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు, జాయింట్‌ కలెక్టర్‌ డాక్టర్‌ పి.సంపత్‌ కుమార్‌, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

కలెక్టర్‌ మాట్లాడుతూ వైఎస్సార్‌ ఆసరా పథకం నాలుగో విడత ద్వారా జిల్లాకు సంబంధించి 32,431 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,22,820 మంది సభ్యులకు రూ. 278.92 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందన్నారు. మహిళలకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌ చేయూత, వైఎస్సార్‌ ఆసరా వంటి పథకాలు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలవుతున్నట్లు కలెక్టర్‌ పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోండి..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్‌ ఢిల్లీరావు అన్నారు. కుటుంబాలకు సుస్థిర ఆదాయం వచ్చేలా జీవనోపాధి అవకాశాలను అందిపుచ్చుకొని.. ఆత్మస్థైర్యంతో తమకాళ్లపై తాము నిలబడి ఆదర్శంగా నిలిచినప్పుడే ప్రభుత్వ ఉద్దేశాలు నెరవేరుతాయన్నారు. మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార దిగ్గజాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్పొరేట్‌ సంస్థలు, బ్యాంకులతో అనుసంధానం చేసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేయాలని కలెక్టర్‌ సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేశారు. విజయవాడ నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, కాపు కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ అడపా శేషగిరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ టి.జమల పూర్ణమ్మ, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్‌ తనుబుద్ధి చంద్రశేఖర్‌ రెడ్డి, లిడ్‌క్యాప్‌ డైరెక్టర్‌ ఝాన్సీరాణి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం.. అత్యుత్తమం

- ప్రతి రోగికి నాణ్యమైన సేవలే లక్ష్యం
- బైపాస్‌ సర్జరీలు సైతం విజయవంతంగా నిర్వహణ
- 24 గంటలూ అందుబాటులో సీటీ స్కాన్‌
- ఆదివారం కూడా ఎంఆర్‌ఐ స్కాన్‌
- 'సాక్షి'తో విజయవాడ జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ వెంకటేష్‌

సాక్షి ఇంటర్వ్యూ



లబ్బీపేట(విజయవాడతూర్పు): జబ్బు చేసి చికిత్స కోసం వచ్చే ప్రతిరోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తమ వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారని విజయవాడ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ డి. వెంకటేష్‌ అన్నారు. అత్యాధునిక పరికరాలు, అవసరమైన సిబ్బంది సమకూరడంతో ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం..

అరుదైన సర్జరీలు నిర్వహణ..

ఆస్పత్రిలో కార్డియోథోరాసిక్‌ సర్జరీ థియేటర్‌ అందుబాటులో ఉందని, దానిలో ఇప్పటి వరకూ ఆరుగురికి విజయవంతంగా బైపాస్‌ సర్జరీలు పూర్తి చేసినట్లు సూపరింటెండెంట్‌ వెంకటేష్‌ తెలిపారు. వాటిలో మైట్రాల్‌ వాల్వ్‌ రిప్లేస్‌మెంట్‌ సర్జరీ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. నిరంతరాయంగా బైపాస్‌ సర్జరీలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అంతేకాక ఎస్‌ఎస్‌ బ్లాక్‌లో నెలలో 700వరకూ డయాలసిస్‌లు చేస్తున్నామన్నారు. నిపుణులైన నెఫ్రాలజిస్టులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. లాపరోస్కోపిక్‌, ఎండోస్కోపీ సర్జరీలు ఎక్కువగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రసూతి, పిడియాట్రిక్‌ విభాగంలో సైతం నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్‌ విభాగంలో తుంటి, మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పన..

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా సీవేజ్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌(ఎస్టీపీ)ని ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌ సమస్య తలెత్తకుండా సబ్‌స్టేషన్‌ మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అవుట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్టు ఉద్యోగులకు ఒక్క నెల కూడా జీతం పెండింగ్‌ లేకుండా చెల్లించినట్లు డాక్టర్‌ వెంకటేష్‌ పేర్కొన్నారు. వైద్యులు బాగా పనిచేస్తున్నారని, సిబ్బంది సమన్వయంగా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

సూపర్‌స్పెషాలిటీలో మూడు రోజులు ఓపీ..

సూపర్‌ స్పెషాలిటీ బ్లాక్‌(ఎస్‌ఎస్‌ బ్లాక్‌)లోని విభాగాలకు రోగుల సంఖ్య బాగా పెరిగిందని సూపరింటెండెంట్‌ చెప్పారు. దీంతో గతంలో వారంలో రెండు రోజులు నిర్వహించే ఓపీలను మూడు రోజులు చేసినట్లు తెలిపారు. కార్డియాలజీ ఓపీ ప్రతి రోజూ ఉంటుందన్నారు. అంతేకాకుండా ఎస్‌ఎస్‌ బ్లాక్‌లోని సీటీ స్కాన్‌ గతంలో పగలు మాత్రమే పనిచేసేదని, ఇప్పుడు 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఎంఆర్‌ఐ స్కానింగ్‌ కోసం రోగులు ఇబ్బంది పడకుండా ఆదివారం కూడా స్కానింగ్‌లు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రేడియాలజిస్టులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటంతో రిపోర్టులు కూడా సత్వరమే ఇచ్చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్పొరేషన్‌ నిబంధనల ఉల్లంఘన.. 10మందికి జరిమానా

పటమట(విజయవాడతూర్పు): కార్పొరేషన్‌ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని విజయవాడ మున్సిపల్‌ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం పటమటలోని సర్కిల్‌–3లోని మొబైల్‌ కోర్టులో కేసులను విచారించారు. సర్కిల్‌ పరిధిలోని ఆయా డివిజన్లలో నమోదైన మొత్తం 10 కేసులను ఆయన విచారించారు. రోడ్డుపైన చెత్త వేసినందుకు, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్‌–3 పరిధిలో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన కేసుల్లో 10 మంది నిందితులకు రూ.3,570 జరిమానా విధించారు. జరిమానా విధించిన తర్వాత మళ్లీ అదే తప్పు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని, వ్యాపార లైసెన్స్‌ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. నగరాన్ని శుభ్రంగా, అందంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అసిస్టెంట్‌ హెల్త్‌ ఆఫీసర్‌–3, డాక్టర్‌ ఇక్బాల్‌ హుస్సేన్‌, శానిటరీ సూపర్వైజర్‌–3 డి. సోమరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆడండి.. గెలవండి

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- 194 మ్యాచ్‌లలో తలపడనున్న క్రీడాకారులు
- నైపుణ్యాలను గుర్తించే బాధ్యతను క్రీడా సంఘాలకు అప్పగించిన ప్రభుత్వం
- విజేత జట్లకు నగదు బహుమతి



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్‌: ఆడుదాం ఆంధ్రా గ్రామ/వార్డు సచివాలయాల, మండల స్థాయి పోటీలను విజయవంతంగా పూర్తి చేసుకుని నియోజకవర్గ స్థాయి పోటీలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఎన్టీఆర్‌ జిల్లాలోని విజయవాడ ఈస్ట్‌, విజయవాడ వెస్ట్‌, విజయవాడ సెంట్రల్‌, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో ఈ పోటీలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరిగేలా అధికారులు ప్రణాళిక చేశారు. క్రికెట్‌, బ్యాడ్మింటన్‌, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ క్రీడాంశాల్లో గ్రామ/వార్డు సచివాలయ స్థాయి, మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన స్త్రీ, పురుషుల జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు సమాయత్తమవుతున్నాయి.

194 మ్యాచ్‌లు.. 2,850 మంది క్రీడాకారులు..

నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని 16 మండలాల నుంచి, విజయవాడ సిటీలోని మూడు నియోజకవర్గాల్లోని 9 యూనిట్ల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. నిర్ణీత షెడ్యూల్‌ ప్రకారం ఏడు నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు ఆయా క్రీడాంశాల్లో జరిగే 194 మ్యాచ్‌లలో 2,850 మంది క్రీడాకారులు తలపడనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇప్పటికే ప్రభుత్వం జెర్సీలు, క్రీడా సామగ్రిని సమకూర్చింది.


ఆకర్షణీయ బహుమతులు..

క్రికెట్‌, వాలీబాల్‌, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో విజేత జట్టుకు రూ.35 వేలు, రన్నర్‌ జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు, బ్యాడ్మింటన్‌ క్రీడాంశంలో విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌కు రూ. 10 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 5 వేలు రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా అందజేస్తుంది. దీంతో పాటు విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌, సర్టిఫికెట్‌ ఇస్తారు.

క్రీడా నైపుణ్యాలను గుర్తించేందుకు..

యువతలో క్రీడాసక్తి తీసుకొచ్చి, క్రీడా నైపుణ్యాలను గుర్తించాలనే ప్రధాన లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు జరిగిన రెండు స్థాయిల్లో విజేతలుగా నిలిచి మూడో స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న జట్లలో క్రీడా నైపుణ్యాలను గుర్తించే(టాలెంట్‌ హంట్‌) బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఆయా క్రీడా సంఘాల ప్రతినిధులకు అప్పగించింది. నేటి నుంచి జరిగే అన్ని మ్యాచ్‌లను క్రీడా సంఘాల ప్రతినిధులు పర్యవేక్షిస్తారు. క్రికెట్‌ పూర్తిగా కృష్ణాజిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అడహాక్‌ కమిటీ పర్యవేక్షణలో జరుగుతుంది. అసోసియేషన్‌కు చెందిన అంపైర్లు మ్యాచ్‌లను నిర్వహిస్తారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, బ్యాడ్మింటన్‌ క్రీడాంశాల్లోనూ ఆయా క్రీడా సంఘాలకు చెందిన కోచ్‌లు, సంఘ ప్రతినిధులు మైదానాల్లో పర్యవేక్షిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..



కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు సూచనలు, సలహాలు, ఆదేశాలతో అన్ని శాఖల అధికారుల సమన్వయం చేసుకుని రెండు స్థాయిల పోటీలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశాం. నేటి నుంచి ప్రారంభమయ్యే పోటీలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు భోజనంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి కల్పిస్తాం. ఈ పోటీల్లో విజేత జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి.

– ఎస్‌.ఎ.అజీజ్‌, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, ఎన్టీఆర్‌ జిల్లా

మైదానాలు ఇవే..

- విజయవాడ సిటీలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్‌స్టేడియం, మాకినేని బసవపున్నయ్య స్టేడియం, సిద్ధార్థ మహిళా కాలేజీ, అట్కిన్‌సన్‌ స్కూల్‌, గాంధీజీ ఇండోర్‌ స్టేడియం, డీఆర్‌ఆర్‌ ఇండోర్‌ స్టేడియం, ఎస్‌ఆర్‌ఆర్‌ కాలేజీ మైదానాల్లో ఈ పోటీలు జరుగుతాయి.
- తిరువూరులోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకులం, ఎన్టీఆర్‌ స్టేడియం, తిరువూరు జెడ్పీ బాలికల స్కూల్‌, నందిగామలోని డాన్‌బాస్కో స్కూల్‌, శ్రీవిద్యానికేతన్‌ స్కూల్‌, జెడ్పీ పాఠశాల మైదానాలను పోటీలకు ఎంపిక చేశారు.
- మైలవరంలోని ఎల్‌బీఆర్‌సీఈ ఇండోర్‌ స్టేడియం, జగ్గయ్యపేటలోని జెడ్పీ బాలుర స్కూల్‌, మునిసిపల్‌ ఇండోర్‌ స్టేడియం, ఎస్‌జీఎస్‌ కాలేజీ మైదానాల్లో పోటీలు జరుగుతాయి.

అంతర్జాతీయ క్రీడా వేదికలపై సత్తా చాటాలి



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్‌ సెక్రటరీ ప్రద్యుమ్న

విజయవాడస్పోర్ట్స్‌: జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడా స్ఫూర్తితోనే అంతర్జాతీయ క్రీడా వేదికలపై సత్తా చాటి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్‌ సెక్రటరీ ప్రద్యుమ్న తైక్వాండో క్రీడాకారులకు సూచించారు. రాజస్థాన్‌లోని సువైమాదాపూర్‌లో ఇటీవల జరిగిన 40వ జాతీయ సీనియర్‌, జూనియర్‌ స్త్రీ, పురుషుల తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విజయవాడ క్రీడాకారులను లబ్బీపేటలోని ఆయన చాంబర్‌లో మంగళవారం అభినందించారు. ఈ పోటీల జూనియర్స్‌ విభాగంలో ఎం.యోనా, ఎస్‌.పావని సాయి, వై.చంద్రిక నాయుడు, కె.దైవకుమారి, సీనియర్స్‌ విభాగంలోని పలు ఈవెంట్‌లలో ఎస్‌.సంజన, పి.విక్టర్‌ ఆదిత్య, షేక్‌ చాంద్‌బాషా గోల్డ్‌, కె.కృష్ణవంశీ అత్యుత్తమ ప్రదర్శన చేసి మెడల్స్‌ సాధించారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్రీడాకారులను, అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్‌లు గౌరీశంకర్‌, బాలచంద్రతో పాటు ప్రోత్సహించిన కృష్ణాజిల్లా తైక్వాండో అసోసియేషన్‌ కార్యదర్శి అంకమరావును ఆయన అభినందించారు.

'ఈఎస్‌ఎంఎస్‌' యాప్‌పై ప్రత్యేక శిక్షణ

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించే క్రమంలో ఈసీఐ వివిధ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ వేదికలను అందుబాటులోకి తెచ్చిందని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌. ఢిల్లీరావు అన్నారు. ఇందులో భాగంగానే ఎలక్షన్‌ సీజర్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టమ్‌ (ఈఎస్‌ఎంఎస్‌) మొబైల్‌ యాప్‌ను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ యాప్‌ వినియోగంపై వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏజెన్సీల అధికారులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మంగళవారం కర్ణాటక సీఈవో కార్యాలయం నుంచి ఈసీఐ అధికారుల బృందం.. ఈఎస్‌ఎంఎస్‌ యాప్‌పై కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన నోడల్‌ అధికారులకు వర్చువల్‌గా అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ వర్చువల్‌ కార్యక్రమానికి కలెక్టర్‌ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు, డీసీపీ వి.అజిత, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. నగదు, లిక్కర్‌, డ్రగ్స్‌, విలువైన వస్తువులు, ఉచితాలు, ఇతర వస్తువుల సీజర్‌ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన యాప్‌ వినియోగంపై ఈసీఐ అధికారులు పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అవగాహన కల్పించారు. ఇటీవల తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యాప్‌ను విజయవంతంగా వినియోగించామని ఈసీఐ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్‌ కమిషనర్‌ కృష్ణమోహన్‌ రెడ్డి, ఎలక్షన్‌ సెల్‌ సూపరింటెండెంట్‌ సీహెచ్‌ దుర్గా ప్రసాద్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భావోద్వేగాల నియంత్రణ అవసరం

కళాశాల విద్య కమిషనర్‌ డాక్టర్‌ పోలా భాస్కర్‌

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): ప్రస్తుత సమాజంలో భావోద్వేగాల నియంత్రణ లోపించడం వల్ల విద్యార్థులు వారి జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారని, విద్యార్థులతో పాటు అధ్యాపకులు దీనిపై ఫోకస్‌ పెట్టాలని కళాశాల విద్య కమిషనర్‌ డాక్టర్‌ పోలా భాస్కర్‌ అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్‌ అండ్‌ సీవీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం యునెస్కో – ఎంజీఐఈపీ(మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ ఫర్‌ పీస్‌), ఏపీ ఉన్నత విద్యా కమిషనరేట్‌ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల సామాజిక భావోద్వేగాల శిక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. దీనిని వర్చువల్‌గా ప్రారంభించిన భాస్కర్‌ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అకడమిక్‌ కార్యక్రమాలే కాకుండా, సామాజిక బాధ్యతాయుత కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు ప్రతి కళాశాలలో ఇంక్లూసివ్‌ సెంటర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ రేపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్ర కీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఆలయ వైదిక కమిటీ మంగళవారం తెలిపింది. ఆ రోజు తెల్లవారుజాము 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని పేర్కొంది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించే గిరి ప్రదక్షిణలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ రామారావు, అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొననున్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ వర్కర్లు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె విరమించి మంగళవారం నుంచి యథావిధిగా విధులకు హాజరయ్యారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లు గత నెల 12వ తేదీ నుంచి చేసిన నిరవధిక సమ్మె విజయవంతమైందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సోమవారం రాత్రి అంగన్‌వాడీ వర్కర్లలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయ్యాయన్నారు. యూనియన్లు ఇచ్చిన ఎక్కువ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమ్మెను విరమించాలని తమ యూనియన్‌తో పాటు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నిర్ణయించాయని పేర్కొన్నారు. యూనియన్లతో పలు దఫాలు చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు, ప్రభుత్వ అధికారులకు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. సమ్మెలో పాల్గొని మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ల నాయకులు జి.బేబిరాణి, జె.లలితమ్మ, వి.ఆర్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి

మంత్రి జోగి రమేష్



గోసాలలో రోడ్డు పక్కన హోటల్‌లో టిఫిన్ తింటున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరులో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని గృహనిర్మాణ శాఖ మంత్రి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలో మంగళవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. పార్టీ నేతలు, కార్యకర్తలను కలిశారు. గ్రామాల్లో ప్రజలను సైతం కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. పెనమలూరులో వచ్చే ఎన్నికల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. గత ఎన్నికల్లో జగనన్నను గెలిపించిన తరువాత ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. జగనన్న సీఎంగా ఉంటేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టంచేశారు. పెనమలూరులో పేదల సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరించిందని పేర్కొన్నారు. ఆయన తొలుత గంగూరులో పర్యటించి సర్పంచి తస్లీమున్నీసాను పరామర్శించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు. గోసాలలో పార్టీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలతో సమావేశ మయ్యారు. రోడ్డు పక్కనే ఉన్న హోటల్‌లో టిఫిన్ చేసి గ్రామస్తులతో ముచ్చటించారు. వణుకూరులో సర్పంచి చక్క విజయ, వైఎస్సార్ సీపీ నేతలు మంత్రి జోగి రమేష్‌కు ఘన స్వాగతం పలికారు. బైక్‌ర్యాలీ నిర్వహించారు. పెనమలూరులో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సర్పంచి లింగాల భాస్కరరావు, మాజీ సర్పంచి కిలారు వెంకటేశ్వరరావు ఇళ్లకు మంత్రి జోగి రమేష్ వెళ్లి పార్టీ శ్రేణులతో మాట్లాడారు. పోరంకిలో పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు మున్నంగి అర్జున్‌రెడ్డి, నల్లమోతు జీవన్, ఆకునూరు సుబ్బారావు, అద్దేపల్లి చందు, పచ్చిగళ్ల నాగరాజు, పాతూరి రవి, శౌరి, పి.రాజేష్ పాల్గొన్నారు. రాత్రి వేళ తాడిగడప, పెదపులిపాక, యనమలకుదురులో పర్యటించారు. ఈ గ్రామాల్లో మంత్రికి ఘన స్వాగతం లభించింది. అనంతరం పెనమలూరు సెంటర్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు, పాత్రికేయులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

కానూరులో ఘన స్వాగతం

కానూరు పర్యటనకు వచ్చిన మంత్రి జోగి రమేష్‌కు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సనత్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తాడిగడప మునిసిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నాయకులు అన్నే చిట్టిబాబు, దేవభక్తుని చక్రవర్తి, చాంద్‌బాషా, సిద్దిక్, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

26న బాలోత్సవ భవన్‌లో లౌకిక కవనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26వ తేదీ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో భారత రాజ్యాంగం– లౌకిక విలువలు అంశంపై లౌకిక కవనం (కవి గాయక సమ్మేళనం) జరుగుతుందని సాహితీస్రవంతి బాధ్యుడు ఓర ప్రసాద్ తెలిపారు. బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో లౌకిక కవనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. బహుళ సంస్కృతులు, బహుళ మతాల సమాహారంగా ఉన్న మన దేశంలో ఏ విధమైన మతతత్వ, నిరంకుశ ధోరణులకు అవకాశం లేదని, రాజ్యాంగ స్ఫూర్తిని, లౌకిక విలువలను ప్రతిబింబిస్తూ ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో 100 మందికి పైగా కవులు, గాయకులు, రచయితలు పాల్గొంటారని తెలిపారు. వేంపల్లి షరీఫ్, గోళ్ల నారాయణరావు, గుండు నారాయణరావు, ఆంజనేయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

లాటరీతో రంగుల ఉత్సవం ఎడ్లబండ్ల ఎంపిక

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి రంగుల మహోత్సవంలో భాగంగా విగ్రహాలను జగ్గయ్యపేట తీసుకెళ్లే ఎడ్ల బండ్లను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, డీటీ భాస్కర్, ఎస్ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్, ఆలయ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజల సమక్షంలో ఆ లాటరీ నిర్వహించారు. మొత్తం 11 బండ్లు కట్టేందుకు 1,072 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. లాటరీలో 11 బండ్లను ఎంపిక చేశారు. లాటరీలో బరిగెల పెద వెంకయ్య (శ్రీ తిరుపతమ్మ అమ్మవారి విగ్రహం), కొత్తగుండ్ల అజయ్ (శ్రీ గోపయ్య స్వామి విగ్రహం), గుంజి రాజేశ్వరి (శ్రీ ఉన్న ఊరు అంకమ్మ అమ్మవారి విగ్రహం), గుంజి వెంకటకృష్ణ (శ్రీ చంద్రమ్మ అమ్మవారి విగ్రహం), దేరంగుల నాగలక్ష్మి (శ్రీ మల్లయ్య స్వామి వారి విగ్రహం), చవట వెంకట పుష్పావతి (శ్రీ మద్దిరావమ్మ అమ్మవారి విగ్రహం), రామిశెట్టి నాగేశ్వరరావు (శ్రీ వినుకొండ అంకమ్మ అమ్మ వారి విగ్రహం), బొగ్గుల రమేష్ (శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహం), తీగల శ్రీదేవి (శ్రీ గోపయ్య స్వామి ఉత్సవ విగ్రహం), గుగులోతు గోపీనాయక్ (శ్రీ పెద్దమ్మ అమ్మవారి విగ్రహం), చిట్టిమళ్ల అనూష (శ్రీ గుర్రపు విగ్రహం)ను ఫిబ్రవరి ఒకటో తేదీన ఎడ్ల బండ్లపై తీసుకెళ్లేందుకు లాటరీలో ఎంపికయ్యారు. బండ్లు వచ్చిన రైతులు వాటిని అలంకరించేందుకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జనార్దనరావు, ఆలయ ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయసమ్మతితో అయోధ్య ఆలయం సాకారం



ఆధ్యాత్మికవేత్తలను సత్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని తదితరులు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ రూరల్: న్యాయ సమ్మతితో అయోధ్యలో రామమందిర నిర్మాణం సాకారమైందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. పట్టణంలోని బంటుమిల్లిరోడ్డులో ఉన్న కోదండ రామాలయం ముంగిట అయోధ్య శ్రీరామ మందిర విగ్రహ ప్రతిష్ఠ విజయోత్సవ మహాసభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొడాలి నాని, తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. తొలుత భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గంగాధరశాస్త్రి, భారతీ తీర్థ సన్మాన గ్రహీత శ్రీనివాస బంగారయ్యశర్మ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గుడిపల్లి భానుప్రకాష్ రెడ్డి హైందవ ధర్మం గొప్ప దనం, రామ మందిర నిర్మాణ ముఖ్య ఘటనల గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ.. రామ మందిర నిర్మాణానికి జరిగిన ప్రయత్నంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరూ కలసి మెలసి జీవించాలని భావించిన పెద్దలు న్యాయ మార్గాన్ని అనుసరించారన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రీతి రామ మందిర నిర్మాణం పూర్తి చేసిన మహానుభావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు ఆధ్యాత్మికవేత్తలను ఎమ్మెల్యే కొడాలి నాని, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే కొడాలి నానిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సనాతన ధర్మ పరిరక్షకుడు మండలి హనుమంతరావు, విశ్వహిందూ పరిషత్ గుడివాడ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్, ప్రముఖ వేద పండితుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, సనాతన నాదోపాసకుడు రఘునాథశాస్త్రి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంపై జాతీయ సదస్సు ప్రారంభం



గిరిబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న లయోల సిబ్బంది

గుణదల (విజయవాడ తూర్పు): కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రసాయన శాస్త్రం దోహదపడుతుందని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎల్.గిరిబాబు పేర్కొన్నారు. రసాయన శాస్త్రంలో రెండు రోజులు జరిగే జాతీయ సదస్సు మంగళవారం ఆంధ్రలయోల కళాశాలలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన గిరిబాబు మాట్లాడుతూ.. సైన్స్ విద్యార్థులు రసాయన శాస్త్రంపై పట్టు సాధించాలని సూచించారు. కొన్ని నూతన ప్రయోగాల ద్వారా కాలుష్యాన్ని నియంత్రించొచ్చని పేర్కొన్నారు. ఇంధన నిల్వలు పెరగటానికి సైతం రసాయన శాస్త్రం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రసాయన శాస్త్ర ప్రయోగాల గురించి దిశా నిర్దేశం చేశారు. లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, కన్వీనర్ జి.వి.రమణ, రసాయన శాస్త్ర విభాగాధిపతి పి.అనీల, పలు పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

29న క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరించిన ఆర్.కృష్ణయ్య తదితరులు

ఇబ్రహీంపట్నం(మైలవరం): విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం స్థానిక రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ నెల 29న కడపలో నిర్వహించే రాష్ట్ర మహాసభలో సంఘం 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించామని పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్ల ప్రాధాన్యత అంశాలపై చర్చించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వీరభద్రయ్య, ప్రాంతీయ అధ్యక్షుడు నారాయణరావు, కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



బందరులో 87 గ్రాముల బంగారం చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న చిలకలపూడి పోలీసులు



నిందితుల వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాకేంద్రమైన మచిలీపట్నంలోని ఓ ఇంటిలో మంగళవారం దొంగలు పడి 87 గ్రాముల బంగారం చోరీ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబం నుంచి వివరాలు, నేరస్తుల వేలిముద్రలను క్లూస్ టీం సిబ్బంది సేకరించారు. ఈ ఘటన ఒకటో డివిజన్‌లోని శ్రీనివాసనగర్‌లో జరిగింది. చిలకలపూడి పోలీసుల కథనం మేరకు.. శ్రీనివాసనగర్‌కు చెందిన జె.వి.దత్తాచార్యులు బొగ్గు గనుల్లో డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. ఈ నెల 15వ తేదీన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి హైదరాబాదులో ఉన్న తన కుమారుడి ఇంటికి వెళ్లారు. 23వ తేదీన తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో సామగ్రితో పాటు బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా కనిపించడంతో అనుమానించిన దత్తాచార్యులు విషయాన్ని వెంటనే సమీప బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. ఇంటికి ఓ వైపు ఉన్న తలుపులను బద్దలుగొట్టి దండగులు ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసినట్లు నిర్ధారించుకున్న దత్తాచార్యులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సీసీఎస్ డీఎస్పీ మురళీకృష్ణ, చిలకలపూడి, ఆర్‌పేట, ఇనగుదురుపేట సీఐలు సీహెచ్.సతీష్, శ్రీనివాస్ యాదవ్, సీహెచ్.విద్యాసాగర్, పలువురు సీసీఎస్ సిబ్బంది హుటాహుటిన చోరీ జరిగిన ఇంటి వద్దకు చేరుకున్నారు. నిందితుల వేలిముద్రలను క్లూస్‌టీం సిబ్బంది సేకరించారు. సీసీఎస్ డీఎస్పీ మురళీకృష్ణ బాధిత కుటుంబం నుంచి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడు దత్తాచార్యులు 87 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాణిగారితోటలో కరెంట్ ఆఫీస్ వెనుక వైపు వీధిలో నాగ వెంకట దుర్గారావు(28) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతను బిల్డింగ్ స్లాబ్ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. అతనికి భార్య దేవి, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. దుర్గారావు రోజు స్లాబ్ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో దేవి పుట్టింటికి వెళ్లేది. కుటుంబ పెద్దలు సర్దిచెప్పడంతో తిరిగి భర్త వద్దకు వచ్చేది. కొంతకాలంగా భార్యతో దుర్గారావు బాగా గొడవపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఫోన్ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దేవిపై దుర్గారావు చేయి చేసుకున్నాడు. వెంటనే ఆమె దగ్గరలోని తన మామగారి ఇంటికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ఆమె ఇంటికి వచ్చి తలుపు తీసి చూడగా దుర్గారావు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

28న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్.కృష్ణంరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి విజయవాడ గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం నాడు – నేడు' అంశంపై వ్యాస రచన, 'ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం – అభివృద్ధి'పై క్విజ్, 'ఏపీ ప్రభుత్వ పాలన – సంక్షేమ పథకాలు – మీకు నచ్చిన అంశాలు' అంశంపై వక్తృత్వ పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రతి విభాగానికి నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 98493 48066 వాట్సప్ నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అవినాష్ సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు దేవినేని సుధీర అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కో ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుణదల లూర్ధు మాత వేడుకలు



పెనమలూరు: గుణదల లూర్ధుమాత వంద వసంతాల వేడుకలు కానూరు మౌంట్‌కార్మిల్ పుణ్యక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన గుణదల లూర్ధుమాత స్వరూపాన్ని ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తుల దీవెనల కోసం ప్రదర్శించారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి లూర్ధుమాతను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రదీప్, దేవదానం, ఉపదేశకులు పాల్గొని దివ్యబలి పూజ జరిపారు.

11న శతాధిక కవి సమ్మేళనం



విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినింపిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ సాక్షిగా ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కలిమిశ్రీ అన్నారు. స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కలిమిశ్రీ మాట్లాడుతూ పుణ్యభూమి నా దేశం నమో నమామి పేరుతో శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయని కవి సమ్మేళనంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని 83329 03156 నంబరులో సంప్రదించాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవేంద్రశేఖర్, సంస్థ సభ్యుడు కుర్రా సురేష్ పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడు మారేష్‌కు అభినందన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ ఎన్. మారేష్‌ను ఏపీ ముదిరాజ్/ముతరాసి కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో అభినందించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ మారేష్ తమ సామాజికవర్గానికి చెందినవారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యమిచ్చి వారికి సముచిత స్థానాలను కల్పించారని తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్‌లో నివసిస్తున్న కర్నాటి శ్రీనివాసరావు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి పేరు వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన నేపథ్యంలో మట్టి ఖర్చుల కింద రూ.10వేల నగదును స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మృతుడి అయిన భార్య కర్నాటి స్వరాజ్యానికి అందజేశారు. మృతుడి నామినీకి త్వరలో మిగిలిన సొమ్ము ఆమె బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని నేతలు చెప్పారు.

సర్కారు బడి మారుతోంది

విద్యపైనే దేశ భవిత ఆధార పడి ఉందని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ విద్యలో సమూల మార్పులు చేస్తున్నారు. మన బడి నాడు నేడులో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా సర్కారీ బడులను తీర్చిదిద్దుతున్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కనిపిస్తున్న స్పష్టమైన మార్పు. దీనికి నిదర్శనం 'తూర్పు'లో జమ్మిచెట్టు సెంటర్‌లోని బీఎస్‌ఆర్‌కే హైస్కూల్. మన బడి నాడు నాడు పథకం రెండో దశలో భాగంగా వసతులను చకచకా ఏర్పాటు చేస్తున్నారు. ఇవి తుది దశలో ఉన్నాయి.
–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)

- బీఎస్‌ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్లో రూ.2.50 కోట్లతో నాడు–నేడు పనులు
- తొలగుతున్న సమస్యలు
- అదనంగా 14 తరగతి గదులు, ఇతర సౌకర్యాల కల్పన
- తుది దశలో పనులు



జమ్మిచెట్టు సెంటర్‌లోని బీఎస్‌ఆర్‌కే మునిసిపల్ హైస్కూల్



స్కూల్ కారిడార్‌లో అమర్చిన టైల్స్

నాడు–నేడు నిధులతో స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ (బీఎస్‌ఆర్‌కే) హై స్కూల్లో అధునాతన హంగులు ఏర్పాటుచేస్తున్నారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయల అంచనాతో ఈ పాఠశాలలో నాడు–నేడు పథకం రెండో దశలో భాగంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం ఇవి చివరి దశకు చేరుకున్నాయి.

14 అదనపు గదులు

ఈ పాఠశాలలో ఎలిమెంటరీ, హైస్కూల్ విద్యార్థులు మొత్తం 800 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 25 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు తరగతి గదులు లేవు. దీంతో ఒకే తరగతి గదిలో రెండు లేదా మూడు సెక్షన్ల విద్యార్థులను కలిపి కూర్చోపెడుతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాఠాలు అందరికీ వినిపించేవి కాదు. ఉపాధ్యాయులకు విద్యార్థులపై పర్యవేక్షణ కూడా సాధ్యమయ్యేది కాదు. నాడు–నేడులో భాగంగా ఈ పాఠశాలకు 14 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. వీటిలో 10 తరగతి గదుల పనులు పూర్తయ్యాయి. ఇవి అందుబాటులోకి రావడంతో చాలా వరకు సమస్య పరిష్కారమైంది. దీంతో ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. విద్యార్థులు కూడా చక్కగా పాఠాలపై శ్రద్ధ పెడుతున్నారు. మిగిలిన నాలుగు గదుల నిర్మాణం పూర్తై కిటికీల ఏర్పాటు ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి.

అదనపు హంగులు ఇవీ

- తరగతి గదితో పాటుగా విద్యార్థులు కూర్చోడానికి రంగు రంగుల బెంచీలు సిద్ధమయ్యాయి. ప్రతి తరగతి గదిలో గ్రీన్ బోర్డులు, లైట్లు, ఫ్యాన్లు అమర్చారు.
- విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా వంట చేయడానికి ప్రత్యేకంగా గదిని నిర్మించారు. గతంలో పాఠశాల ఆవరణలోనే చెట్టు కింద వంట చేసేవారు.
- పాఠశాల ప్రహరీ నిర్మాణంతో పాటుగా ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పక్కన ఉన్న ప్రైవేటు భవనాల నుంచి పాఠశాల ఆవరణలోకి రాత్రి వేళ యువకులు రాకుండా నియంత్రించగలిగారు.
- విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మంచినీటి సౌకర్యానికి ఆర్‌వో ప్లాంట్ కూడా ఏర్పాటు చేయనున్నారు
- తరగతి గదులకు టైల్స్ ఏర్పాటు చేశారు.
- పాత తరగతి గదులకు ధ్వంసమైన కిటికీలను తొలగించి కొత్తవి అమర్చారు.



నాడు నేడు నిధులతో అన్ని వసతులు

నాడు నేడు పథకం ద్వారా రెండున్నర కోట్ల రూపాయాలతో చేపట్టిన పనులతో ఎప్పటి నుంచో పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. తరగతి గదులు, మరుగుదొడ్ల సమస్యల తీరింది. త్వరలో ఆర్వో ప్లాంట్ కూడా అందుబాటులోకి తెస్తాం. వచ్చే విద్యాసంవత్సరం నాటికి పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెస్తాం.
–హెచ్ కె.నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు, బీఎస్‌ఆర్‌కే హైస్కూల్



నాణ్యతతో పనులు పూర్తి

బీఎస్‌ఆర్‌కే హైస్కూల్‌లో నాడు నేడు నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు చాలా నాణ్యతతో చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ దగ్గర ఉండి పనులను పర్యవేక్షిస్తూ నాణ్యత విషయంతో ఎక్కడా రాజీ లేకుండా పూర్తి చేయించారు. పాఠశాలలో ఉన్న సమస్యలు అన్ని తీరాయి. చాలా సంతోషంగా ఉంది.
–ఎం.ఆంజనేయులు, చైర్మన్, బీఎస్‌ఆర్‌కే హైస్కూల్ పేరంట్స్ కమిటీ



రంగురంగుల బెంచీలు



పూర్తి అయిన ప్రహరీ



అదనపు తరగతి గదులు



సిద్ధమైన మరుగుదొడ్లు

తుది జాబితాలో పేరు లేకపోతే నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల తుది జాబితా విడుదలైన సందర్భంలో, తమ పేరు తుది జాబితాలో లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం నిర్వహించిన రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది జాబితా నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉందని, ఓటర్లు తమ ప్రాంతంలోని బీఎల్వోల ద్వారా కూడా అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. ఒకవేళ ఓటర్ల పేరు తుది జాబితాలో లేనట్లయితే వెంటనే ఫాం 6ను నింపి బీఎల్వోలకు సమర్పించాలన్నారు. సెంట్రల్‌లో మొత్తం 2,73,754 ఓట్లు ఉన్నాయని అందులో మహిళల ఓట్లు 1,40,656 కాగా మగవారి ఓట్లు 1,33,048 ఉండగా ఇతర ఓట్లు 50 ఉన్నారని తెలిపారు.
గత సమావేశంలో 1400 కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లకు ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ఆక్సిలరీ బూత్‌ను ఏర్పాటు చేసేందుకు వసతులు ఉన్నాయో లేవో తెలుసుకోవాలని బీఎల్వోలకు చెప్పామన్నారు. వీటి ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని వారు నివేదిక ఇచ్చారన్నారు. మరో ఐదు పోలింగ్ కేంద్రాలు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలుగా అదే పోలింగ్ బూత్‌లో రాబోతున్నాయని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు వై.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), వెంకట్ (బీజేపీ), ఎస్‌ఏ అన్సారి (కాంగ్రెస్), వీరభద్రరావు (సీపీఐ), యం వినోద్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, జెడ్ సి–2 మల్యాద్రి, డెప్యూటీ తహసిల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఘటనపై యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట గురుస్వామి వీధికి చెందిన చెరుకూరి మాణిక్యాలరావుకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు అజయ్ కుమార్ డిగ్రీ చదివాడు. మంగళవారం మధ్యాహ్నం అజయ్‌కుమార్ తన తమ్ముడు ఉదయ్ కుమార్‌తో కలిసి విద్యాధరపురంలో స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా నైనవరం ఫ్లైవోవర్‌పై గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వన్‌టౌన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న మాణిక్యాలరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా సిందూర పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

మదర్సాకు గ్రైండర్ పంపిణీ



మదర్సాకు గ్రైండర్ అందజేస్తున్న హెల్పింగ్ టు గెదర్ ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం ఉర్దూ పాఠశాల మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక, హేమంతరావు మాట్లాడుతూ తమవంతు బాధ్యతగా మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు కుట్రలు చేసినా వైఎస్సార్ సీపీదే విజయం

7వ డివిజన్ పర్యటనలో 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, కార్పొరేటర్ మాధురి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వచ్చే ఎన్నికల్లో గెలవడానికి చంద్రబాబునాయుడు ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ అధికారంలోకి వచ్చేది తమ పార్టీయేనని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. ఏడో డివిజన్ పరిధిలోని సీఎస్ఐ చర్చి కొండ పై ప్రాంతాల్లో మంగళవారం దేవినేని అవినాష్ పర్యటించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత అమలు చేసే అభివృద్ధి పనులపై అవినాష్ కరపత్రాలను అందచేసి వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఏ రోజు కూడా కొండప్రాంతాల్లో నివసించే ప్రజల బాగోగులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కొండ ప్రాంత వాసులకు మంచినీరు కావాలన్నా దిగువకు వచ్చి బిందెలతో పట్టుకునే వాళ్లని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ పై భాగంలో తాగునీటి సరఫరాను చేసి ఇంటి వద్దే కుళాయి ఏర్పాటు చేశామని చెప్పారు. కొండ పైభాగంలో రెయిలింగ్‌ను అమర్చామన్నారు. దేవినేని నెహ్రూ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని, ఆ తర్వాత మళ్లీ అంత స్థాయిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే వృద్ధి చెందిందని కొండ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అవినాష్ చెప్పారు. ప్రభుత్వం ఇన్ని మంచి పనులు చేస్తుంటే టీడీపీ నీచ రాజకీయాలకు దిగజారడం సిగ్గుచేటు అని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ ఎం.మాధురి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రివర్‌ఫ్రంట్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకురండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రివర్‌ఫ్రంట్ పార్క్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహకంలో వీఎంసీ ఆధ్వర్యాన నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పార్క్‌ను 15 రోజుల్లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రివర్ ఫ్రంట్ పార్క్‌ను మంగళవారం ఉదయం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలంటే కేవలం ముఖద్వారాన వెళ్లి చివరి వరకు పనులు పూర్తి చేయాలంటే కష్టమని, వెనక వైపు నుంచి కూడా ఒక మార్గాన్ని సూచించి ఇరువైపులా పనులు త్వరితగతిన జరగాలని తెలిపారు. కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంట సుందరంగా, ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుక పనులు జరుగుతున్నాయన్నారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25 కి.మీ పొడవున రూ.7.8 కోట్ల నగర పాలక సంస్థ వ్యయ అంచనాతో, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ వారి వ్యయంతో జరుగుతున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ట్రీ కెనాఫీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బేస్మెంట్ పనులు పరిశీలించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులను 15 రోజుల్లో పూర్తి చేయండి

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వెహికల్ డిపో వద్ద ఉన్న కెనాల్బండ్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి పార్క్ లో గ్రీనరీ అభివృద్ధి చేయాలని కమిషనర్ అన్నారు. మంగళవారం ఉదయం నగర పర్యటన లో భాగంగా ఆయన మధురానగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాస్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

యూనిట్లు స్థాపించేలా ఆర్పీలు చూడాలి



మాట్లాడుతున్న శాంతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వృత్తి విద్యాకోర్సులను నేర్చుకున్న వారితో యూనిట్లను స్థాపించేలా రిసోర్స్ పర్సన్స్ చూడాలని ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కె.శాంతి చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మంగళవారం వృత్తి విద్యాకోర్సులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్‌కు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ జరిగింది. శాంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వృత్తి విద్యా కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందేలా యువతను తీర్చదిద్దాలని ఆమె అన్నారు. వ్యాపారవేత్త సీహెచ్ సుశీల మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన వివిధ వస్తువులను సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేసుకుని మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ విద్యార్థులను అప్‌డేట్ చేస్తూనే రిసోర్స్ పర్సన్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరో డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్నాథ్ ఆధ్వర్యాన బుధవారం మారుతీనగర్ కోకో కోలా కొండపై బెల్లపు శ్రీరాములు స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. దీన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రారంభించనుండగా, సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేయనున్నట్లు ఆస్పత్రి అధినేత పి.సురేష్ కుమార్ తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు, బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్ గ్రూపింగ్ వంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

విజయవాడ కల్చరల్: వెనిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, ప్రధాన కార్యదర్శి నీలం దుర్గారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఓబుల్‌రెడ్డి బృందం వైద్య సేవలు అందిస్తారని కళాకారులు, కళాభిమానులు అవకాశం ఉపయోగించుకోవాలని సూచించారు.

సత్తా చాటిన ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రాస్ కంట్రీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఉయ్యూరులో జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో కళాశాల విద్యార్థులు ఛాంపియన్ షిప్‌తో మొదటి స్థానం సాధించారు. అలాగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచారు. క్రాస్ కంట్రీ పోటీల్లో జీ వెంకటేష్, జీ తరుణ్‌లు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు సెలెక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో కే శ్రీను సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి సెలెక్ట్ అవ్వడం కళాశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్ అభినందించారు.

14న సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పంచమి పురస్కరించుకుని ఫిబ్రవరి 14వ తేదీ సామూహిక ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయిశ్రీ హైస్కూల్ ప్రిన్సిపాల్ బాదినేని రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు లంబాడీపేట గాంధీ బొమ్మ సెంటర్‌లోని సాయిశ్రీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు వచ్చే నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

నగరంలో నేటి నుంచి ఆభరణాల ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తరాలనాటి వారసత్వ ఆభరణాల శైలిలో రూపుదిద్దుకున్న హెర్‌లూమ్ ఆభరణాలకు పేరొందిన బ్రాండెడ్ నగల ప్రదర్శన నగరంలో బుధవారం నుంచి ప్రారంభం కానుందని నిర్వాహక సంస్థ ఉమ్మిడి బంగారు జ్యుయలర్స్ ప్రతినిధులు తెలిపారు. చారిత్రక, సంప్రదాయ ఆభరణాల్లోని విశిష్టతను ఇష్టపడే ఆభరణ ప్రియులకు ఈ ప్రదర్శన కనువిందు చేస్తుందన్నారు. నగరంలోని లెమన్ ట్రీ హోటల్‌లో బుధవారం ప్రారంభమవుతుందని, రెండు రోజుల పాటు కొనసాగుతుందని వారు వివరించారు.

అన్న సమారాధనకు రూ.1.78 లక్షల విరాళం



పెనమలూరు: పెనమలూరులో ఆదివారం జరగనున్న అయ్యప్పస్వామి అన్న సమారాధనకు అమెరికాకు చెందిన ఎన్నారైలు మంగళవారం విరాళం అందజేశారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్న సమారాధనను భక్తులు నిర్వహిస్తున్నారు. జనవరి 28వ తేదీన నిర్వహించనున్న అన్న సమారాధనకు అవసరమైన బియ్యానికి రూ.1,78,655ను ఎన్నారైలు పంపారు. ఈ మేరకు నిర్వాహకులకు నగదును ఎన్నారై ప్రతినిధులు మోర్ల నరేంద్రబాబు, కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్ అందజేశారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారి అభివృద్ధి నిమిత్తం స్థానిక అధికారులు అంచనాలు రూపొందించి నిధులు మంజూరుకై ఉన్నతాధికారులకు నివేదించారు. గ్రామంలోని మైమార్ట్ సమీపంలో కనుమూరి మాన్సస్ నుంచి రామకృష్ణ ఎన్క్లేవ్ వరకు సీసీ రహదారి అభివృద్ధికి ఇటీవల కాలనీ వాసులు కలెక్టర్ ఢిల్లీరావును కలిసి స్పందనలో వినతి పత్రం సమర్పించారు. దీనిపై అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ రహదారిని 154 మీటర్ల పొడవునా సిమెంట్ రహదారితో పాటు డ్రెయిన్ నిర్మాణానికి రూ.22 లక్షలతో అంచనాలు తయారు చేసి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రహదారిని అభివృద్ధి చేయనున్నారు.

క్లుప్తంగా...

భారీ సంఖ్యలో ఎంపీడీవోలు బదిలీ!

సాక్షి, అమరావతి:అసెంబ్లీ, లోకసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో సగానికి పైగా ఎంపీడీవోలు బదిలీ కానున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల కార్యకలాపాలకు సంబంధం ఉండే ఏ అధికారీ గత నాలుగేళ్ల కాలంలో మూడేళ్ల పాటు ఒకే జిల్లాలో పనిచేయకూడదు, దాంతో పాటు ఆ అధికారి ప్రస్తుతం సొంత జిల్లాలో పనిచేస్తుండకూడదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రూట్ ఆఫీసర్ లేదంటే జోనల్ ఆఫీసర్ విధులతో పాటు మోడల్ కోడ్ అమలు ప్రక్రియలో ఇన్‌చార్జిలుగా ఎంపీడీవోలు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ ఎంపీడీవోల వివరాలు పరిశీలించగా.. రాష్ట్రంలో మొత్తం 661 మండలాలకు గానూ 383 మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలు ఆయా నిబంధనల పరిధిలోకి వస్తారని గుర్తించింది. ఈ మేరకు ఆయా ఎంపీడీవోల జాబితాను సిద్ధంచేసి ఎన్నికల సందర్భంగా బదిలీ చేసేందుకు వీలుగా తుది ఆమోదం కోసం ఎన్నికల సంఘానికి పంపింది. ఒకట్రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

చంద్రబాబు గ్రౌండ్‌లో లేరు!

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): పద్నాలుగేళ్లు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అభివృద్ధి చేసింది సున్నా అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. బాబు ప్రస్తుతం గ్రౌండ్లో లేరని, ఇటీవల తిరుపతిలో నిర్వహించిన బహిరంగ సభలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమివ్వడమే అందుకు నిదర్శనమని తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో చంద్రబాబు విశాఖను ఏ మేరకు అభివృద్ధి చేశారో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అయోధ్యను వాడుకుంటున్నదని చింతామోహన్ ఆరోపించారు. దేశంలో పేదరికం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలు విలయ తాండవం చేస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చేందుకే అయోధ్యను మోదీ తెరపైకి తీసుకొచ్చారన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్రను అసోంలో అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని తెలిపారు. ఏపీలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల రావడంతో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 130 అసెంబ్లీ, 20 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తెగిన గాలిపటం షర్మిల

స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ



సీతంపేట (విశాఖ ఉత్తర): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల తెగిన గాలిపటమని.. గమ్యం లేకుండా ప్రయాణిస్తూ, చంద్రబాబు నాయుడు ఆడించే ఆటలో తోలుబొమ్మగా మారిందని స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ దుయ్యబట్టారు. మణిపూర్‌లో జరిగిన అల్లర్ల పేరుతో ఇక్కడి క్రైస్తవులను రెచ్చగొట్టాలని చూస్తే ఎవరూ నమ్మరన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతి క్రైస్తవుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నాడని స్పష్టం చేశారు. విశాఖ నగరంలోని లలితానగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటు, ఇల్లు లేని షర్మిల ఇక్కడ అభివృద్ధిపై మాట్లాడడం అర్థరహితమన్నారు. ఆకలితో ఉన్నవాడికే రాజ్యాధికారం దక్కాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రాజ్యాధికారంలో సింహభాగం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఒక్క రాజధాని కూడా నిర్మించలేదని చెప్పిన తమకు విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్, జీ20 దేశాల సదస్సులతో అంతర్జాతీయంగా ఎంత గుర్తింపు వచ్చిందో తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ చనిపోయిన తర్వాత ఎఫ్ఐఆర్‌లో పేరును చేర్చిన నీచ సంస్కృతి కాంగ్రెస్‌పార్టీదని విమర్శించారు. అదే పార్టీలో ఏపీసీసీ అధ్యక్షురాలిగా ఎలా కొనసాగుతున్నారో సమాధానం చెప్పాలని జాన్‌వెస్లీ నిలదీశారు.

‘కడప’టికి సైకిల్‌కు శూన్యమే!

టీడీపీలో ఇన్‌చార్జిల ఇష్టారాజ్యం

- విభేదాలు తారస్థాయికి
- బద్వేల్‌లో రితీష్ వైఖరిపై సీనియర్ల కినుక
- మైదుకూరులో పుట్టా సుధాకర్ యాదవ్ ఏకపక్ష వైఖరి
- కడపలో మాధవీరెడ్డి తీరుతో కార్యకర్తల బెంబేలు
- ప్రొద్దుటూరులో పెద్దలను పట్టించుకోని ప్రవీణ్



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రమయ్యాయి. వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఎప్పటి నుంచో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న శ్రేణులు పరేషాన్ అవుతున్నాయి. సీనియారిటీకి విలువ ఇవ్వకపోవడం, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వంటివి టీడీపీకి మైనస్ అవుతున్నాయని పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. బద్వేల్, మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి వైఖరి ఇలాగే ఉంటే జిల్లాలో గత ఎన్నికల్లోలాగానే తెలుగుదేశానికి మిగిలేది శూన్యమేననే వాదన ఆ పార్టీలోనే వ్యక్తమవుతోంది.

రీతి లేని రితీష్

బద్వేల్‌లో ఎప్పటి నుంచో టీడీపీకి విధేయతగా ఉన్న దివంగత కర్నాటి శివారెడ్డి (కర్నాటి వెంకటరెడ్డి), బద్వేల్ మాజీ జెడ్పీటీసీ శిరీష కుటుంబాలతోపాటు, కలశపాడు బాలిరెడ్డి వంటి వారు ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి కొనిరెడ్డి రితీష్‌కుమార్‌రెడ్డి తీరు తమకు అవమానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివంగత మంత్రి వీరారెడ్డి హయాం నుంచి టీడీపీలో ఉన్న సీనియర్ నేతలు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులను చవిచూస్తున్నారు.

పుట్టెడుజిత్తుల.. ‘పుట్టా’

మైదుకూరు నియోజకవర్గం ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఏకపక్ష వైఖరి వల్ల టీడీపీలో తొలి నుంచి ఉన్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డికి ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. దువ్వూరు మండల నేత వెంకట కొండారెడ్డిదీ అదే దుస్థితి. డీఎల్ రవీంద్రారెడ్డి మంత్రిగా ఉన్న కాలంలో కూడా రెడ్యం సోదరులు టీడీపీ జెండా కోసం పనిచేశారు. అలాంటి వారినీ పుట్టా సుధాకర్ యాదవ్ ఆ పార్టీ నుంచి సాగనంపేందుకు సిద్ధమయ్యారని శ్రేణుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

సెల్ఫ్ ఫోకస్‌లో ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరులో టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా ఒంటెత్తు పోకడలు పోతున్నారు. సీనియర్ నేతలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డిలను విస్మరిస్తూ తను మాత్రమే ఫోకస్ కావాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఏదేమైనా వైఎస్సార్ జిల్లాలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల వైఖరికి విస్తుపోతున్న సీనియర్ నేతలు పార్టీలో కొనసాగాలా లేదా? ప్రత్యామ్నాయమార్గం ఏమిటీ? అనే సందిగ్ధంలో ఉన్నారు.

మాధవీరెడ్డి దుందుడుకు చర్యలతో విస్తు

తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి దుందుడుకు చర్యలతో తెలుగుతమ్ముళ్లు విస్తుపోతున్నారు. ప్రశాంతతకు కేంద్ర బిందువుగా ఉన్న జిల్లా కేంద్రంలో రెచ్చగొట్టే చర్యలకు ఆమె పాల్పడుతున్నారనే ఆవేదన ఆ పార్టీ సీనియర్ల నుంచి వ్యక్తమవుతోంది. నాయకురాలిగా ఫోకస్ కావాలనే తపన ఉండొచ్చు కానీ, బహిరంగంగా అధికార పార్టీ క్యాడర్‌తో వాదనకు దిగడం విడ్డూరంగా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషాలాంటి స్థాయి ఉన్న వారినీ ఆమె ఏకవచనంతో సంబోధిస్తున్నారని పలువురు ఎత్తిచూపుతున్నారు. సొంత క్యాడర్‌తో కూడా ఆమె దురుసుగా వ్యవహరిస్తున్నారనే వాదన ఉంది. పార్టీ ఇన్‌చార్జిగా ఇప్పుడే ఇలా ఉంటే, అధికారిక హోదా దక్కితే ఆమెను నియంత్రించడం సాధ్యం కాదనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

‘సొమ్ము’ సిల్లెను బాబయో!

పెదబాబు, చినబాబు ‘డబ్బు’ల్ గేమ్‌కు బలి

- టీడీపీ నేతల పెదబొబ్బలు
- టికెట్ ఇస్తామంటూ రెండు వర్గాలకు ఆశ
- తండ్రీకొడుకులు చెరోవైపు ఉండి డ్రామాలు
- పార్టీ కార్యక్రమాలకు భారీగా ఖర్చు పెట్టించిన వైనం
- తీరా ఇప్పుడు ఎక్కువ డబ్బులు ఇస్తేనే టికెట్ అంటూ సంకేతాలు
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పరిస్థితి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆడిన డబుల్ గేమ్‌కు కీలక నాయకులు బలయ్యారు. నిర్వీర్యమైన పార్టీ కోసం ఇన్నాళ్లూ డబ్బులు ఖర్చుపెట్టిన నేతలు ఇప్పుడు టికెట్ కోసం అర్రులు చాస్తున్నారు. అధిష్టానం పెడుతున్న కండిషన్లు, చేస్తున్న పైరవీలు చూసి ఖిన్నులవుతున్నారు. రొక్కమాడితేనే రాజకీయం, భారీగా ముట్టజెప్పినోడికే టికెట్లు అనే పరిస్థితి పార్టీలో నెలకొనడంతో తీవ్రంగా కలత చెందుతున్నారు. ప్రస్తుతానికి వారు నిశ్శబ్దంగా ఉన్నా.. టికెట్లు ఖరారు చేశాక పార్టీలో ముసలం తప్పదనే వాదన అంతర్గతంగా వ్యక్తమవుతోంది.

ఆశ చూపిన తండ్రీకొడుకులు

ఇన్నాళ్లూ ఒక్కో నియోజకవర్గంలో ఇద్దరు, ముగ్గురికి టికెట్ల ఆశ చూపిన టీడీపీ అధినేత బాబు, ఆయన తనయుడు లోకేశ్ ఇప్పుడు డబ్బుంటేనే తమ వద్దకు రావాలని కరాఖండీగా చెబుతున్నారు. పార్టీకెంత ఇస్తారు? ఎంత ఖర్చుపెడతారంటూ బేరసారాలు ఆడుతున్నారు. దీంతో విస్తుపోవడం నేతల వంతవుతోంది. ఇప్పటివరకు పార్టీ కోసం ఖర్చు పెట్టించి ఇప్పుడు ఇలా చేయడం న్యాయం కాదని కొందరు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండ, గొండుల్లో ఎవరికి!

శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, యువ నాయకుడు గొండు శంకర్ టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటివరకు వీరిలో ఒకరిని చంద్రబాబు, మరొకరిని లోకేశ్ ప్రోత్సహించారు. ఇద్దరూ పార్టీ కోసం గట్టిగానే ఖర్చుపెట్టారు. అయితే ఇప్పుడు ఎక్కువ ఖర్చుపెట్టిన వారికే టికెట్ అంటూ లీకులు ఇస్తుండడంతో లక్ష్మీదేవి, శంకర్ ఖిన్నులవుతున్నారు.

‘గోవిందా’.. వెంకటరమణ

పాతపట్నం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, యువ నాయకుడు మామిడి గోవిందరావు టికెట్ రేసులో ఉన్నారు. వీరిలో కలమట వెంకటరమణను కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రోత్సహిస్తుండగా, మామిడి గోవిందరావును లోకేశ్ ప్రోత్సహిస్తున్నారు. వీరిలో మామిడి గోవిందరావుతో చాలా ఖర్చుపెట్టించారు. ఇప్పుడు టికెట్‌కు రేటుగట్టి బేరసారాలకు దిగడంతో ఆశావహులు బిత్తరపోతున్నారు.

కలిశెట్టి ‘కళా’విహీనం

ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కళా వెంకటరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడి మధ్య టికెట్ పోరు నడుస్తోంది. 2019లో అధికారం కోల్పోయాక కొన్నాళ్లు కళా స్తబ్ధుగా ఉండిపోవడంతో కలిశెట్టి క్రియాశీలకం అయ్యారు. పార్టీ కోసం భారీగా ఖర్చుపెట్టారు. ఒక దశలో టికెట్‌కు హామీ కూడా లభించింది. ఇప్పుడు అధిష్టానం మాట మార్చడంతో కలిశెట్టి అప్పలనాయుడు సందిగ్ధంలో పడ్డారు.

‘బగ్గు’.. భగ్గు

నరసన్నపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఒకవైపు ప్రోత్సహిస్తూనే మరోవైపు మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు కుమారుడు, డాక్టర్ బగ్గు శ్రీనివాసరావును చంద్రబాబు, లోకేశ్ తెరపైకి తెచ్చారు. తండ్రీకొడుకులు చెరోవైపున ఉండి గేమ్ ఆడారు. చివరకు ఇప్పుడు ఎంతైనా ఖర్చుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బగ్గు శ్రీనివాస్‌వైపే మొగ్గు చూపిస్తుండడంతో బగ్గు రమణమూర్తి ఆందోళన చెందుతున్నారు.

వద్దన్న వజ్జ.. తాతారావు టాటా..

పలాస నియోజకవర్గంలో గౌతు శిరీష, వజ్జ బాబూరావు, జుత్తు తాతారావులను టికెట్ ఆశ చూపి పెదబాబు, చినబాబు ప్రోత్సహించారు. అయితే ఇప్పుడు భారీగా డబ్బులు పెట్టాల్సిన వ్యవహారం కావడంతో వజ్జ బాబూరావు, జుత్తు తాతారావు వెనక్కి తగ్గినట్టు సమాచారం.

భీమవరంలో తెలుగు తమ్ముళ్ల తన్నులాట

నియోజకవర్గంలో టీడీపీని వేధిస్తున్న నాయకత్వ లేమి

- వర్గాలుగా విడిపోయిన స్థానిక నాయకులు
- పార్టీ కార్యక్రమానికి జెండాలు కూడా ఇవ్వట్లేదంటూ కొట్లాట

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో టీడీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. ఈ నెల 28న నిర్వహించతలపెట్టిన జయహో బీసీ కార్యక్రమంపై మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చర్చ జరిగింది. జయహో బీసీ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి నుంచి జెండాలు ఇప్పించాలని బీసీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సుబ్బారావు కోరగా.. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు నిరాకరించారు. దీంతో వారిద్దరూ ఒకరినొకరు తీవ్రంగా దూషించుకున్నారు. ఇరు వర్గాలు పరస్పరం తోసుకోవడంతో పాటు దాడి చేసుకున్నారు. ఒకప్పుడు టీడీపీకి బలమైన నియోజకవర్గంగా ఉన్న భీమవరం.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా మారింది. అదే సమయంలో సీతారామలక్ష్మికి భీమవరం నియోజకవర్గం బాధ్యతలు అప్పగించడంతో ఆ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తల్లో నివ్వురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి పదేపదే బయటపడుతూ వస్తోంది. నాయకత్వ లేమి వల్ల టీడీపీలో గ్రూప్ రాజకీయాలు పెరిగిపోయాయి. పట్టణ కమిటీ ఎన్నికలు ఏకపక్షంగా నిర్వహించారంటూ తోట సీతారామలక్ష్మిపై అధిష్టానానికి ఫిర్యాదులు చేయడంతో పాటు నిరసన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయినా అధిష్టానం పట్టించుకోకపోవడంతో తెలుగు తమ్ముళ్లు అవకాశం దొరికినప్పుడల్లా బాహాబాహీకి దిగుతున్నారు.

మంగళగిరిలో లోకేశ్ ఓటమి తథ్యం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల మద్దతుతో మరోమారు సీఎంగా జగన్

- ఈ నెల 31న మంగళగిరిలో సామాజిక సాధికార యాత్ర మహాసభ
- కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

మంగళగిరి/తాడేపల్లి రూరల్: గడిచిన రెండు దఫాలుగా మంగళగిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసిందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లోనూ తమ పార్టీ అభ్యర్థి గంజి చిరంజీవి తప్పక విజయం సాధిస్తారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 31న మంగళగిరిలో వైఎస్సార్ సీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నియోజకవర్గంలో గతంలో తెలుగుదేశం పార్టీ గెలిచిన దాఖలాలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి నారా లోకేశ్ ఓటమి తథ్యమన్నారు. మంగళగిరిలో వైఎస్సార్ సీపీ నుంచి వెనుకబడిన సామాజిక వర్గానికి (చేనేత) చెందిన వ్యక్తి పోటీలో నిలబడుతున్నారని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు వైఎస్ జగన్ ఇస్తున్న ప్రాధాన్యత దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఏ పార్టీ ఇవ్వడం లేదన్నారు. నియోజకవర్గంలో బీసీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించుకుంటారని, అలాగే రాబోయే ఎన్నికల్లో ఆయా వర్గాల ప్రజలు వైఎస్ జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేస్తారని నమ్మకంగా చెప్పారు. మంగళగిరిలో మిద్దే సెంటర్‌లో నిర్వహించే సామాజిక సాధికార యాత్ర మహాసభకు ముందు పెద్దఎత్తున పాదయాత్ర జరుగుతుందని చెప్పారు. ఈ పాదయాత్రలో కార్యకర్తలు, బడుగు బలహీన వర్గాలు, దళిత సోదర సోదరీమణులు పాల్గొనాలని, మహాసభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీలో కాంగ్రెస్ చనిపోయింది

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏనాడో చనిపోయిందని విజయసాయిరెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని అడ్డుగోలుగా విడగొట్టి, ఏపీ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసిందని అన్నారు. రాబోయే తరాలకు సైతం ఆ పార్టీ తీరని ద్రోహం చేసిందన్నారు. ఆ పార్టీ ఏపీకి చేసిన ద్రోహాన్ని ఇక్కడి ప్రజలు ఎప్పటికీ క్షమించరని, కాంగ్రెస్ పార్టీ చరిత్రపుటల్లో కలిసిపోయిందని అన్నారు. ఈ బస్సుయాత్ర ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ పరిశీలకుడు రాపాక శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలసి విజయసాయిరెడ్డి పరిశీలించారు.

24 గంటల్లో సమస్య పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, గంజి చిరంజీవి తదితరులు

విజయసాయిరెడ్డి చొరవతో తెనాలి–మంగళగిరి రహదారికి ఆర్అండ్‌బీ శాఖ అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. విజయసాయిరెడ్డి సోమవారం మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న తెనాలి–మంగళగిరి రహదారి విషయాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో విజయసాయిరెడ్డి చొరవ తీసుకోవడంతో అధికారులు 24 గంటల్లోనే రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఐదారు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తవుతాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. సమస్యను పరిష్కరించిన ఎంపీ విజయసాయిరెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నరసరావుపేట ఎంపీ లావు రాజీనామా

- పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన



సాక్షి ప్రతినిధి, గుంటూరు: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి, పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంటే సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ అన్నారు. ఆనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి.. తర్వాత ప్రభుత్వాలు కూడా తనను అనుసరించేలా చేస్తే, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఇదే పంథాలో సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రూ. 2.61 లక్షల కోట్లు ప్రజలకు సంక్షేమం కింద ఇవ్వడం చిన్న విషయం కాదన్నారు. వైఎస్ జగన్ నమ్మకాన్ని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వమ్ము చేయకుండా తానిచ్చిన ఎన్నికల ఎంపీ మేనిఫెస్టో ప్రకారం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. అయితే గత కొన్ని రోజులుగా తన సీటు విషయంలో అనిశ్చితి నెలకొందని, కొత్త అభ్యర్థికి ఇక్కడ అవకాశం ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. దీంతో అటు నాయకులు, ప్రజలు, క్యాడర్ గందరగోళ వాతావరణంలోకి వెళ్లిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ పరిణామాలు పార్టీకి, తనకి ఎవరికీ ఉపయోగం లేనందువల్లే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకూ తనకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, తన సీటు కోసం చొరవ చూపిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్ఛాపురం నుంచి షర్మిల ఎన్నికల శంఖారావం

కంచిలి/ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్ /విజయనగరం ఫోర్ట్ : రాష్ట్ర ప్రజలు బీజేపీని ఒక్క సీటులో కూడా గెలిపించకపోయినా రాష్ట్ర నాయకులు మాత్రం ఆ పార్టీకి ఊడిగం చేస్తున్నారని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి మంగళవారం ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభించారు. దీనికి ముందుగా ఆమె.. నాడు వైఎస్సార్ పాదయాత్ర ముగింపు రోజున ఆవిష్కరించిన విజయ స్థూపం వద్ద గల వైఎస్సార్ చిత్రపటానికి, ఆ స్థూపం ఎదురుగా ఆమె అప్పట్లో పాదయాత్ర ముగించాక ఆవిష్కరించిన వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీఎం అయ్యాక ఆరోగ్యశ్రీ, ఉపాధిహామీ, రైతులకు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ తదితర పథకాలను అమలు చేయడంతో పాటు 46 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు కట్టారని చెప్పారు. తనకు 25 ఎంపీ సీట్లిస్తే బీజేపీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి కూడా బీజేపీని ప్రత్యేక హోదా అడగలేదన్నారు. కాగా, విజయనగరంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో షర్మిల మాట్లాడుతూ అధికారంలోకొస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బీజేపీ.. హోదా ఇవ్వకుండా మోసం చేస్తోందని దుయ్యబట్టారు.

లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లు

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లుగా ఉంటారని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని, వారే మళ్లీ గెలిపించుకుంటారని చెప్పారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా సీఎం జగన్ రూ.2.53 లక్షల కోట్లు ప్రజలకు నేరుగా వారిఖాతాల్లోనే జమ చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు గత టీడీపీ హయాంలో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాల అమల్లో తేడాను గమనిస్తున్నారని తెలిపారు. జెండాలు జతకట్టినంత మాత్రాన ఏమీ కాదని, జనం గుండెల్లో గుడి కట్టుకుని మహానేత వైఎస్సార్ ఉన్నారని, ఇప్పుడు అదే ప్రజల హృదయాల్లో సీఎం జగన్ ఉన్నారని చెప్పారు. ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి, మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన చెప్పారు.

బాబు మాయ నుంచి బయట పడితేనే మేలు

- పలాసలో సీఎం జగన్ ప్రారంభించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కనిపించలేదా?
- అక్కడే ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎవరు కట్టారో తెలియదా..
- ఉద్దానంలో రూ.700 కోట్లతో నిర్మించిన ‘వైఎస్సార్ సుజలధార’ను చూడలేదా..
- మూలపేటలో పోర్టు నిర్మాణ పనులు కనపడలేదా..?
- ఏపీసీసీ చీఫ్ షర్మిలకు ధర్మాన కృష్ణదాస్ ప్రశ్నలవర్షం



శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎం వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి జరగలేదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు మాయ నుంచి బయట పడితే అన్నీ బాగా కనిపిస్తాయని షర్మిలకు హితవు పలికారు. శ్రీకాకుళం జిల్లాలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో చూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. ‘షర్మిల ఇచ్ఛాపురం వెళుతున్నప్పుడు పలాసలో సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి కనిపించలేదా... ఇక ఉద్దానంలో రూ.700 కోట్లతో ‘వైఎస్సార్ సుజలధార’ను కూడా వైఎస్ జగనే ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురంలో ప్రసంగాలు చేసిన ఆమెకు అది కూడా కనిపించలేదా..? టెక్కలి దాటుకునే కదా వెళ్లారు... అక్కడ సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణం కూడా ఆమెకు కనిపించలేదు. ఆమె చంద్రబాబు చూపిన వైపు కాకుండా తల పక్కకు తిప్పి చూస్తే ఇవన్నీ బాగా కనిపిస్తాయి..’ అని కృష్ణదాస్ చెప్పారు.

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే అన్ని రంగాల్లో అభివృద్ధి

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ రాష్ట్రంలో అభివృద్ధి అన్ని రంగాల్లో కనిపిస్తోందని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.. ఇది కూడా ఆమెకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. చెప్పుడు మాటలు వింటే ఈ అభివృద్ధి ఎలా కనిపిస్తుందన్నారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఎంపీ స్థానంలో బీసీ అభ్యర్థికే అవకాశం

- సామాజిక న్యాయం దిశగా సీఎం జగన్ ఆలోచిస్తున్నారు
- ఎవరైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే
- మీడియాతో ఎమ్మెల్యేలు పిన్నెల్లి, గోపిరెడ్డి, నంబూరు



సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట: రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం అందేలా, వారికి రాజ్యాధికారం దక్కేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మాచర్లలోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బలహీన వర్గాలకు వీలైనన్ని ఎక్కువ సీట్లు ఇచ్చి ప్రత్యక్ష రాజకీయాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్నది వైఎస్ జగన్ ఆశయమని తెలిపారు. నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఓసీ అభ్యర్థులు ఉన్న నేపథ్యంలో ఎంపీ సీటు బీసీకి ఇవ్వాలని పార్టీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వివరించి, గుంటూరు ఎంపీగా పోటీచేయాలని సూచించారన్నారు. ఈ విషయంపై చర్చలు జరుగుతున్న సమయంలోనే లావు రాజీనామా నిర్ణయం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఆయనకు తొలి నుంచి పార్టీలో సముచిత గౌరవం దక్కిందన్నారు. పార్టీ అధినేతగా వైఎస్ జగన్ తీసుకున్న ఏ నిర్ణయానికైనా అందరూ కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

పార్టీకి ఎలాంటి నష్టం లేదు

లావు శ్రీకృష్ణదేవరాయలు రాజీనామా వల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండదని నరసరావుపేట, పెదకూరపాడు ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు తేల్చి చెప్పారు. మంగళవారం నంబూరు శంకరరావు ఇంట్లో వారు విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతోనే గుంటూరు నుంచి పోటీ చెయ్యను అని లావు చెప్పారని, ఆయనకు టికెట్ లేదని ఎవరూ చెప్పలేదన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యునిగా ఎవరిని ఎంపిక చేసినా తాము గెలిపించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాల్‌పురం రాము తదితరులు పాల్గొన్నారు.



ఇలా 'వెలిగొండ'గా మరో కల సాకారం

పూర్తయిన రెండో సొరంగం తవ్వకం పనులు

2014 నుంచి 2019 మధ్య ఈ ప్రాజెక్టును దోపిడీకి ఏటీఎంగా మార్చుకున్న చంద్రబాబు

కాంట్రాక్టర్లకు రూ.650 కోట్లు దోచిపెట్టి కమీషన్ల వేట

సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.1,046.46 కోట్లు వ్యయం

నాడొక కల.. నేడొక నిజం.. అదే వెలిగొండ ప్రాజెక్టు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల స్వప్నం వెలిగొండ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ సాకారం చేశారు. ప్రాజెక్టులో మొదటి టన్నెల్‌ను 2021, జనవరి 13 నాటికి పూర్తి చేయించిన ఆయన.. రెండో టన్నెల్ తవ్వకం పనులు మంగళవారం పూర్తయ్యాయి. ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన నీటిపారుదల సొరంగాల (ఇరిగేషన్ టన్నెల్స్)ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడం ద్వారా సీఎం జగన్ చరిత్ర సృష్టించారని సాగునీటిరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఈ రెండు సొరంగాలను ఫిబ్రవరి మొదటి వారంలో జాతికి అంకితం చేయనున్నారు. దీంతో వచ్చే సీజన్‌లో శ్రీశైలానికి కృష్ణా వరద జలాలు చేరిన వెంటనే.. వెలిగొండ రెండు సొరంగాల ద్వారా ఆ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమల సాగర్‌కు తరలించడానికి రంగం సిద్ధంచేశారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు, పశ్చిమ కాలువల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించి.. రైతులకు వెలిగొండ ప్రాజెక్టు ఫలాలను అందించనున్నారు. మరోవైపు.. ఈ ప్రాజెక్టును పూర్తిచేయడం ద్వారా ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, అమరావతి

వెలిగొండ.. ఓ ఇంజనీరింగ్ అద్భుతం

ప్రకాశం జిల్లా దోర్నాల సమీపంలోని కొత్తూరు నుంచి నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ భాగంలోని కొల్లంవాగు వరకు రెండు టన్నెల్స్ తవ్వకం పనులను జలవనరుల శాఖ చేపట్టింది. తొలి టన్నెల్ ఏడు డయామీటర్ల వ్యాసార్థంతో, రెండో టన్నెల్ 9.2 డయామీటర్ల వ్యాసార్థంతో తవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కొల్లంవాగు ద్వారా రోజుకు 11,583 క్యూసెక్కులు తరలించేలా కొల్లంవాగు కుడి వైపునున్న కొండను తొలచి, రెండు సొరంగాలు (టన్నెల్–1 ద్వారా 3,001 క్యూసెక్కులు, టన్నెల్–2 ద్వారా 8,582 క్యూసెక్కులు) తవ్వి.. నల్లమల పర్వతశ్రేణుల్లో ప్రకాశం జిల్లాలో పశ్చిమాన విస్తరించిన వెలిగొండ శ్రేణుల్లో సుంకేశుల, కాకర్ల, గొట్టిపడియల వద్ద కొండల మధ్యన ఖాళీ ప్రదేశాల (గ్యాప్)లను కలుపుతూ 378.5 మీటర్లు, 356 మీటర్లు, 587 మీటర్ల పొడవున కాంక్రీట్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా 53.85 టీఎంసీలు నిల్వచేసేలా నల్లమలసాగర్ సహజసిద్ధంగా రూపుదిద్దుకుంటుంది. అతితక్కువ వ్యయంతో ఇన్ని టీఎంసీలు నిల్వచేసేలా నల్లమలసాగర్‌ను నిర్మించడాన్ని ఇంజనీరింగ్ అద్భుతంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టులో 18.8 కి.మీల పొడవున తవ్విన రెండు సొరంగాలు ఆసియా ఖండంలోనే అతిపెద్ద నీటిపారుదల సొరంగాలు కావడం గమనార్హం.


రెండో సొరంగంలోని టీబీఎం

వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల తవ్వకం పనులిలా..

టన్నెల్	పొడవు (కిమీలలో)	వైఎస్ హయాంలో..		2014–19 మధ్య (టీడీపీ హయాంలో)		2019 నుంచి ఇప్పటివరకూ జగన్ హయాంలో	
		పొడవు (కిమీలలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కిమీలలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కిమీలలో)	వ్యయం (రూ.కోట్లలో)
టన్నెల్–1	18.800	11.586	469.37	4.331	284.36	2.883	181.47
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		5.53		2.41		4.12	
టన్నెల్–2	18.800	8.747	410.30	2.355	136.37	7.698	253.45
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		4.79		1.31		4.35	


శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వెలిగొండ సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని తరలించే ఫీడర్ ఛానల్

వరదాయినికి మహానేత వైఎస్ శ్రీకారం..

శ్రీశైలం నుంచి రోజుకు 11,584 క్యూసెక్కులను తరలించి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమల సాగర్‌లో నిల్వచేసి.. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టిపడియ కాలువ ద్వారా 9,500 ఎకరాలు) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు.. ఆ మూడు జిల్లాల్లోని 30 మండలాల్లో ఉన్న 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో దివంగత సీఎం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004, అక్టోబర్ 27న ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,581.57 కోట్లు ఖర్చుచేసి.. నల్లమలసాగర్‌తోపాటు సొరంగాల్లో చాలావరకు పనులు పూర్తి చేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసేలా.. 23 కి.మీల పొడవున 11,585 క్యూసెక్కులను తరలించేలా ఫీడర్ ఛానల్ పనులనూ చేయించారు. తీగలేరు కెనాల్, తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలి'కొండంత' చిత్తశుద్ధి..


పూర్తయిన వెలిగొండ రెండు సొరంగాలు

- ఇక వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. గత 56 నెలల పాలనలో దాదాపు రెండేళ్లు కరోనా మహమ్మారి ప్రభావంవల్ల పనులు చేయలేని పరిస్థితి. అయినాసరే.. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కి.మీల పనులను 2019, నవంబరులో ప్రారంభించి.. 2021, జనవరి 13 నాటికి పూర్తిచేయించారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులను కూడా అదే ఏడాది పూర్తిచేయించారు.
- రెండో సొరంగంలో టీబీఎంకు కాలం చెల్లడంతో.. రోజుకు ఒక మీటర్ పని జరగడం కూడా కష్టంగా మారింది. దాంతో.. 2022లో మనుషుల ద్వారా పనులు చేయించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి 17.8 కి.మీ, 16.555 కి.మీ, 14.5 కి.మీ, 13.5 కి.మీ, 12.5 కి.మీ వద్ద సొరంగాలను తవ్వి.. అక్కడ మనుషులతో సొరంగాన్ని తవ్వించేలా పనులు చేపట్టారు. మంగళవారం నాటికి 7.698 కి.మీల పొడవున రెండో సొరంగం తవ్వకం పనులు పూర్తయ్యాయి. హెడ్ రెగ్యులేటర్ పనులు సైతం పూర్తయ్యాయి. శ్రీశైలానికి వరద వచ్చేలోగా టీబీఎంను సొరంగం నుంచి బయటకు తీయనున్నారు.
- సీఎం రమేష్‌కు కట్టబెట్టిన రెండో సొరంగం మిగిలిన పనులను రద్దుచేసిన సీఎం జగన్.. వాటికి రివర్స్ టెండరింగ్ నిర్వహించి.. టీడీపీ సర్కార్ అప్పగించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువకు పూర్తిచేసేందుకు ముందుకొచ్చిన 'మేఘా' సంస్థకు 7.698 కి.మీల సొరంగం పనులను అప్పగించారు. తద్వారా చంద్రబాబు అక్రమాలను ప్రజల ముందు పెట్టారు.
- ఇక తీగలేరు హెడ్ రెగ్యులేటర్, తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తున్నారు. శ్రీశైలంలోకి కృష్ణా వరద జలాలు వచ్చిన వెంటనే.. సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించి.. ఆయకట్టుకు నీళ్లందించనున్నారు.
- ఇలా ప్రాజెక్టు పనులకు ఇప్పటివరకూ రూ.1,046.46 కోట్లను సీఎం జగన్ ఖర్చుచేశారు. ప్రతిపైసా సద్వినియోగమయ్యేలా జాగ్రత్తలు తీసుకుని.. శరవేగంగా పూర్తిచేయించారు.

బాబు దోపిడీ కొండంత..

1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకున్నాక.. 1996 లోక్‌సభ ఎన్నికల గండాన్ని గట్టెక్కేందుకు ఆ ఏడాది మార్చి 5న గొట్టిపడియ వద్ద నాటి సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 1995 నుంచి 2004 వరకూ ఈ ప్రాజెక్టు కోసం కేవలం రూ.పది లక్షలు మాత్రమే.. అదీ శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన సభ ఏర్పాట్లు, ఖర్చుల కోసం వ్యయంచేశారు. 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రజాధనాన్ని దోచుకోవడానికి వెలిగొండ ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకున్నారు. 2014 నుంచి 2019 వరకూ రూ.1,414.51 కోట్లు ఖర్చుచేసినా పనుల్లో ఏమాత్రం ప్రగతి కన్పించకపోవడం చంద్రబాబు దోపిడీకి నిదర్శనం. జీఓ–22 (ధరల సర్దుబాటు), జీఓ–63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.650 కోట్లకు పైగా దోచిపెట్టారు. అలాగే, 2017 నాటికే వెలిగొండను పూర్తిచేస్తామని ప్రకటించి.. టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్)ల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి, కమీషన్లు వసూలుచేసుకున్నారు. 2018, 2019 నాటికి పూర్తిచేస్తామంటూ ఎప్పటికప్పుడు హామీలిస్తూ వచ్చిన చంద్రబాబు.. రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి, మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచి.. వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి, కమీషన్లు వసూలు చేసుకుని ప్రాజెక్టు పనులను గాలికి వదిలేశారు.

వచ్చే సీజన్‌లో నీరు విడుదల


ప్రాజెక్టు పూర్తయిన 16 ఏళ్ల తర్వాత బయటకు కనిపిస్తున్న టీబీఎం హెడ్

ఇక ఈ ప్రాజెక్టు అంతా నీలం సంజీవరెడ్డి పులుల అభయారణ్యం పరిధిలో ఉండడంతో వన్య ప్రాణులకు సైతం ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామని నిర్మాణ సంస్థ మేనేజర్ పి.రాంబాబు తెలిపారు. అలాగే, కరోనా సమయంలో కూడా ప్రభుత్వ సహకారంతో పనులు చేపట్టామని ఆయన చెప్పారు. జలవనరుల శాఖ ఈఈ పురార్ధనరెడ్డి వెలిగొండ టన్నెల్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే సీజన్లో నీటిని ఈ సొరంగాల ద్వారా విడుదల చేస్తామని చెప్పారు.

మాది చెప్పింది చేసే ప్రభుత్వం



గత ప్రభుత్వాల మాదిరిగా **మోసపు** హామీలు చెప్పటం కాకుండా **ఇచ్చిన** మాట ప్రకారం పనులు **చేసే** ప్రభుత్వం మాది. మాటిస్తే మడ**మ** తిప్పని నైజం మా సీఎం జగనన్న**ది.** గతంలో సంక్రాంతి, దసరా, ఉ**గాదికి** పూర్తిచేస్తాం అని టీడీపీ ప్రభుత్వం **ప్రజలను** మోసగించింది. అలాకాకుండా.. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి నిధుల మంజూరుతో పాటు ఎప్పటికప్పుడు సమీక్షలతో ఈ ప్రాంత వాసుల కోసం పాటుపడి ఈరోజు ప్రాజెక్టు పూర్తి కావటానికి దోహదపడిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు. పశ్చిమ ప్రకాశం ప్రజలు ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటారు. త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభిస్తాం.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, మంత్రి

రికార్డు సమయంలో పూర్తి..

దుర్భిక్ష ప్రాంతాలను సుభిక్షం చేయడంలో సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి వెలిగొండ ప్రాజెక్టు నిదర్శనం. మొదటి సొరంగాన్ని 2021, జనవరి 13 నాటికి.. రెండో సొరంగాన్ని రికార్డు సమయంలో మంగళవారం నాటికి పూర్తిచేశాం. ఆసియా ఖండంలో అత్యంత పొడవైన నీటిపారుదల సొరంగాలను ఎలాంటి నష్టం వాటిల్లకుండా పూర్తిచేయడానికి సీఎం జగన్ దిశానిర్దేశం ఎంతో దోహదం చేసింది. శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణా వరద జలాలు చేరిన వెంటనే.. సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు తరలించి, ఆయకట్టుకు నీళ్లందిస్తాం. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన వెలిగొండను ఆయన తనయుడు పూర్తిచేసి, జాతికి అంకితం చేస్తుండటం నీటిపారుదలరంగ చరిత్రలో మహోజ్జ్వల ఘట్టంగా నిలిచిపోతుంది.

– మురళీనాథ్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్, వెలిగొండ ప్రాజెక్టు

ఉద్యాన శాస్త్రవేత్త ప్రణుతికి జాతీయ పురస్కారం

పూలశాస్త్ర పరిశోధనలో అత్యుత్తమ పరిశోధనాపత్రం


ప్రణుతిని అభినందిస్తున్న వీసీ డాక్టర్ తోలేటి జానకి రామ్, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు

సాక్షి, అమరావతి: పూలశాస్త్ర పరిశోధనలో అత్యుత్తమ పరిశోధనా పత్రం (థీసెస్) సమర్పించిన యువ శాస్త్రవేత్త, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పసుపులేటి ప్రణుతికి జాతీయ స్థాయి పురస్కారం లభించింది. గుజరాత్‌లోని నౌసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి హార్టికల్చర్ కాంక్లేవ్–2024లో ఇండియన్ సొసైటీ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌హెచ్‌ఆర్‌డీ)చే పూలశాస్త్రంలో పీహెచ్‌డీ చేసి, అత్యుత్తమ పరిశోధనా పత్రం సమర్పించిన యువ శాస్త్రవేత్తలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. బడ్డింగ్ సైంటిస్ట్ కేటగిరిలో 2021–22కిగాను ఈ వార్డును వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పసుపులేటి ప్రణుతికి ప్రదానం చేశారు. లిల్లీ మొక్కలోని మూడు భాగాల నుంచి టిష్యూ కల్చర్ విధానంలో అధిక సంఖ్యలో నాణ్యమైన అంటు మొక్కలు అభివృద్ధి చేసి ఉద్యాన రైతులకు అందించే వినూత్న విధానాన్ని అభివృద్ధి చేసిన డాక్టర్ ప్రణుతికి, ఆమెకు మార్గదర్శిగా వ్యవహరించిన కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఓ.రవీంద్ర కుమార్‌కు వర్సిటీ వీసీ డాక్టర్ తోలేటి జానకీరామ్, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ పద్మావతమ్మ తదితరులు అభినందనలు తెలిపారు. వినూత్న పరిశోధనలతో డాక్టర్ ప్రణుతి అందరికీ ఆదర్శంగా నిలిచారని జానకీరామ్ అన్నారు. పూలశాస్త్రంలో విశేష అనుభవం కలిగిన జానకీరామ్ ఇచ్చిన సూచనలు, సలహాలతోనే తనకు ఈ పురస్కారం లభించిందని ప్రణుతి పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నైట్ వాచ్‌మెన్లు

- 460 కాలేజీలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ
- నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లింపు

సాక్షి, అమరావతి: త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నైట్ వాచ్‌మెన్లు రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం రాష్ట్రంలోని 460 జూనియర్ కాలేజీల్లో ఈ నియామకాలు చేపట్టనున్నారు. నైట్ వాచ్‌మెన్‌లకు నెలకు రూ.6 వేల గౌరవ వేతనం చెల్లించాలని మంగళవారం ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకంలో ఇప్పటి వరకు 476 కళాశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది. మౌలిక సదుపాయాలను కల్పించి, ఐఎఫ్‌పీ స్క్రీన్లు, ఫర్నిచర్, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. వీటికి రక్షణగా ఉండేందుకు ప్రతి కళాశాలకు నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని పేరెంట్స్ కమిటీలు ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే 16 కళాశాలలకు నైట్ వాచ్‌మెన్లు ఉండగా, మిగిలిన 460 కళాశాలల్లో త్వరలో నియమించనున్నారు. అయితే, నైట్ వాచ్‌మేన్‌గా ఇప్పటికే అదే కాలేజీలో ఆయాగా పనిచేస్తున్న వారి భర్తను కానీ, ఆ గ్రామం లేదా వార్డులోని ఎక్స్ సర్వీస్‌మెన్‌కు గానీ అవకాశం ఇవ్వాలనీ, వీరిద్దరు లేని పక్షంలో కళాశాల అభివృద్ధి కమిటీ సరైన అభ్యర్థిని నియమించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే నైట్ వాచ్‌మెన్‌లను నియమించిన సంగతి తెలిసిందే.

ఆప్కోలో కొనుగోలుపై రాయితీల పొడిగింపు

చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్

సాక్షి, అమరావతి: ఆప్కో చేనేత వస్త్రశ్రేణిలో ఆధునిక వెరైటీలకు శ్రీకారం చుట్టే క్రమంలో ప్రత్యేక వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో ఎండీ ఎంఎం నాయక్ తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థల సౌజన్యంతో యువతను ఆకర్షించే విధంగా వీటికి రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా నారాయణపురం సొసైటీ నుంచి తయారు చేసిన బొబ్బిలి ప్రింటెడ్ కాటన్ చీరలు ఆప్కో షోరూంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తక్కువ బరువు, మెత్తదనంతో చేతి మగ్గంపై తయారైన ఈ చీరలు ఆధునికతకు ఆనవాలుగా ఉంటాయన్నారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని అందిస్తోన్న 30% రాయితీని గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో జనవరి నెలాఖరు వరకు పొడిగించామని, కొన్ని ప్రత్యేక వెరైటీలపై 50% రాయితీ కూడా అమలు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు.

నర్సింగ్ విద్యార్థులకు జపనీస్ భాషలో శిక్షణ

సాక్షి, అమరావతి: ఆరోగ్య సంరక్షణ రంగంలో నర్సులు, నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జపనీస్ భాషలో నర్సులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, అంతర్జాతీయ నియామకాలను సులభతరం చేయడానికి నవిస్ హ్యూమన్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పంద చేసుకుంది. ఈ ఇండో–జపాన్ ప్రోగ్రామ్‌ను హెల్త్‌కేర్ రంగంలో పైలట్ ప్రాజెక్ట్ కింద అమలు చేయనుంది. జపనీస్, జర్మన్ భాషల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు నర్సింగ్ అభ్యర్థుల డిజిటల్ హెల్త్ లిటరసీని పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. తాజాగా నవిస్ హ్యూమన్ రీసోర్సెస్ సంస్థ జపనీస్ భాషలో ఎన్1 నుంచి ఎన్5 స్థాయి వరకు శిక్షణ ఇవ్వనుంది. ఒప్పంద కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వినోద్ కుమార్, ఈడీ అనిల్ కుమార్, అసోసియేట్ మేనేజర్ చైతన్య, నవీస్ సీఈవో టకాకో ఓషిబుచి పాల్గొన్నారు.

బీసీ కమిషన్ సభ్యుడిగా మారేష్

మరో ఇద్దరు కూడా నియామకం



సాక్షి, అమరావతి/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): బీసీ ఉద్యమ నేత డాక్టర్ ఎస్.మారేశ్వర రావు (మారేష్) రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. బీసీల సమస్యలపై ఏళ్ల తరబడి ఉద్యమాలు చేస్తున్న మారేష్‌ను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ రాజ్యాంగ బద్ధమైన ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యులుగా మారేష్‌తోపాటు జె.శేషచలపతి, కుందుర్తి గురవాచారిలను కూడా నియమించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మూడేళ్లు పదవీలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



నేడు జాతీయ బాలిక దినోత్సవం

అమ్మాయి ఆరోగ్యానికి ఏడు పరీక్షలు

ఆడపిల్లలు ఆరోగ్యంగా పెరగాలి. అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి. వారికి వద్దు ఆటంకాలు. వారిపై వద్దు చిన్నచూపు. ఇదే 'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందేశం. అయితే యుక్త వయసుకు వచ్చిన బాలికలకు చాలామంది తల్లిదండ్రులు ఆరోగ్య పరీక్షలు చేయించరు. వైద్యనిపుణులు మాత్రం ఎదిగే వయసులోని ఆడపిల్లలకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలంటున్నారు. 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఇవ్వాల్సిన కానుక ఈ ఆరోగ్య పరీక్షలే.

ఆడుతూ పాడుతూ ఉన్నంత మాత్రాన మన ఇంటి ఆడపిల్లలకు శారీరకంగా ఏవో కొన్ని పోషక విలువల లోటుపాట్లు ఉండకపోవు. అయితే చాలామంది తల్లిదండ్రులు వాటిని నిర్ధారణ చేసుకోరు. నిజానికి బాలికలు అనేక శారీరక సవాళ్లను ఎదుర్కొంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత శారీరక మార్పులకు లోనవుతారు. పోషకాహార లోపంతో బాధపడే బాలికల్లో కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. అందుకే వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు, లోపాలను సరి చేసుకునేందుకు కొన్ని పరీక్షలు తరచూ చేయించాలంటున్నారు వైద్య నిపుణులు. బాలికల సమగ్ర వికాసాన్ని సందేశంగా ఇచ్చే 'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా తప్పక ఈ పరీక్షలను చేయించడమే ఆడపిల్లలకు ఇచ్చే అసలైన కానుక అవుతుంది.

కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ): బాలికల్లో రక్తహీనత సర్వసాధారణం. పూర్తి రక్త గణన (సీబీపీ) పరీక్ష చేయించడం వల్ల రక్తహీనత ఉందో లేదో తెలుస్తుంది. సీబీసీ పరీక్ష ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్ కౌంట్ గురించి చెబుతుంది. ఇన్ఫెక్షన్లు ఏమైనా ఉన్నా సీబీపీ పరీక్ష తెలియచేస్తుంది. బాలికల్లో అలసట, బరువు తగ్గడం, జ్వరం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తూ ఉంటే అసలు కారణం తెలియడానికి సీబీపీ చేయించడం మంచిది.

ఐరన్ ప్రొఫైల్: ఐరన్ లోపం వల్ల రక్తహీనత వంటి వ్యాధులు వస్తాయి. శరీరం తగినన్ని ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయనప్పుడు సాధారణంగా రక్తహీనత వస్తుంది. సరైన ఆహారం, ఐరన్ సప్లిమెంట్లు, ఐరన్ స్థాయులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ఈ పరిస్థితిని (ఐరన్ లోపాన్ని) సమర్థంగా అధిగమించవచ్చు.

విటమిన్ ప్రొఫైల్ టెస్ట్స్: ఉత్సాహకరమైన శారీరక ఆరోగ్యానికి విటమిన్లు చాలా అవసరం. విటమిన్ ప్రొఫైల్ టెస్ట్స్ వల్ల విటమిన్ల లోపం ఏదైనా ఉంటే తెలుస్తుంది. విటమిన్ బి12 జీవ క్రియలకు అత్యంత ముఖ్యమైనది. ఆ విటమిన్ లోపం ఉంటే వైద్యుని సలహాతో దానిని పూరించే సప్లిమెంట్స్ ఇప్పించాలి. విటమిన్ డి లోపంతో ఎముకలపై ప్రభావం పడుతుంది. శరీరంలో డి విటమిన్ తగ్గకుండా ఉదయపు ఎండ తగిలేలా చూడటం, వైద్యుల సూచనతో సప్లిమెంట్స్ తీసుకోవడం చేయాలి. ఆడపిల్లలు కండరాల బలహీనత, అలసట, ఎముకల్లో నొప్పిని ఎదుర్కొంటుంటే విటమిన్ల టెస్ట్ తప్పక చేయించాలి.

మూత్ర పరీక్ష: మైక్రోస్కోప్ ద్వారా చేసే మూత్రపరీక్ష ఏవైనా ఇన్ఫెక్షన్స్ ఉంటే తెలియచేస్తుంది. బాలికల్లో పొత్తి కడుపు నొప్పి, మూత్రవిసర్జనలో ఇబ్బందులు, మూత్రంలో రక్తం, మంట వంటి లక్షణాలు కనిపిస్తే మూత్ర పరీక్ష చేయించాలి. ఒక్కోసారి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ ఉన్నా సింప్టమ్స్ కనిపించక పోవచ్చు. అందువల్ల ఒకసారి ఈ పరీక్ష చేయించడం మంచిది.

మల పరీక్ష: ఎదిగే వయసు పిల్లలు మల విసర్జన రోజువారీ చేయకపోయినా, మల విసర్జనలో ఇబ్బంది పడుతున్నా, తరచూ విరేచనాలవుతున్నా లేదా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్నా అదేం పెద్ద విషయం కాదన్నట్టు నిర్లక్ష్యం చేయకూడదు. మల పరీక్ష చేయించాలి. దానివల్ల జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఏవైనా ఇన్ఫెక్షన్లు ఉంటే తెలుస్తుంది.

కంటి పరీక్ష: టీనేజ్ పిల్లలకు తప్పనిసరిగా చేయించాల్సిన పరీక్ష ఇది. ఈ వయసులో హ్రస్వదృష్టి వచ్చినా, దీర్ఘదృష్టి వచ్చినా పిల్లలు దానిని గుర్తించకనే కంటికి శ్రమ ఇచ్చి రోజువారి పనులను, చదువును కొనసాగిస్తారు. కాని కంటి పరీక్ష వల్లే దృష్టిలోపం తెలుస్తుంది. ఈ వయసులో గుర్తించకుండా దృష్టి లోపం కొనసాగితే తర్వాత కాలంలో కంటి నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయి. అందుకని కంటి పరీక్ష తప్పదు.

హార్మోనల్ వర్కప్ టెస్ట్: ఆడపిల్లల్లో ఈడేరడం ఆలస్యం అవుతుంటే ఈ టెస్ట్ చేయించడం తప్పనిసరి. దీనివల్ల పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్, థైరాయిడ్ పని తీరు, అడ్రినల్ గ్రంథి పనితీరు తదితరాలు తెలుస్తాయి. దీనివల్ల యుక్తవయసుకు జాప్యం ఎందుకో తెలుస్తుంది. సరి చేయ వీలవుతుంది.

కిచెన్ టిప్స్

- ఉల్లిపాయ తొక్కలను పారేయకుండా శుభ్రంగా కడిగి రెండు సార్లు కడగాలి. వీటిని ఎండలో ఆరబెట్టి పొడిచేయాలి. ఆరునెలలపాటు నిల్వ ఉండే ఈ పొడి మసాలాలో కలుపుకుని కూరల్లో వేసుకుంటే..కూర మంచి రుచిగా ఉంటుంది.



- బాగా జిడ్డుపట్టిన నూనె డబ్బాలను ముందుగా అన్నంతో రుద్దాలి. తరువాత ఉప్పు, డిష్ వాష్ లిక్విడ్‌తో రుద్ది కడిగితే జిడ్డు సులభంగా వదులుతుంది.
- టూత్ పేస్టుని కొద్దిగా బ్రష్ మీద వేసి పిల్లలు గీసిన పెన్సిల్, క్రెయాన్స్ గీతలపై రుద్దితే మరకలు ఇట్టే పోతాయి.
- డ్రైఫ్రూట్స్‌ను కట్ చేయాలంటే ముందుగా వాటిని ఒక గంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. అలాగే తరిగే చాకును వేడినీటిలో ముంచి తీయాలి. అప్పుడే సమంగా, నీట్‌గా ముక్కలు చేయడం సాధ్యమవుతుంది.
- ఉల్లిపాయలను తరిగేటప్పుడు కన్నీళ్లు రాకుండా ఉండాలంటే పొట్టు ఒలిచిన తర్వాత మధ్యలోకి కట్ చేసి నీటిలో వేసి పది నిమిషాల తర్వాత తరగాలి.
- బాదం పప్పును మరిగే నీటిలో పది నిమిషాల పాటు ఉంచి ఒలిస్తే పొట్టు సులభంగా వస్తుంది.
- మార్బుల్ రాతి మీద కూరగాయలను తరుగుతుంటే కత్తి పదును పోయి త్వరగా మొద్దుబారుతుంది. కాబట్టి చాపింగ్ బోర్డు వాడడం మంచిది. మార్కెట్‌లో ఎక్కువగా ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు అందుబాటులో ఉంటున్నాయి కాని ఉడెన్ చాపింగ్ బోర్డు వాడితే ఆరోగ్యానికి మంచిది.



ఈ ఏడాది నా బర్త్‌డే ఏ వారం వచ్చింది?
వచ్చే ఏడాది ఏ వారం వస్తోంది?
లీప్ ఇయర్ కావడంతో ఆ క్రమంలో ఓరోజు మిస్సవుతోందా!
కంప్యూటర్ క్యాలెండర్‌లో ఎన్ని సంవత్సరాలున్నాయి?
అంతకంటే ముందు సంవత్సరాలెందుకు లేవు?
ఆ తర్వాత సంవత్సరాలు ఎందుకు చూపించడం లేదు?
క్యాలెండర్‌లో పన్నెండు నెలలే ఎందుకున్నాయి?
అచ్చం ఇలాంటి క్యాలెండర్ మళ్లీ ఎన్నేళ్లకొస్తుంది?
ఆ చిన్న బుర్రలో అన్నీ ఇలాంటి ప్రశ్నలే...

కంప్యూటర్ బుర్ర

- ఏడేళ్ల జాషువా టాలెంట్



జాషువా

జాషువా గిడియోన్ వెలిచర్లతో మాట్లాడితే క్యాలెండర్‌లను నమిలి మింగేశాడా అని ఆశ్చర్యమేస్తుంది. ఒడిలో లాప్‌టాప్‌తో ఎప్పుడూ ఇంటర్నెట్‌లో ఏదో సెర్చ్ చేస్తూనే ఉంటాడు. సాధారణంగా ఏడేళ్ల పిల్లవాడు ఏం సెర్చ్ చేస్తుంటాడు... ఏ కామిక్స్ కోసమో అనుకుంటాం. అయితే జాషువా సెర్చింగ్‌లో క్యాలెండర్‌లు శతాబ్దాల వెనక్కి వెళ్తుంటాయి. అంతే వేగంగా వందల ఏళ్ల ముందుకూ వెళ్తుంటాయి. సంవత్సరం, నెల, తేదీ రాసి చూపిస్తే మన ప్రశ్న పూర్తయ్యే లోపు ఆ రోజున ఏ వారమో చెప్పేస్తాడు. ఆ బుర్రలో ఎంత ర్యామ్ ఉందో, ప్రాసెసర్ ఎంత వేగంగా ఉందో కానీ, ప్రశ్న అడిగిన నాలుగైదు సెకన్లలోనే సమాధానం వస్తోంది. 13 నిమిషాల 55 సెకన్ల సమయంలో 113 ప్రశ్నలకు సమాధానం చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు అవసరమైన పరీక్షలన్నీ పూర్తి చేశాడు. ఇప్పుడు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం వీడియోలు చేస్తున్నాడు. ఒక తేదీ చెప్పగానే అది ఏ వారమో చెప్పగలిగిన శిక్షణ ఇచ్చారా అంటే అదేమీ లేదన్నారు తల్లిదండ్రులు గిడియోన్, శాంతి. జాషువా బాలమేధావిగా మారడం వెనుక తమ కృషిని వాళ్లు సాక్షితో పంచుకున్నారు.

కరోనా బయటపెట్టింది!

"మేము బాబుని ప్రత్యేకంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం ఏదీ చేయలేదు. మేమిద్దరం సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్. బాబుని రెండవ ఏటనే ప్లే స్కూల్‌లో వేయాల్సి వచ్చింది. తను చిన్నప్పటి నుంచి చాలా యాక్టివ్, అలాగే కొన్నిసార్లు మొండిగా, పెంకిగా కూడా ఉండేవాడు. 'తనకు గమనింపు శక్తి చాలా ఎక్కువగా ఉంది, చక్కగా అర్థం చేసుకుంటాడు. కానీ మనం చేయమన్నప్పుడు చేయడు, తనకు చేయాలనిపిస్తేనే చేస్తాడు... తెలివితేటలు బాగున్నప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని స్కూల్ కరస్పాండెంట్ షాహీజాన్ మేడమ్ మాకు ధైర్యం చెప్పేవారు. అయితే కరోనా టైమ్ పూర్తిగా మార్చేస్తుందని, తనలోని మేధను వెలికి తీసి ప్రపంచానికి తెలియచేస్తుందని మేము ఊహించలేదు.



వర్క్ ఫ్రమ్ హోమ్

మేమిద్దరం వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉండడం, కంప్యూటర్‌తో పనిచేస్తూ ఉండడంతో తనకూ ల్యాప్‌టాప్ కావాలని అడిగాడు జాషువా. బర్త్‌డే గిఫ్ట్‌గా 2021లో ల్యాప్‌టాప్ తీసిచ్చాం. అప్పటి నుంచి బ్రౌజింగ్ అంతా తనకు మనసులో ఒక తేదీ అనుకోవడం ఆ వారం ఏదో సరి చూసుకోవడంతో మొదలుపెట్టాడు. అలా రకరకాల క్యాలెండర్‌లను తెలుసుకున్నాడు. సంవత్సరం, నెల, తేదీ చెప్తే అది ఏ వారమో చెప్పగలగడంలో తాను అనుసరిస్తున్న సమీకరణ ఏమిటనేది మాక్కూడా తెలియదు. చిన్న వయసు కావడంతో విశ్లేషించి చెప్పడం తనకూ చేతకావడం లేదు. కానీ ఏ తేదీ చెప్పినా కచ్చితంగా వారం ఏదో చెప్పేస్తాడు. ఇండియా బుక్ వాళ్లు ఇచ్చిన ఆప్షన్‌లలో రెండు వందల ఏళ్ల నిడివిని గడచిన వందేళ్లు, రాబోయే వందేళ్లు (1900- 2100) వరకు విభాగంలో వాళ్లు పెట్టిన పరీక్షలో నెగ్గి అవార్డు అందుకున్నాడు. రికార్డుకంటే ఇంకా వెనక్కి, ముందుకు కూడా చెప్పగలుగుతున్నాడు. ఒకవ్యక్తి వయసు చెప్తే ఏ సంవత్సరంలో పుట్టారో చెప్పేస్తాడు.

– శాంతి, గిడియోన్, జాషువా తల్లిదండ్రులు

విస్తృతమైన బంధుగణం

మాది బాపట్ల జిల్లా గణపవరం. కజిన్‌లు, సమీప బంధువులు అంతా కలిసి యాభై- అరవై మంది ఉన్నారు. వాళ్లందరి పుట్టిన రోజు, పెళ్లిరోజులను గుర్తు పెట్టుకుని, అవి ఏ వారం వస్తున్నాయో చెప్తుండేవాడు. నెల మొదట్లోనే ఆ నెలలో ఎవరెవరి పుట్టినరోజులున్నాయో గుర్తు చేసేవాడు. అలా ఖాళీ సమయమంతా తేదీలు, క్యాలెండర్‌తో గడపడం అలవాటైంది. అంతకంటే ముందు మరో విషయం చెప్పాలి... తనతో హోమ్ వర్క్ చేయించడం కష్టమయ్యేది. తనకు తాను నేర్చుకుంటాడు తప్ప, మనం చెప్పి నేర్పించాలంటే దృష్టి పెట్టడు. దాంతో బాబు నేర్చుకోవాల్సిన విషయాల చార్టులను ఇంట్లో గోడలనిండా తగిలించాం. బోర్డు కూడా పెట్టాం. తాను నేర్చుకుంటూ బోర్డు మీద రాసుకుంటూ, మమ్మల్ని కూర్చోపెట్టి పాఠాలు చెప్తూ ఉండేవాడు. లీప్ ఇయర్ ఎప్పుడు వస్తుంది, ఈ ఏడాది ఏ వారంతో మొదలైందో మళ్లీ ఇలాంటి క్యాలెండర్ ఎన్నేళ్లకు వస్తుంది... వంటి తన సందేహాలకు సమాధానం కోసం ల్యాప్‌టాప్‌లో సెర్చ్ చేస్తూ నేర్చుకున్నాడు. మేము చేసినదంతా తన టాలెంట్‌ను వీడియో తీసి, తన ప్రొఫైల్‌ను రికార్డుల నిర్వాహకులకు పంపించడం మాత్రమే.

చైల్డ్ సెలబ్రిటీ

జాషువా గురించి గత ఏడాది వరకు హైదరాబాద్‌లో తాను చదువుతున్న షైనింగ్ స్కూల్, మేము నివసించే మోతీనగర్ వరకే తెలుసు. ఏడాదిగా డిజిటల్, సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాడు. ఫేస్‌బుక్‌లో చాలామంది చూశారు. జాషువా వివరాలు గూగుల్‌లో లభిస్తున్నాయిప్పుడు. ట్రైన్‌లో ప్రయాణిస్తుంటే గుర్తు పట్టి మాట్లాడుతున్నారు. మా ఊరు గణపవరంలో అయితే 'జాషువా కారణంగా మన ఊరిపేరు పేపర్‌లో వచ్చిందని పెద్ద కార్యక్రమం పెట్టి సన్మానం చేశారు'' అని సంతోషాన్ని పంచుకున్నారు శాంతి, గిడియోన్. ఇక జాషువాను పెద్దయిన తర్వాత ఏం చేస్తావంటే ఐపీఎస్ అవుతానని, యూఎస్ వెళ్లి పెద్ద కోర్సులు చేస్తానని చెప్పాడు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

'పాస్ట్'కు పోదాం చలో చలో!



యూత్ పల్స్

పాత ఫ్యాషన్‌లు కొత్త ట్రెండ్ కావడం మనకు కొత్తకాదు. డిజిటల్ ఫొటోగ్రఫీ ఒక రేంజ్‌లో ఉన్న ఈకాలంలోనూ యువత కాలం వెనక్కి వెళ్లి పాత కెమెరాలను పలకరిస్తోంది. ఫిల్మ్ ఫొటోగ్రఫీపై మనసు పారేసుకుంటోంది. పాత కెమెరాలు కొత్తతరం చేతుల్లోకి వస్తున్నాయి. యూట్యూబ్‌లో అనలాగ్ ఫొటోగ్రఫీ ట్యుటోరియల్స్‌కు ఆదరణ పెరుగుతోంది. పాత ఇల్‌ఫర్డ్ బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్‌లు కొత్తగా దిగుమతి అవుతున్నాయి. ఈ రీసర్జెన్స్ ధోరణి గురించి....



అపురూప దె

హైయర్ రిజల్యూషన్స్, తక్కువ వెలుతురులో కూడా బెటర్ పర్‌ఫార్మెన్స్, స్మార్ట్ ఫోకసింగ్, షేక్ రిడక్షన్... లేటెస్ట్ డిజిటల్ కెమెరాల గురించి గొప్పగా చెప్పుకోవడానికి ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ యువతలోని ఫొటోగ్రఫీ ప్రేమికులు కొందరు కాలం వెనక్కి వెళుతున్నారు. తాము పుట్టని కాలంలో ఉపయోగించిన కెమెరాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

డిజిటల్ కెమెరా ఇండస్ట్రీ శిఖరస్థాయిలో ఉన్న ఈ కాలంలో పాత కెమెరాలకు ఆదరణ, అది కూడా యూత్ నుంచి అనేది ఆశ్చర్యకరమైన విషయమే.

ఢిల్లీలోని చాందిని చౌక్‌లో రెండు దశాబ్దాలుగా కెమెరాలను రిపేర్ చేస్తున్నాడు కపిల్ ఇంద్రజిత్ వోహ్రా. ఇతడి పేరు ఫిల్మ్-ఫొటోగ్రఫీ ప్రేమికులలో పాపులర్ అయింది. కొంతకాలం వరకు వయసు మళ్లిన వారే తమ దగ్గరకు పాత కెమెరాలను పట్టుకు వచ్చేవారు. ఇప్పుడు యూత్ ఎక్కువగా వస్తున్నారు. కెమెరాల గురించి తమ సందేహాలను అడుగుతుంటారు.

యూత్ పాత కెమెరాలను పట్టుకొని తన దగ్గరకు రావడం, వింటేజ్ కెమెరాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం వోహ్రాకు చెప్పలేనంత ఆనందం కలిగిస్తోంది.

'ఇదొక వేవ్' అంటాడు వోహ్రా.

కొన్ని రోజుల క్రితం ఒక వ్యక్తి పాత కెమెరా పట్టుకొని వోహ్రా దగ్గరికి వచ్చాడు. 22 వేలకు కెమెరాను అమ్మాలని చెప్పాడు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ మాట వింటే 'ఆశ-దోశ-అప్పడం వడ' అనే మాట కచ్చితంగా వచ్చి ఉండేది. అయితే ఇప్పుడు పాత కెమెరా కొనుగోలు విషయంలో డబ్బు గురించి చాలా మంది ఆలోచించడం లేదు.

మరోవైపు సోషల్ మీడియాలో కూడా అనలాగ్ ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలు హల్‌చల్ చేస్తున్నాయి. యూట్యూబ్‌లో అనలాగ్ ఫొటోగ్రఫీ ట్యుటోరియల్ చానల్స్‌కు ఆదరణ లభిస్తోంది. గత రెండు మూడేళ్లుగా దేశవ్యాప్తంగా ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీలు, వాట్సప్ గ్రూప్‌లలో పాత కెమెరాలకు సంబంధించిన విషయాలు, విశేషాలు, టిప్స్ అండ్ ట్రిక్స్‌ను షేర్ చేసుకుంటున్నారు. డిజిటల్ కెమెరాలో ఆటోమేటిక్ మోడ్‌లో యాంత్రికంగా షూట్ చేయడం చాలా సులభం. అయితే సృజనాత్మక ఫొటోగ్రఫీ లోతుపాతులు తెలుసుకోడానికి పాత కెమెరాలు ఉపయోగపడుతున్నాయి.

పాతతరం ఫొటోగ్రఫీపై యూఎస్, యూరప్‌లలో కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పడిన ఆసక్తి ఇప్పుడు ఇండియా వరకు వచ్చింది. 'ఆసియా-పసిఫిక్‌లలో ఫిల్మ్ ఫొటోగ్రఫీలో గణనీయమైన పెరుగుదల కనిపించింది' అంటున్నాడు కొడాక్ అలారిస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ క్లారా లో. వినియోగదారులలో 18-26 సంవత్సరాల వయసు మధ్య వారు కూడా ఉన్నారు.

'ఫిల్మ్ ఫొటోగ్రఫీపై ఆసక్తి, ఆదరణ భారీగా పెరిగాయి. అసలు సవాలు ఏమిటంటే ఫిల్మ్, కెమికల్స్ చాలామందికి అందుబాటులో లేవు. డిస్ట్రిబ్యూటర్లు లేరు' అంటున్నాడు చెన్నైకి చెందిన ఫొటోగ్రాఫర్ వరుణ్ గుప్తా. అయితే ఇప్పుడు పరిస్థితులలో మార్పు వస్తోంది. కోల్‌కతాకు చెందిన ఫొటోల్యాబ్ 'ఈస్టర్న్ ఫొటోగ్రాఫిక్స్' ఇల్‌ఫర్డ్ బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్ స్టాకును మన దేశానికి తీసుకురావడం మొదలుపెట్టింది. చెన్నైలోని 'సృష్టి డిజిటల్ లైఫ్' ఇండియాలో 'ఇల్‌ఫర్డ్' అధికారిక పంపిణీదారుగా మారింది. 'లాభాలను ఆశించి తీసుకున్న నిర్ణయం కాదు ఇది. భావోద్వేగాలతో కూడిన నిర్ణయం' అంటున్నాడు 'సృష్టి డిజిటల్ లైఫ్' డైరెక్టర్, సీయీవో ఆర్.విజయ్ కుమార్.

చివరాఖరికి చెప్పొచ్చేదేమింటంటే...

ఫోటో తీయడానికి ఇప్పటి డిజిటల్ కెమెరాలలోని మీట నొక్కితే సరిపోతుంది. మనం ఫొటోగ్రాఫర్ అయిపోయినట్లే. అయితే ఎనలాగ్ షూటింగ్‌కు ఏ మీట ఎక్కడ ఉందో మాత్రమే తెలిసుంటే చాలదు. గ్లామర్ తెలియాలి. గ్రామర్ తెలియాలి. అందుకు పాత కెమెరాలే కొత్త పాఠశాలలు.

బలమైన పునాది

ఫొటోగ్రఫీకి సంబంధించిన ప్రాథమిక శిక్షణ ఏ యూనివర్శిటీలోనూ తీసుకోలేదు. అయితే యూట్యూబ్ వీడియోల నుంచి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వరకు నేర్చుకునే అవకాశం ఎక్కడ ఉన్నా నేర్చుకున్నాను. ఫొటోగ్రఫీలోని అత్యాధునిక టెక్నాలజీ గురించి మాత్రమే కాదు గత కాలపు టెక్నాలజీ గురించి తెలుసుకున్నాను. గత కాలపు ఫొటోగ్రఫీ సాంకేతికత గురించి అవగాహన చేసుకోవడం అంటే బలమైన పునాది ఏర్పాటు చేసుకోవడం లాంటిది. ఫొటోగ్రఫీ అభిరుచి ఉన్న వారు చదువు, ఉద్యోగం వదులుకోకుండానే ఎంజాయ్ చేయవచ్చు. ప్యాషన్‌ను కెరీర్‌గా మలుచుకోవాలనుకుంటే మాత్రం రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలి.

– అపురూప దె, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

బ్యూటిప్స్

కురులకు కొబ్బరిపాలు

తలకు పెట్టుకోవడానికి సరిపడా కొబ్బరిపాలలో కొన్నిచుక్కల నిమ్మరసం కలపాలి. ఈ పాలను కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి గంట తరువాత మైల్డ్‌షాంపూతో తలస్నానం చేయాలి. వారానికి రెండు మూడుసార్లు కొబ్బరి పాలను



ఇలా తలకు పట్టిస్తూ ఉంటే కురులకు మంచి పోషణ అంది జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. జిడ్డుతత్వం గల కురులు ఉన్నవారికి ఈ కొబ్బరిపాలు మంచి ఫలితాన్ని ఇస్తాయి.

- ఎండబెట్టిన కమలాతొక్కలను దోరగా వేయించి మెత్తటి పొడిలా చేయాలి. దీనిలో టీస్పూను పసుపు, రెండు టీస్పూన్ల శనగపిండి, కొద్దిగా నీళ్లుపోసి కలపాలి. ఈ



మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసి ఆరనివ్వాలి. ఇరవై నిమిషాల తరువాత తడిచేతులతో రుద్ది కడిగేయాలి. మృతకణాలు, ట్యాన్ తొలగిపోయి ముఖం కాంతిమంతంగా మారుతుంది. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం మిలమిలలాడుతుంది.

- టేబుల్ స్పూను ఉసిరి నూనె లేదా బాదం నూనె తీసుకుని కొబ్బరి నూనెలో కలిపితే చలికాలంలో కొబ్బరినూనె గడ్డకట్టదు. ఉసిరి, బాదంలోని గుణాలు నూనెని గడ్డకట్టనివ్వవు. అందువల్ల వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ కొబ్బరి నూనె గట్టిగా కాదు.



- మాయిశ్చరైజర్ లేదా లోషన్‌లో రెండు చుక్కల గ్లిజరిన్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, చేతులకు రాసుకోవాలి. ఈ మిశ్రమం చర్మానికి తేమనందించి చర్మం పొడిబారకుండా చేస్తుంది.





ప్రతి మనిషీ తన ఆరోగ్యాన్ని లేదా వ్యాధినీ తనే రచించుకుంటాడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 24 జనవరి 2024

సత్తా పోతున్న సంజీవనులు!

ప్రాణాలు నిలపాల్సిన ఔషధం కాస్తా మనం చేస్తున్న తప్పుల వల్ల ఆ సామర్థ్యాన్ని కోల్పోతే? మానవాళికి అది మహా ప్రమాదమే. యాంటీ బయాటిక్స్ వినియోగంలో మనం తరచూ చేస్తున్న తప్పుల వల్ల ఆ పరిస్థితే దాపురిస్తోందని నిపుణులు మరోసారి హెచ్చరిస్తున్నారు. యాంటీ బయాటిక్స్ అతిగా వాడడం, లేదంటే నిర్ణీత మోతాదులో సరిగ్గా వాడకపోవడం వల్ల చివరకు ఆ ఔషధాలకు కొరుకుడుపడని ప్యాథోజెన్‌లు వృద్ధి చెందుతున్నాయి. ఆ నేపథ్యంలోనే అర్హత గల వైద్యులు రాసిచ్చిన మందుల చీటీ లేకుండా యాంటీ బయాటిక్స్‌ను విక్రయించవద్దంటూ కేంద్ర ఆరోగ్య శాఖ తాజాగా అభ్యర్థించింది. అలాగే, యాంటీ బయాటిక్స్ వాడాల్సిందిగా రాసినప్పుడు అందుకు కారణాల్ని సైతం పేర్కొనాల్సిందిగా వైద్యులకు పిలుపునిచ్చింది. యాంటీ బయాటిక్స్ వాడకంలో వివేకంతో వ్యవహరిస్తేనే, మందులకు లొంగని వ్యాధికారక జీవులను అరికట్టవచ్చని మరోసారి నొక్కిచెప్పింది. కొత్త యాంటీ బయాటిక్స్ పరిశోధన, అభివృద్ధి అనేది పరిమితంగానే ఉన్నందున ఔషధ వినియోగంపై తక్షణం అప్రమత్తం కావాలన్న సూచన అందరికీ ఓ మేలుకొలుపు.

బ్యాక్టీరియా నిర్మూలనకు ఉద్దేశించిన ఔషధాలపై సదరు సూక్ష్మజీవులే విజయం సాధించడం, వాడే మందుల వల్ల అవి చావకపోగా పెరగడమనేది ఇప్పుడు ప్రపంచాన్ని వేధిస్తున్న పెద్ద సమస్య. దీనికే వైద్యపరిభాషలో 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' (ఏఎంఆర్) అని పేరు. ఈ ఏఎంఆర్ వల్ల 2019లో ప్రపంచవ్యాప్తంగా 12.7 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఔషధాలకు నిరోధకత ఏర్పడ్డ ఇన్‌ఫెక్షన్లతో అదనంగా మరో 49.5 లక్షల మంది మరణించారని లెక్కలు చెబుతు న్నాయి. ఏఎంఆర్ వల్ల ఇన్‌ఫెక్షన్ల నివారణ, చికిత్స కుంటుబడడమే కాక, దీర్ఘకాలిక అనారోగ్యం పెరిగి, ప్రాణానికి ప్రమాదవుతుంది. బలం పెరిగిన ఈ ఇన్‌ఫెక్షన్లకు ముకుతాడు వేయాలంటే బాగా ఖరీదైన రెండో శ్రేణి ఔషధాలే దిక్కు. వాటి ఖరీదు ఎక్కువ గనక, సామాన్యులకు చివరకు చికిత్సే అందని దుఃస్థితి. పొంచివున్న ఈ ప్రమాదానికి ఇప్పుడు కేంద్ర స్థానం మన దేశమేనట! ఇదే పరిస్థితి కొన సాగితే, 2050 నాటికి ఒక్క భారత్‌లోనే 20 లక్షల మంది చనిపోతారని అంచనా. క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు కలిపి సంభవించే మరణాల కన్నా ఈ సంఖ్య ఎక్కువ. ఇది ఆందోళనకరమైన అంశం.

అరుదుగానే వాడాల్సిన వివిధ రకాల యాంటీ బయాటిక్స్‌ను పెద్ద మొత్తంలో మన దేశంలో యథేచ్ఛగా ఉపయోగిస్తున్నట్టు 2022 నాటి లాన్సెట్ అధ్యయనం తేల్చింది. వీటన్నిటి వల్లే, డాక్టర్ చీటీ లేకుండా యాంటీ బయాటిక్స్‌ను షాపుల్లో నేరుగా రోగులకు అమ్మవద్దని ఆరోగ్య శాఖ ఇప్పుడు నొక్కిచెప్పింది. ఏఎంఆర్ విజృంభించకుండా అడ్డుకొనేందుకు వీలుగా సరైన రీతిలో యాంటీ బయాటిక్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న ఈ ప్రయత్నం హర్షణీయం. యాంటీ బయాటిక్స్ 1945 నాటి 'ఔషధాలు, సౌందర్య పోషకాల నిబంధనల' ప్రకారం షెడ్యూల్ హెచ్ కిందకొస్తాయి. అంటే, రిజిస్టర్ చేసుకున్న మెడికల్ ప్రాక్టిషనర్ చీటీ రాస్తే తప్ప, వాటిని మందుల షాపుల్లో అడిగినవారం దరికీ ఇవ్వరాదు. శక్తిమంతమైన యాంటీ బయాటిక్స్‌నైతే 'షెడ్యూల్ హెచ్1'లో చేర్చారు. ఈ రెండు షెడ్యూల్స్‌లోని ఔషధాలను డాక్టర్ సిఫార్సుతోనే ఫార్మసీలలో విక్రయిస్తే పెద్ద చిక్కు తప్పుతుంది. ఈ నిబంధనల్ని కఠినంగా అమలు చేయాలన్నదే ఇప్పుడు ఆరోగ్యశాఖ ప్రయత్నం.

ఏఎంఆర్ వల్ల మామూలు మందులు బ్యాక్టీరియాపై పని చేసే సత్తాను కోల్పోతాయనీ, ఫలితంగా సాధారణ అనారోగ్యాలు సైతం చివరకు ప్రాణాంతకంగా పరిణమిస్తాయనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సైతం ఇప్పటికే హెచ్చరించింది. చాప కింద నీరులా నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న ఈ ఏఎంఆర్ మహమ్మారి నవజాత శిశువుల నుంచి వృద్ధుల దాకా ఏ వయసు వారికైనా, జీవితంలో ఏ దశలోనైనా ప్రాణాపాయమే. కాబట్టి, రోగికీ, వైద్యుడికీ మధ్య పరస్పర విశ్వాసం, సత్సంబంధాలు అవసరం. అప్పుడే ఔషధ వినియోగం సక్రమంగా జరుగుతుంది. నిజానికి, యాంటీ బయాటిక్స్ దుర్వినియోగమే కాక ఇతర కారణాలూ ఏఎంఆర్‌కు ఉన్నాయి. శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం, జనంలో చైతన్యం లేకపోవడమూ ఏఎంఆర్‌కు దోహదం చేస్తాయని నిపుణుల మాట. దీన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత.

మన దగ్గర వాడుతున్న యాంటీ బయాటిక్స్ 'నిర్ణీత మోతాదు కాంబినేషన్' (ఎఫ్‌డీసీ)లు చాలావాటికి అనుమతులు లేవు. కొన్నయితే నిషేధానికి గురైనవి. భారత్, ఖతార్, బ్రిటన్‌లలో అధ్యయనం జరిపిన పరిశోధకులు ఈ సంగతి తేల్చారు. ఇంకా చెప్పాలంటే, దేశవ్యాప్తంగా అమ్ముతున్న 58 శాతం యాంటీ బయాటిక్స్ ఎఫ్‌డీసీలు తమ లెక్కలో 'సిఫార్సు చేయరాదు' అనే జాబితాలో ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ కుండబద్దలు కొట్టింది. అలాగే, వైరల్ ఇన్ఫెక్షనా, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షనా అనేది నిర్ధారించకుండానే కొందరు వైద్యులు అతి జాగ్రత్తతో యాంటీ బయాటిక్స్ ఇస్తున్న కేసులూ లేకపోలేదు. మనం కళ్ళు తెరిచి, అవగాహనతో అడుగులు వేయాల్సిన సందర్భమిది.

అసలంటూ ఏఎంఆర్‌పై అవగాహన పెంచేందుకు ఆరోగ్య శాఖ 2016లోనే ప్రయత్నం చేయకపోలేదు. కొన్ని మందులపై నిలువునా 'ఎర్ర రంగు గీత' వేయించి, డాక్టర్ చీటీ లేకుండా అవి వాడవద్దని చెప్పింది. ఎనిమిదేళ్ళలో ఆ ప్రయత్నం ఏ మేర ఫలించిందో తేల్చి, లోటుపాట్లు సరిదిద్దాలి. భారతీయ వైద్య పరిశోధనా మండలి నెలకొల్పిన ఏఎంఆర్ నిఘా, పరిశోధక వ్యవస్థను పటిష్ఠం చేయాలి. అన్నిటి కన్నా ముందుగా ఔషధ దుర్వినియోగ నివారణకై డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఫార్మా కంపెనీలు, సామాన్య జనం, సర్కారు కలసికట్టుగా నిలవాలి. సంజీవనులైన ఔషధాలే సత్తా కోల్పోతున్నాయంటే, అది మన స్వయంకృతాపరాధమని గ్రహించి, ఇకనైనా మారాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.9.26 వరకు తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.6.48 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.7.30 నుండి 9.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.50 నుండి 12.38 వరకు, **అమృత ఘడియలు:** తె.5.34 నుండి 7.15 వరకు

సూర్యోదయం: 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

అరుదైన జన నాయకుడు

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

బిహార్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన (1970–71, 1977–79) కర్పూరీ ఠాకూర్ జీవితం సరళత, సామాజిక న్యాయం అనే జంట స్తంభాల చుట్టూ తిరిగింది. ఆయన సాధారణ జీవనశైలి, వినయపూర్వకమైన స్వభావం సామాన్య ప్రజలను లోతుగా ప్రభావితం చేశాయి. సామాజిక న్యాయం ఆయనకు అత్యంత ప్రియమైన అంశం. భారత సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించేందుకు పట్టుదలగా కృషి చేశారు. తన రాజకీయ ప్రయాణంలో వనరులు సక్రమంగా పంపిణీ అయ్యే సమాజాన్ని నిర్మించేందుకు పూనుకున్నారు. ఆయన నాయకత్వంలో, ఒకరి పుట్టుక ఒకరి విధిని నిర్ణయించని; సమగ్ర సమాజానికి పునాది వేసే విధానాల అమలు జరిగింది. దురదృష్ట వశాత్తూ 64 ఏళ్ల వయసులోనే అర్ధంతరంగా మరణించినా, కోట్లాది మంది హృదయాల్లో నిలిచారు... నేడు మన 'భారత రత్న'మై వెలిగారు.

సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి, కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు, 'జన్ నాయక్' కర్పూరీ ఠాకూర్ జీ శత జయంతి నేడు. కర్పూరీ జీని కలిసే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు కానీ, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన కైలాసపతి మిశ్రా గారి నుండి నేను ఆయన గురించి చాలా విన్నాను. ఆయన సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన నాయి(క్షురక) కులానికి చెందినవారు. అయినప్పటికీ ఎన్నో ఆటంకాలను అధిగమించి, అకుంఠిత దీక్షతో శ్రమించి, సమాజాభివృద్ధికి పాటుపడ్డారు.


కర్పూరీ ఠాకూర్‌జీ జీవితం సరళత, సామాజిక న్యాయం అనే జంట స్తంభాల చుట్టూ తిరిగింది. తన చివరి శ్వాస వరకు, ఆయన సాధారణ జీవనశైలి, వినయపూర్వకమైన స్వభావం సామాన్య ప్రజల హృదయాల్లో లోతుగా ప్రతిధ్వనించాయి. ఆయన సింప్లిసిటీని హైలైట్ చేసే అనేక వృత్తాంతాలు ఉన్నాయి. తన కూతురి పెళ్లితో సహా, ప్రతీ వ్యక్తిగత వ్యవహారానికి తన సొంత డబ్బును మాత్రమే ఎలా ఖర్చు పెట్టడానికి ఇష్టపడేవారో ఆయనతో పనిచేసిన వారు గుర్తు చేసుకుంటారు. బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, రాజకీయ నాయకుల కోసం ఒక కాలనీని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఆయన మాత్రం తనకోసం ఎటువంటి భూమి గానీ, డబ్బు గానీ తీసుకోలేదు. 1988లో ఆయన మరణించినప్పుడు పలువురు నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన ఇంటి పరిస్థితిని చూసి కన్నీళ్ల పర్యంతమయ్యారు– ఇంత మహోన్నతుని ఇల్లు ఇంత సాదాసీదాగా ఎలా ఉందా అని!

ఇలా కూడా ఉంటారా?

1977లో బిహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన సరళతకు సంబంధించిన మరో కథనం ఇది. అప్పుడు కేంద్రంలో, బిహార్‌లో జనతా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో, లోక్‌నాయక్ జేపీ(జయప్రకాశ్ నారాయణ్) పుట్టినరోజు సందర్భంగా జనతా నాయకులు పట్నాలో గుమిగూడారు. అప్పుడు ముఖ్యమంత్రి కర్పూరీ జీ కూడా వారితో ఉన్నారు. ఆయన చిరిగిన కుర్తాతో నడిచిరావడం వాళ్లు గమనించారు. చంద్రశేఖర్ జీ(మాజీ ప్రధాన మంత్రి; జనతా పార్టీ నేత) తనదైన శైలిలో, కర్పూరీజీ కొత్త కుర్తాను కొనుగోలు చేసేందుకు కొంత డబ్బును విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. అయితే, కర్పూరీ ఆ డబ్బును అంగీకరించారు కానీ దానిని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చేశారు. అదీ ఆయన గొప్పతనం! తనకు సాటి ఎవరూ లేరని ఆ ప్రవర్తనతో చాటి చెప్పారు.

కర్పూరీ ఠాకూర్ సామాజిక న్యాయం కోసం పరితపించారు. ఆయన రాజకీయ ప్రయాణంలో వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరూ వారి సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అవకాశాలను పొందాలని తపించారు. భారత సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి పట్టుదలతో కృషి చేశారు.

తన ఆదర్శాల పట్ల ఆయనకున్న నిబద్ధత ఎలాంటిదంటే, కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగా ఉన్న కాలంలో జీవించినప్పటికీ, కాంగ్రెస్ తన వ్యవస్థాపక సూత్రాల నుండి వైదొలిగిందని చాలా ముందుగానే నమ్మినందున, స్పష్టమైన కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.



బిహార్ మాజీ ముఖ్యమంత్రి 'జన నాయక్' కర్పూరీ ఠాకూర్ (1924-88) శతజయంతి నేడు: కేంద్ర ప్రభుత్వం నిన్న ఆయనకు మరణానంతరం 'భారతరత్న' ప్రకటించింది.

ఆయన ఎన్నికల జీవితం 1950ల మొదట్లో ప్రారంభమైంది. అప్పటి నుండి, శాసన సభలో గణనీయమైన శక్తిగా మారారు. కార్మికులు, సన్నకారు రైతులు, యువకుల కష్టాలకు శక్తిమంతమైన గొంతుకై, వారి పోరాటాలకు అండగా నిలిచారు. విద్యకు కూడా ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. తన రాజకీయ జీవితంలో పేదలకు విద్యా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఎంతగానో కృషి చేశారు. ఉన్నత స్థానాలకు ఎదగాలంటే చిన్న పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలకు స్థానిక భాషలలో విద్యా బోధన అందాలని సూచించారు. ముఖ్యమంత్రి హోదాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో చర్యలు చేపట్టారు.

కర్పూరీ వ్యక్తిత్వంలో ప్రజాస్వామ్యం, చర్చోపచర్చలు, సమావేశాలు అంతర్భాగంగా నిలిచాయి. యువకుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో మునిగితేలినప్పుడూ, మళ్లీ ఎమర్జెన్సీని కరాఖండీగా ఎదిరించి నిలిచినప్పుడూ ఈ స్ఫూర్తి కనిపిస్తుంది. ఆయనదైన ఈ ప్రత్యేక దృక్పథాన్ని జేపీ, డాక్టర్ లోహియా, చరణ్ సింగ్ వంటివారు గొప్పగా మెచ్చుకునేవారు.

బహుశా కర్పూరీ ఠాకూర్ భారతదేశానికి అందించిన అత్యంత ముఖ్యమైన సహకారాలలో ఒకటి... వెనుకబడిన తరగతుల వారికి తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు లభిస్తాయన్న ఆశతో వారి కోసం నిశ్చయాత్మక చర్యలను బలోపేతం చేయడం. ఆయన నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదు. ఆయన నాయకత్వంలో, ఒకరి పుట్టుక ఒకరి విధిని నిర్ణయించని, సమగ్ర సమాజానికి పునాది వేసే విధానాల అమలు జరిగింది. ఆయన సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందినవారు అయినప్పటికీ, ప్రజలందరి కోసం పనిచేశారు. సంకుచిత భావాలతో పని చేయలేదు. ఆయనలో లేశ మాత్రమైనా కాఠిన్యం ఉండకపోయేది, అదే ఆయన్ని నిజమైన గొప్పవాడిగా నిలబెట్టింది.

ఆయన బాటలో...

గత పదేళ్లుగా, మా ప్రభుత్వం కూడా జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది. కర్పూరీ వంటి కొద్దిమంది నాయకులను మినహాయిస్తే, సామాజిక న్యాయం కోసం ఇచ్చే పిలుపు కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే పరిమితం కావడం మన రాజకీయ వ్యవస్థ తాలూకు అతిపెద్ద విషాదాలలో ఒకటి. కర్పూరీ ఠాకూర్ విధానాల నుండి స్ఫూర్తి పొంది సమర్థవంతమైన పాలన విధానాన్ని మేము అమలు చేస్తున్నాం. గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం బారి నుంచి విముక్తి పొందారు. వీరంతా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వారు. వలస పాలన నుంచి విముక్తి పొంది దాదాపు 70 ఏళ్ల తర్వాత కూడా వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభించలేదు. సామాజిక న్యాయ సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. మా ప్రభుత్వం సాధించిన విజయాలను చూసి కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను.

నేడు ముద్ర రుణాల వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న తరుణంలో కర్పూరీ ఠాకూర్ కలలుగన్న ఆర్థిక స్వావలంబన కార్య రూపం దాలుస్తోంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను పొడిగించే అదృష్టం మా ప్రభుత్వానికే దక్కింది. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పని చేస్తున్న ఓబీసీ కమిషన్‌ను (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది) ఏర్పాటు చేసిన ఘనత కూడా మాకు దక్కింది. మా పీఎం–విశ్వకర్మ పథకం భారతదేశం అంతటా ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది మందికి కొత్త అవకాశాలను అందుబాటులోకి తెచ్చింది.

వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తిగా నేను కర్పూరీ ఠాకూర్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. దురదృష్టవశాత్తూ 64 ఏళ్ల వయసులోనే ఆయన మరణించారు. చాలా అవసరమైన సమయంలో మనకు దూరం అయ్యారు. అయినా ఆయన తన పని వల్ల కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నిజమైన ప్రజా నాయకుడు!

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అలా జరుగుతుందా?



'రాముడంటే నిప్పు కాదు, శక్తి. రాముడంటే వివాదం కాదు, పరిష్కారం. రాముడు కేవలం మావాడు కాదు, రాముడు అందరివాడు' అన్నారు మోదీ. రాజకీయాధికారానికీ, మత ఏకీకరణకూ ఆయుధంగా చేసుకోక... మంచికీ, సామరస్యానికీ ఆయన్ని వాడుకుంటేనే... రాముడికీ రాజ్యానికీ మధ్య వారధి నెలకొంటుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఘన నాగరికత



తమ దేవుళ్ల కోసం ఘనమైన ఆలయాలు నిర్మించింది కేవలం హిందువులే కాదు... గ్రీకులు, రోమన్లు, ఈజిప్షియన్లు, మాయన్లు, ఇన్‌కాలు, అజ్‌టెక్కులు, అందరూ చేశారు. కానీ ఇక్కడిలాగే అవన్నీ దురాక్రమణల్లో ధ్వంసం అయ్యాయి. తేడా అల్లా మనం ఇప్పటికీ ఆలయాలు నిర్మిస్తున్నాం. వారి నాగరికతలు కేవలం మ్యూజియంలో ప్రదర్శనలుగా మాత్రమే ఉన్నాయి.

– శేఫాలీ వైద్య, జర్నలిస్ట్

ఎక్కడుంటే ఏంటి?



నేను అక్కడ నివసించడం లేదు కాబట్టి, యెమెన్ గురించి మాట్లాడకూడదని హౌతీలు నాకు చెబుతున్నారు. అంటే, ఇప్పుడు నేను అక్కడికి వెళ్లాలి... విమర్శించినందుకు వాళ్లు నన్ను తేరగా చంపేయొచ్చు– యెమెనీ మానవ హక్కుల కార్యకర్త ఫాతెమా అల్‌– అర్‌వలీకి వచ్చే నెల వాళ్లు మరణశిక్ష అమలుచేస్తున్నట్టు!

– లుయీ అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

ఎందుకు జోక్యం?



నిన్న (జనవరి 22) అస్సాంలో జరిగినట్టుగా, కొన్ని ఆహారాల మీద ఉన్నట్టుండి రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా నిషేధం పెట్టగలవు అన్నదాని మీద ఎవరైనా సుప్రీంకోర్టుకు వెళ్లాలి. అసలు ఆహారం మీద ప్రభుత్వాల పెత్తనం ఏమిటి?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

కంగ్రాట్స్ ఇండియా!



మొట్టమొదటి సారి హాంకాంగ్ స్టాక్‌మార్కెట్‌ను ఇండియా అధిగమించింది. ఇండియాకు శుభాభినందనలు! (ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద స్టాక్ మార్కెట్‌గా ఇండియా అవతరించింది.)

– హసన్ సజ్వానీ
యూఏఈ పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

బొబ్బిలి విషాదం

18వ శతాబ్దికి చెందిన బొబ్బిలి సంస్థానాధీశులు రాజా గోపాలకృష్ణ రంగారావుకూ, విజయనగర సంస్థానాధీశులు పూసపాటి పెద విజయ రామరాజుకూ మధ్య శత్రుత్వం ఉండేది. ఫ్రెంచి కమాండర్ ఇన్ ఛీఫ్ మార్క్ డి బుస్సీ సహాయంతో బొబ్బిలిపై పగ సాధించాలని పెద విజయరామరాజు భావించారు. బొబ్బిలి సంస్థానాధీశులకు ఫ్రెంచి వారితో సత్సంబంధాలు లేకపోవడం కూడా బొబ్బిలి యుద్ధానికి ఒక కారణం. 1757లో బుస్సీ నిజాం సంస్థానం నుండి బయల్దేరి మచిలీపట్నం మీదుగా రాజమండ్రి చేరుకుని, కోటిపల్లి వద్ద మకాం ఉన్నాడు. పాలెగాళ్ళను, జమీందార్లను, సంస్థానాధీశులను వచ్చి తనను కలవమని కబురు పంపాడు. బొబ్బిలి పాలకుడు రంగారావు తప్ప, విజయరామరాజుతో సహా అందరూ వచ్చి కలిశారు. విజయరామరాజు దీన్ని అవకాశంగా తీసుకుని రంగారావుకు వ్యతిరేకంగా బుస్సీ వద్ద, అతడి దివాను హైదర్ జంగు వద్దా ఆరోపణలు చేశాడు. రంగారావును బొబ్బిలి నుండి వెళ్ళగొట్టి, తనకు స్వాధీనం చేస్తే, శిస్తు సక్రమంగా చెల్లిస్తానని బుస్సీకి చెప్పాడు. బొబ్బిలి వదలిపెట్టి పోవాలని రంగారావును బుస్సీ ఆదేశించాడు. రంగారావు దాన్ని అవమానంగా భావించాడు.

విజయరామరాజు తాను బుస్సీకి కట్టాల్సిన కప్పం పది లక్షలూ కట్టడంతో పాటూ మూడు లక్షల లంచం హైదర్ జంగుకు ఇచ్చి, బుస్సీకి బొబ్బిలిపై మనసు విరిచేందుకు సహకరించమని కోరాడు. కొంత కాలం తర్వాత బుస్సీ సైనికులు బొబ్బిలి మీదుగా వెళ్ళడానికి అనుమతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి వారితో జరిగిన పోరులో 30 మంది చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. దీనికి తోడు అనేక కుట్రల ఫలితంగా ఫ్రెంచ్, విజయరామరాజు– బొబ్బిలివారికీ యుద్ధం అనివార్యమయ్యింది. యుద్ధం చివర్లో ఓటమి తర్వాత స్త్రీలు, పిల్లలు శత్రువు చేతికి చిక్కి అవమానాల పాలు కాకూడదని రంగారావు కోట లోపల ఉన్న తమ నివాసాలకు నిప్పు పెట్టమన్నారు. మంటలకు తాళలేక బయటకు వచ్చే వారిని కత్తులతో పొడిచి చంపారు. బొబ్బిలి సైనికులందరూ నేలకొరిగాక ఫ్రెంచి సైన్యం కోటలోనికి ప్రవేశించింది. బతికి ఉన్న రంగారావు కుమారుణ్ణి బుస్సీ వద్దకు తీసుకువెళ్ళారు. బుస్సీ ఆ పిల్లవాడిని బొబ్బిలి వారసునిగా ప్రకటించాడు. రంగారావు తరఫున 'రాజాం' సంస్థానాధికారి తాండ్ర పాపారాయుడు విజయరామరాజుపై పగతీర్చుకుంటానని శపథం చేశాడు. యుద్ధం ముగిసిన మూడవ రోజు రాత్రి విజయరామరాజు శిబిరంలో ప్రవేశించి నిద్రిస్తున్న విజయరామరాజును బాకుతో పొడిచి చంపాడు. ఆ విధంగా బొబ్బిలి యుద్ధం అత్యంత విషాదాన్ని మిగిల్చింది.

– ర్యాలి ప్రసాద్, రచయిత ı 94945 53425
(నేటితో బొబ్బిలి యుద్ధానికి 266 ఏళ్లు)

రాజ్యాంగ విలువలకు తిలోదకాలేనా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

సుప్రసిద్ధ మహాకవి సి. నారాయణ రెడ్డి మూడు దశాబ్దాల నాడే కొందరు భావి పాలకులు దేశ రాజ్యాంగాన్ని పక్కకు తోసేసి, 'రాచరిక పాలన'ను అభిలషిస్తూ ప్రవర్తించే అవకాశాలు ఎలా ఉన్నాయో 'ప్రపంచ పదులు' కవిత ద్వారా పాఠకులకు అందించారు. 'నడమంత్రపు బుద్ధి దూకుడు' ఎలా ఉంటుందో ఆ కవితలో నిరూపించారు:

"గాలిలోన ఎగిరిపడే గడ్డిపరక ఊపిరెంత?
ఏటిలోన తుళ్లిపడే నీటి బుడగ ఉనికి ఎంత?
అబ్బో దశ పట్టిందని ఉబ్బిపోతె ఏం లాభం?
కడలిలోన మిడిసిపడే కప్పపిల్ల పొకుడెంత?
నడమంత్రపు సిరినేర్పిన దుడుకుబుద్ధి
దూకుడెంత?"


పాలకుల ఈ 'దుడుకు బుద్ధి' వల్ల దేశానికి రాబోతున్న అనర్థాల గురించి అడుగడుగునా నిశితమైన పరిశీలనలో ఉన్నారు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్. పదవిని అధిష్ఠించిన రోజు నుంచీ దేశ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.

బీజేపీ–ఆర్ఎస్ఎస్ పాలకులు ఎత్తుకున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' నినాదం దేశ ఫెడరల్ వ్యవస్థ స్వరూప, స్వభావాలకు విరుద్ధం. దేశంలో 'రాచరికం' ఉంది గాని 75 ఏళ్లలో దేశ ప్రజలు నిర్మించుకున్న సెక్యులర్ రాజ్యాంగ వ్యవస్థ లేదని వర్తమాన పరిస్థితులు చెబుతున్నాయి. కనుకనే కాలానికి లొంగిపోని కర్మయోగులు నేడు మేలుకోవలసి ఉంది. ఎందుకంటే:

"కలవరపడి వెనుతిరిగితే కాలం ఎగబడుతుంది
కదనుతొక్కితే కాలం భయపడుతుంది
కనురెప్పలు మూతపడితే కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితే కాలం జేకొడుతుంది!"

కాబట్టి ప్రతిపాదిత 'ఒక దేశం, ఒక ఎన్నిక' విధానాన్ని బుద్ధిజీవులు అందరూ వ్యతిరేకించాలి. పటిష్ఠమైన ప్రజాస్వామ్య పునాదులను గౌరవించాలనీ,

రెండో మాట



ప్రస్తుత పాలకుల కనుసన్నలలోనే ఎదిగిన మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన 'ప్రజాస్వామ్య రక్షణ' పేరిట మరో 'తైనాతీ' కమిటీ ఏర్పాటు తగదనీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. పాలకుల చేతిలో కోవింద్ కీలు బొమ్మగా వ్యవహరించరాదనీ ఆయన సలహా ఇచ్చారు. అసలు విచిత్రమేమంటే, కేంద్ర, రాష్ట్రాలకు కలిపి ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా దేశాని కయ్యే అపారమైన ఖర్చును ఆదా చేయవచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం సలహా ఇవ్వబోవడం! ఈ చర్య రాజ్యాంగాన్నీ, పార్లమెంటరీ వ్యవస్థనూ అవమానపరచడమే!

అంతేగాదు, మత విశ్వాసాలను కూడా రాజకీయ లబ్ధి కోసం బీజేపీ–ఆరెస్సెస్ పాలకులు వాడుకోవడం ఓటర్లను దగా చేయడమే! ఈ రాజకీయమే వేల ఏళ్ల నాటి బాబ్రీమసీదు కట్టడాన్ని బలవంతంగా కూల్చివేసి, దాని స్థానే రామమందిర నిర్మాణానికి కారణమయ్యింది.

నిజానికి సాధారణ ముస్లిం పౌరులు హిందువులకు ఎప్పుడూ వ్యతిరేకం కాదు. హిందువులు పవిత్రంగా భావించే రామాయణాన్ని స్థానిక 'అవధి' భాషలో రచించి ఖ్యాతి వహించిన తులసీదాస్‌ను హిందీలో రాయనందుకు శిక్షించడానికి ప్రయత్నం జరిగింది. ఆ సమయంలో ఆయననూ, ఆయన రామాయణాన్నీ ఓ స్థానిక ముస్లిం కాపాడాడు. ఈ వాస్తవాన్ని ఈ రోజుకీ గుర్తించ నిరాకరిస్తున్న ముఠా... మహాత్మాగాంధీ పేరిట కంటి తుడుపు ఉత్సవాలు చేస్తున్నారని గమనించాలి.

లాహోర్ కుట్ర కేసులో నిందితులుగా, ముద్దాయిలుగా ఉన్న భగత్‌సింగ్, సుఖదేవ్‌లు ఉరిశిక్షను ఎదుర్కొంటున్నప్పుడు భగత్‌సింగ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ ''తన కాలంలో మార్క్స్ కొత్త తరహాగా ఆలోచించబట్టే కాల చక్రాన్ని తన పద్ధతుల్లో త్వరిత గతిన ముందుకు నడిపించగలిగారు. అలాగే మన దేశంలో సామ్యవాద సిద్ధాంతాన్ని (సోషలిజం) నేను గాని, నువ్వు గాని (సుఖదేవ్‌తో సంభాషణ) ఆరంభించలేదు. నిజానికి కాలం, పరిస్థితులు కల్పించిన ప్రభావ ఫలితం అది. ఇంత కష్టమైన బాధ్యతను మనం చేపట్టినప్పుడు దాన్ని కొనసాగిస్తూ ముందుకు తీసుకుపోవాలే గాని కష్టాలు ఎదురయ్యాయని చెప్పి, ఆత్మహత్య చేసుకుంటే అది ప్రజలకు మార్గదర్శకం కాజాలదు.'' ఈ మాటలు భగత్‌సింగ్ ఏ సందర్భంలో అన్నాడు? ఉవ్వెత్తున ప్రజాందోళన వల్ల మన ఉరిశిక్షలు ఆగిపోయి, యావజ్జీవ కారాగార శిక్షగా మారిపోవచ్చు. కానీ, 14 ఏళ్లపాటు ద్వీపాంతరవాస శిక్ష అనుభవించాక మనం జీవచ్ఛవాలుగా మారిపోతాం. అలాంటప్పుడు బతకడం కన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలు కదా... ఇలా ఆలోచిస్తూ సుఖదేవ్ తన అభిప్రాయాల్ని భగత్‌సింగ్‌కు ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరానికి జవాబుగా భగత్‌సింగ్ రాసిన ఆశావహమైన లేఖే 'కాలం అవసరం నుంచి పుట్టుకొచ్చిన వాళ్ళం' అన్న ప్రత్యుత్తరం.

కాగా, నేటి తరం పాలకులకు రాజ్యాంగ విలువలూ తెలియవు. కనుకనే పాలనా వ్యవస్థల నుంచి, విద్యా వ్యవస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థల దాకా ఇష్టం వచ్చినట్లు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకే బహుశా, 'ఒడువని ముచ్చట' అనే కవితలో కందుకూరి అంజయ్య ఆవేదనను మనమూ పంచుకుందాం:

శంకరా!
ఇప్పుడు మనుషులను
కూడగట్టే మానిసి లేడు
మంచి చెడ్డలను విప్పిచెప్పే
సాత్వికుడూ లేడు
అంతా...
వద్లూ – పెరుగూ కలిసినట్టుంది
ఈనగాస్తే నక్కలపాలయింది
అంతా మొదటికొచ్చింది
ఒడువని ముచ్చటై కూసుంది!!

abkprasad2006@yahoo.co.in

సాక్షి బిజినెస్
బుధవారం
24-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,053	330
70,371	21,242

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,363	△ 2
డోజోన్స్	37,836	▽ 166
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,486	▽ 2
డాక్స్	16,627	▽ 56
షాంఘై	2,771	△ 15
నికాయ్	36,517	▽ 29

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,355
బంగారం (99.5 స్వచ్ఛత)	62,105
వెండి (కేజీ)	70,311

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసీఆర్	83.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎసీఆర్	104.63	107.21
€	యూరో	ఎసీఆర్	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఎసీఆర్	56.58	56.84
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎసీఆర్	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎసీఆర్	61.19	62.63
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.74	23.54
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.48	12.55

బంగారం, వెండి విడిభాగాలపై 5% సెస్

15 శాతానికి దిగుమతి సుంకం



న్యూఢిల్లీ: బంగారం, వెండి ఆభరణాల విడిభాగాలు, నాణేలపై 5 శాతం కేంద్రం వ్యవసాయ మౌలిక అభివృద్ధి సెస్‌ను (ఏఐడీసీ) విధించింది. దీనితో వీటికి సంబంధించి దిగుమతి సుంకం మొత్తంగా 15 శాతానికి పెరిగింది. హుక్, క్లాస్ప్, క్లాంప్, పిన్, క్యాచ్ లేదా స్క్రూ బ్యాక్ వంటి చిన్న భాగాలు తాజా సెస్ పరిధిలోకి వస్తాయి. ఆభరణాల భాగాలను కలపడానికి వీటిని వినియోగిస్తారు. తాజా సుంకం జనవరి 22 నుంచి అమల్లోకి వస్తుంది. కాగా, విలువైన లోహాలతో కూడిన మెత్తని రజనుపై కూడా ఏఐడీసీని 4.35 శాతం విధించినట్లు పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డ్ (సీబీఐసీ)నోటిఫికేషన్ తెలిపింది. విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని బులియన్‌తో సమానంగా తీసుకురావాలనే లక్ష్యంతో 10 శాతం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీకి అదనంగా ఏఐడీసీని విధించడం జరిగింది. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడానికి ప్రభుత్వం కొన్ని వస్తువులపై 2021-22 వార్షిక బడ్జెట్ ఏఐడీసీని ప్రవేశపెట్టింది.

8.50 లక్షల కోట్ల సంపద ఆవిరి



దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల వెల్లువ

- అధిక వెయిటేజీ షేర్ల పతన ప్రభావం
- సెన్సెక్స్ 1,053 పాయింట్లు క్రాష్
- నిఫ్టీ నష్టం 330 పాయింట్లు
- ఫార్మా షేర్లకు మాత్రమే లాభాలు

సెన్సెక్స్ ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్‌ఈలో రూ.8.50 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.365 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో మంగళవారం అమ్మకాల మోత మోగింది. అధిక వెయిటేజీ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(3%), రిలయన్స్ ఇండస్ట్రీస్(2%), ఎస్‌బీఐ(4%) షేర్లు పతనంతో పాటు పశ్చిమాసియాలోని యుద్ధ ఉద్రిక్తతలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. ఇటీవల విడుదలైన కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడమూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. గడిచిన 3 నెలల్లో భారీగా ర్యాలీ చేసిన చిన్న, మధ్య తరహా షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ 3శాతం చొప్పున నష్టపోయాయి.

పెరిగి పడిన మార్కెట్...

మూడు రోజుల వరుస సెలవుల తర్వాత తెరుచుకున్న మార్కెట్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ 444 పాయింట్లు పెరిగి 71,868 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు బలపడి 21,717 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. కానీ, కాసేపటికే అమ్మకాల ఒత్తిడి మొదలైంది. ఒక దశలో సెన్సెక్స్ 1,189 పాయింట్లు క్షీణించి 70,235 వద్ద, నిఫ్టీ 397 పాయింట్లు దిగివచ్చి 21,193 వద్ద ఇంట్రాడే కనిష్టాలను దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 1,053 పాయింట్లు నష్టపోయి 70,371 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 330 పతనమై 21,242 వద్ద స్థిరపడ్డాయి. జనవరి 17 తర్వాత సూచీలకు ఇది భారీ పతనం.

ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ డీలా...!

అమ్మకాల సునామీతో ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు ఎరుపెక్కాయి. రంగాల వారీగా ఎన్‌ఎస్‌ఈలో మీడియా 13%, రియల్టీ 5%, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు 4%, మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3%, బ్యాంక్ నిఫ్టీ 2%, ప్రైవేట్ రంగ బ్యాంక్ 2%, ఎఫ్‌ఎంసీజీ, ఆటో ఇండెక్సులు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. ఫార్మా సూచీ మాత్రమే 1.5% రాణించింది.



- నష్టాల ట్రేడింగ్‌లోనూ మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. ఇష్యూ ధర(రూ.418)తో పోలిస్తే బీఎస్‌ఈలో 11.24% ప్రీమియంతో రూ.465 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో 22% ఎగసి రూ.510 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 11% లాభపడి దాదాపు లిస్టింగ్ ధర రూ.464 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.3,197 కోట్లుగా నమోదైంది.



- ఆర్థిక ఫలితాల ప్రకటన తర్వాత సిప్లా షేరు రాణించింది. డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 32% వృద్ధి చెందినట్లు వెల్లడించడం కలసివచ్చింది. బీఎస్‌ఈలో ఈ షేరు 7% పెరిగి రూ.1,409 వద్ద ముగిసింది.



- సోనీ గ్రూప్ 10 బిలియన్ డాలర్ల విలీన ఒప్పందం రద్దుతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ షేరు కుప్పకూలింది. బీఎస్‌ఈలో 10% నష్టంతో రూ.209 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో ఏకంగా 34% పతనమై రూ.152 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. చివరికి 33% నష్టంతో రూ.156 వద్ద స్థిరపడింది. ఒక దశలో షేరు ఇరు ఎక్స్ఛేంజీలో లోయర్ సర్క్యూట్‌ను తాకింది. షేరు భారీ క్షీణతతో కంపెనీకి రూ.7,300 కోట్ల నష్టం వాటిల్లింది.



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు పతనం ఆగడం లేదు. బీఎస్‌ఈలో 3.50% నష్టపోయి రూ.1428 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.65% పతనమై రూ.1,425 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10.83 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు వరుస అయిదు రోజుల్లో 13% క్షీణించింది.

రెనో డస్టర్ మళ్లీ వస్తోంది

రెనో ఇండియా సీఈవో వెంకట్రామ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న ఫ్రెంచ్ సంస్థ రెనో.. భారత మార్కెట్లో కాంపాక్ట్ ఎస్‌యూవీ డస్టర్‌ను తిరిగి ప్రవేశపెడుతోంది. వచ్చే ఏడాదికల్లా ఇక్కడి రోడ్లపై పరుగుతీసే అవకాశం ఉంది. 2012లో భారత్‌లో డస్టర్ అడుగుపెట్టింది. రెనో ఇండియా ఈ మోడల్ తయారీని 2022లో నిలిపివేసింది. డస్టర్ పేరుతోనే రీఎంట్రీ ఇస్తుందని రెనో ఇండియా సీఈవో, ఎండీ వెంకట్రామ్ మామిల్లపల్లె వెల్లడించారు. కైగర్, ట్రైబర్, క్విడ్ ఫేస్ లిఫ్ట్ మోడళ్లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో 20 శాతం వృద్ధిని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఎప్పటికప్పుడు భద్రతా ఫీచర్లను జోడిస్తూ ఏ, ఏ ప్లస్ ప్యాసింజర్ కార్ల విభాగంలో పోటీపడతామని అన్నారు. కార్ల ధరలను పెంచలేదని, 2024 కోసం కొత్త శ్రేణిని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు.

మూడేళ్లలో అయిదు కొత్త మోడళ్లు..

వచ్చే మూడేళ్లలో భారత విపణిలో రెనో అయిదు కొత్త మోడళ్లను ప్రవేశపెట్టనుంది. వీటిలో రెండు బ్రాండ్ న్యూ ఎస్‌యూవీలు, ఒకటి ఎలక్ట్రిక్ వెహికిల్ ఉండనుంది. రెండు బ్యాటరీ ప్యాక్‌లలో ఎలక్ట్రిక్ కారును తీసుకొస్తామని వెంట్రామ్ వెల్లడించారు. 'ఒకసారి చార్జింగ్‌తో గరిష్టంగా 320 కిలోమీటర్ల వరకు ఇది ప్రయాణిస్తుంది. భారత్ కోసం ఈవీని రూపొందిస్తున్నాం. రానున్న రోజుల్లో ఇతర మార్కెట్లకు ఈవీలను ఎగుమతి చేస్తాం. లిథియం నిల్వలు భారత్ చేతుల్లో ఉంటే బ్యాటరీల ధరలను నియంత్రించే ఆస్కారం ఉంటుంది. భవిష్యత్తులో మార్కెట్లో అన్ని ధరల శ్రేణిలో ఎలక్ట్రిక్ కార్లు లభిస్తాయి' అని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-1-2024	
విశాఖ	565-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	558-00
విజయవాడ	558-00
రిటైల్ ధర (డజను)	72.00
23-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

'నవరత్న' ఆర్‌ఈసీ లాభం అప్

క్యూ3లో రూ. 3,308 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం నవరత్న ఆర్‌ఈసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతంపైగా బలపడి రూ. 3,308 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,915 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,795 కోట్ల నుంచి రూ. 12,071 కోట్లకు ఎగసింది. ప్రాజెక్టుకు ప్రత్యేకించిన ప్రత్యేక సంస్థ(ఎస్‌పీవీ) ఏర్పాటుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ పేర్కొంది. సొంత అనుబంధ సంస్థ ఆర్‌ఈసీ పవర్ డెవలప్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్‌కు పూర్తి అనుబంధంగా ఇది ఏర్పాటుకానున్నట్లు ఆర్‌ఈసీ వెల్లడించింది. దేశీయంగా విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్‌ను చేపట్టే నోడల్ ఏజెన్సీగా ఆర్‌ఈసీ పవర్ డెవలప్‌మెంట్ వ్యవహరిస్తోంది. ఈ ఆరు విద్యుత్ ప్రసార ప్రాజెక్టులలో ధూలే, బిదార్, శికర్ ఖేత్రి, పచోరా, కరేరా, ఇషానగర్ ఉన్నాయి.

మార్కెట్ల పతనం నేపథ్యంలో ఆర్‌ఈసీ షేరు బీఎస్‌ఈలో 5.6% పతనమై రూ. 434 వద్ద ముగిసింది.

యాక్సిస్ లాభం జూమ్

క్యూ3లో రూ. 6,492 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 6,492 కోట్లకు చేరింది. స్టాండెలోన్ లాభం సైతం 4 శాతం వృద్ధితో రూ. 6,071 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో కేవలం రూ. 5,853 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం వృద్ధితో రూ. 18,087 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 22 శాతం జంప్‌చేసి రూ. 5,555 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 4.26 శాతం నుంచి 4.01 శాతానికి స్వల్పంగా తగ్గాయి. వెరసి మొత్తం ప్రొవిజన్లు రూ. 1,438 కోట్ల నుంచి తగ్గి రూ. 1,028 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.73% నుంచి 1.58 శాతానికి మెరుగుపడ్డాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.6 % నుంచి 14.88 శాతానికి తగ్గింది.

మార్కెట్ల పతనం నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం క్షీణించి రూ. 1,089 వద్ద ముగిసింది.

భవిత

జాబ్ పాయింట్

డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీలో 20 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.25,220 నుంచి రూ.80,910
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 31.01.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.02.2024
» **వెబ్‌సైట్:** drysruhs.edu.in

సీఆర్‌పీఎఫ్‌లో 169 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. స్పోర్ట్స్ కోటా కింద గ్రూప్ సి విభాగంలో కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) నాన్-గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ ఖాళీల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు భారతదేశం, విదేశాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 169
» **క్రీడలు:** జిమ్నాస్టిక్, జూడో, వుషు, షూటింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్, ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, తైక్వాండో, వాటర్ స్పోర్ట్స్ కయాక్, కానో, రోయింగ్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, ట్రయథ్లాన్, డైవింగ్, డైవింగ్ ఈక్వెస్ట్రియన్, యాచింగ్, ఐస్ హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కైయింగ్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్యంతో పాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 15.02.2024 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024
» **వెబ్‌సైట్:** https://recruitment.crpf.gov.in

వీసా నిబంధనలు కఠినం

నేడు మన దేశ విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం.. స్టడీ అబ్రాడ్! గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటూనే.. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉన్నత విద్య కోర్సుల్లో చేరాలని చాలా మంది కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్నికల్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు.. విదేశాల్లో ఎంఎస్ చేస్తే కెరీర్‌కు ఢోకా ఉండదని భావిస్తున్నారు. కాని కోవిడ్ అనంతరం కాలంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిందని భావిస్తున్న పలు దేశాలు.. స్టూడెంట్ వీసా నిబంధనలను కఠినతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. టాప్ డెస్టినేషన్స్‌గా నిలుస్తున్న పలు దేశాల్లో తాజా వీసా నిబంధనలపై ప్రత్యేక కథనం..

» స్టూడెంట్ వీసాలపై పలు దేశాల ఆంక్షలు
» కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లో కొత్త నిబంధనలు
» అన్ని రకాల జాగ్రత్తలతోనే ప్రవేశం!

కెనడా.. చదువు భారమే!

- వీసా నిబంధనలు కఠినం చేసిన దేశాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది కెనడా. తాజా నిబంధనల ప్రకారం-కెనడాలో స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ ఆర్థిక స్తోమతకు, సంసిద్ధతకు సంబంధించి చూపాల్సిన డిపాజిట్ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ప్రస్తుతం పది వేల కెనడా డాలర్లుగా ఉన్న డిపాజిట్ మొత్తాన్ని 20,635 డాలర్లకు పెంచింది. దీంతో దరఖాస్తు దశలోనే విద్యార్థులపై ఆర్థికంగా రెట్టింపు భారం పడుతోంది. ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులకు ఇది అదనం. దీంతో కెనడా చదువు ఆర్థికంగా పెను భారం అనేది స్పష్టమవుతోంది. దీంతోపాటు విదేశీ విద్యార్థులకు కొత్తగా ఇవ్వబోయే స్టడీ పర్మిట్లపై రెండేళ్ల పాటు పరిమితి విధించనున్నట్లు ఆ దేశ ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించింది.
- వెరిఫికేషన్ ప్రక్రియను కూడా 2023, డిసెంబర్ 1 నుంచి కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. పోస్ట్ సెకండరీ ఎడ్యుకేషన్ స్థాయిలో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్ (డిజిగ్నేటెడ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్స్) ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి సంబంధించి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్‌ను ఐఆర్‌సీసీకి చూపి ఆమోదం పొందాలనే నిబంధన తెచ్చారు.
- అంతేకాకుండా త్వరలోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ ప్రోగ్రామ్ విధానంలోనూ మార్పులు తెచ్చే దిశగా కెనడా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో.. పోస్ట్ స్టడీ వర్క్ విషయంలోనూ మన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే ఆస్కారముంది. ప్రస్తుత విధానంలో పీజీ పూర్తి చేసుకున్న తర్వాత ఆరు నెలల పాటు కెనడాలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఈ సమయంలో ఏదైనా ఉద్యోగం లభిస్తే పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. కనిష్టంగా ఎనిమిది నెలలు, గరిష్టంగా మూడేళ్ల వ్యవధికి తొలుత పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌ను జారీ చేస్తారు. ఆ తర్వాత దాన్ని పొడిగించుకునే అవకాశం ఉంటుంది.
- స్టూడెంట్స్ సేవింగ్స్ డిపాజిట్ మొత్తాన్ని పెంచడం.. దాన్ని వెంటనే అమల్లోకి తేవడం; అదే విధంగా.. ప్రస్తుతం రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల ప్రభావం ఇప్పటికే మన విద్యార్థులపై కనిపిస్తోంది. 2022 డిసెంబర్‌తో పోల్చితే.. 2023 డిసెంబర్‌లో- మన దేశ విద్యార్థుల సంఖ్యలో 86 శాతం మేర తగ్గుదల నమోదవడమే ఇందుకు నిదర్శనం.
- కెనడాలోని యూనివర్సిటీల్లో చేరేందుకు విద్యార్థులు ముందుగా స్టూడెంట్ వీసాకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగానూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోదల్చిన విద్యార్థులు **www.cic.gc.ca** ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రవేశం ఖరారు చేసుకున్నట్లు రుజువు చేసే అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా.. స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో నిర్దేశిత డాక్యుమెంట్లను అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత.. విద్యార్థులకు కెనడా కాన్సులేట్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించి.. ఈ పర్మిట్‌ను మంజూరు చేస్తారు. వీరికి ముందుగా టెంపరరీ రెసిడెంట్ వీసా ఇస్తారు.

ఆస్ట్రేలియా.. ఇంగ్లిష్‌పై పట్టుంటేనే

- మన దేశ విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే దేశాల్లో ఆస్ట్రేలియా ఒకటి. 2022 గణాంకాల ప్రకారం-ఈ దేశంలో లక్ష మందికిపైగా భారతీయ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆస్ట్రేలియా సైతం అంతర్జాతీయ విద్యార్థులకు కఠిన నిబంధనల అమలు దిశగా అడుగులు వేస్తోంది. సబ్ క్లాస్ 500 కింద స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇకపై ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యానికి సంబంధించి మరింత ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఎందుకంటే.. ఆస్ట్రేలియా ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం- టెంపరరీ గ్రాడ్యుయేట్ వీసా పొందాలనుకుంటే.. ఐఈఎల్‌టీఎస్ 6.5 బాండ్స్ ఉండాల్సిందే. ప్రస్తుతం ఇది 6గానే ఉంది. ఇక స్టూడెంట్ వీసా దరఖాస్తుకు అవసరమైన ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌ను 5.5 బ్యాండ్స్ నుంచి 6 బ్యాండ్స్‌కు పెంచింది.
- అంతేకాకుండా 'న్యూ జెన్యూన్ టెస్ట్' అనే కొత్త విధానాన్ని తీసుకురానుంది. ప్రస్తుతం ఉన్న 'జెన్యూన్ టెంపరరీ ఎంట్రెంట్'కు బదులు దీన్ని తీసుకురానుంది. నూతన విధానం ప్రకారం-ఆస్ట్రేలియాలో అడుగుపెట్టే విద్యార్థుల అసలు ఉద్దేశాన్ని, వారు చేరాలనుకుంటున్న కోర్సు ద్వారా వారి ఆశిస్తున్న లక్ష్యాలను పరిశీలించనున్నారు.
- అదే విధంగా విద్యార్థులు దరఖాస్తు సమయంలో చూపాల్సిన సేవింగ్స్ మొత్తాన్ని కూడా పెంచింది. మొత్తం 24,505 డాలర్లు తమ వద్ద ఉన్నట్లు చూపాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఈ మొత్తం ఏడాదికి 20, 290 డాలర్లుగానే ఉంది.
- ఆస్ట్రేలియాలో యూజీ, పీజీ, మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు సబ్ క్లాస్ 500 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వీరి అడ్మిషన్ దరఖాస్తు, ఫైనాన్షియల్ ఎవిడెన్స్, ట్యూషన్ ఫీజు, యూనివర్సిటీలో ఎన్‌రోల్‌మెంట్, మెడికల్ ఎగ్జామినేషన్, వీసా లాడ్జ్‌మెంట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా మంజూరు చేస్తారు.

యూకే..డిపెండెంట్ వీసాలకు నో ఛాన్స్

- అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశం, వీసా మంజూరుపై ఆంక్షలు విధిస్తున్న దేశాల జాబితాలో యూకే ముందు వరుసలో నిలుస్తోంది. తాజా నిబంధనల ప్రకారం -స్టూడెంట్ వీసాతో వచ్చే విద్యార్థులు తమ కుటుంబాలను వెంట తెచ్చుకోకుండా బ్రిటన్ నిషేధం విధించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ చేస్తున్న విద్యార్థులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.
- అదేవిధంగా విద్యార్థులు తమ చదువు పూర్తయ్యేవరకు వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా నిబంధనలు రూపొందించారు. దీంతోపాటు పోస్ట్ స్టడీ వర్క్ విషయంలోనూ సంస్కరణలు తెచ్చేలా యూకే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత విధానంలో చదువు పూర్తయ్యాక రెండేళ్ల వ్యవధికి పోస్ట్ స్టడీ వర్క్ వీసా మంజూరు చేస్తున్నారు.
- ముఖ్యంగా గ్రాడ్యుయేట్ రూట్ వీసా విధానంలో మార్పుల దిశగా యూకే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ రూట్ వీసా విధానం ప్రకారం-బ్యాచిలర్ డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థులు రెండేళ్లు, పీహెచ్‌డీ విద్యార్థులు మూడేళ్లపాటు పోస్ట్ స్టడీ వర్క్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుకు ఆమోదం లభించి గ్రాడ్యుయేట్ వీసా మంజూరైతే.. చేతిలో ఆఫర్ లెటర్ లేకపోయినా.. అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. ఉద్యోగం లభిస్తే గ్రాడ్యుయేట్ వీసా కాలపరిమితి ముగిశాక.. ఇతర వర్క్ వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉదాహరణకు గ్రాడ్యుయేట్ వీసాతో ఉద్యోగం పొంది.. రెండేళ్లు, లేదా మూడేళ్ల వ్యవధి పూర్తయ్యాక.. స్కిల్డ్ వర్కర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా స్కిల్డ్ వర్కర్ వీసా మంజూరైతే.. సదరు అభ్యర్థులు యూకేలోనే మరింత కాలం ఉద్యోగం చేసే అవకాశం లభిస్తుంది. ఈ విధానాన్ని సమీక్షించి మార్పులు తెచ్చే అవకాశముందని యూకే అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.
- యూకేలో పీజీ స్థాయి కోర్సులు, గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు టైర్-4 జనరల్ కేటగిరీ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా సదరు ఇన్‌స్టిట్యూట్ అందించే కన్ఫర్మేషన్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఫర్ స్టడీస్(సీఏఎస్) ఫామ్ ఆధారంగానే చేయాల్సి ఉంటుంది.



అమెరికా.. పాస్‌పోర్ట్ ఆధారంగా వీసా

- మన విద్యార్థులకు తొలి గమ్యంగా నిలిచే అమెరికా కూడా వీసా మంజూరులో కొత్త నిబంధనలు తెచ్చింది. తాజా నిబంధనల ప్రకారం-పాస్‌పోర్ట్‌లో ఉన్న సమాచారాన్ని వీసా మంజూరుకు పరిగణనలోకి తీసుకోనుంది. ఇతర ఏ సమాచారాన్ని వీసా మంజూరుకు అంగీకరించరు. ఈ విధానాన్ని ఎఫ్-1, ఎం, జె స్టూడెంట్ వీసాలు పొందాలనుకునే వారికి అమలు చేయనున్నారు.
- అమెరికాలో ఉన్నత విద్య, వీసా కోరుకునేవారు యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ ఇచ్చే ఐ-20 ఫామ్ (అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్) ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత దశలో ఆన్‌లైన్ విధానంలో యూఎస్ ఇమిగ్రేషన్ వెబ్‌సైట్‌లోని డీఎస్-160 వీసా అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఈ ఆన్‌లైన్ అప్లికేషన్ సమయంలో తాము ఇంటర్వ్యూకు, అదే విధంగా అప్లికేషన్ సెంటర్(వీఏసీ)కి వేర్వేరుగా రెండు తేదీల్లో అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. వాటికి హాజరవదలచుకున్న కాన్సులేట్ కార్యాలయాన్ని తెలియజేయాలి. అప్లికేషన్ సెంటర్‌లో ప్రక్రియకు వెళ్లే ముందు పాస్‌పోర్ట్, డీఎస్-160 కన్ఫర్మేషన్ పేజ్, అపాయింట్ కన్ఫర్మేషన్ పేజ్‌లతో వెళ్లాలి. అప్లికేషన్ సెంటర్‌లో ఇంటర్వ్యూ విజయవంతంగా ముగించుకుంటే వీసా ఇంటర్వ్యూకు హాజరు కావాలి. ఈ ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ సిటిజన్‌షిప్ పాస్‌పోర్ట్, అపాయింట్‌మెంట్ లెటర్, డీఎస్-160 కన్ఫర్మేషన్ లెటర్, సెవిస్(స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రిపోర్ట్, రిసీప్ట్ (ఐ-901), ఐ-20లను దగ్గర ఉంచుకోవాలి. విద్యార్థులు అకడమిక్ సెషన్ ప్రారంభానికి కనీసం మూడు నెలల ముందుగా వీసా మంజూరు ప్రక్రియ ముగుస్తుంది

స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లే ఆధారంగా

స్టూడెంట్ వీసా కోసం విద్యార్థులు అకడమిక్ ప్రతిభతోపాటు సంబంధిత స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లలో బెస్ట్ స్కోర్ కోసం ప్రయత్నం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయా దేశాల్లోని యూనివర్సిటీల ప్రామాణికాలు, ప్రభుత్వ ఇమిగ్రేషన్ నిబంధనలపై ముందుగానే అవగాహన పెంచుకుంటే.. వీసా పొందే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొంటున్నారు.

ఇవి తప్పనిసరి

విదేశీ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నిర్దేశిత డాక్యుమెంట్లు/ సర్టిఫికెట్లను తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్, అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్, కోర్సు ఫీజు వ్యయం, ఆర్థిక వనరులకు సంబంధించిన రుజువులు, ఎడ్యుకేషన్ లోన్ ద్వారా అభ్యసించదలిస్తే సంబంధిత బ్యాంకు నుంచి అధీకృత రుజువులతో వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

వీసా ఇంటర్వ్యూ

వీసా మంజూరుకు నిర్వహించే ఇంటర్వ్యూ సందర్భంగా విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొస్తామనే నమ్మకం కలిగించాలి. ఆ దేశంలోనే చదవాలనుకోవడానికి గల కారణాలను ఇమిగ్రేషన్ అధికారులను సంతృప్తి పరిచేలా చెప్పగలగాలి. అక్కడ కోర్సు ద్వారా తాము నేర్చుకోదలిచిన నైపుణ్యాల గురించి స్పష్టత ఉండాలి.



అంతర్జాతీయ వుషు 'ఉత్తమ క్రీడాకారిణి'గా రోషిబినా దేవి

భారత సీనియర్ వుషు క్రీడాకారిణి నరోమ్ రోషిబినా దేవికి అరుదైన గౌరవం లభించింది. 2023 సంవత్సరానికి ఈ మణిపూర్ అమ్మాయి 'సాండా' కేటగిరీలో 'అంతర్జాతీయ ఉత్తమ క్రీడాకారిణి' పురస్కారం గెల్చుకుంది. పబ్లిక్ ఓటింగ్‌లో రోషిబినాకు అత్యధికంగా 93,545 ఓట్లు లభించాయని అంతర్జాతీయ వుషు సమాఖ్య తెలిపింది. 2023 జాతీయ క్రీడా పురస్కారాల్లో 'అర్జున' అవార్డు గెల్చుకున్న 23 ఏళ్ల రోషిబినా 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2022 ఆసియా క్రీడల్లో రజతం సాధించింది.



మెయిన్ 'డ్రా'కు కిరణ్ జార్జి అర్హత

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. జకార్తాలో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లోనూ ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి గెలుపొందాడు. కేరళకు చెందిన 23 ఏళ్ల కిరణ్ తొలి రౌండ్‌లో 12-21, 21-18, 22-20తో లానియర్ (ఫ్రాన్స్)పై, రెండో రౌండ్‌లో 21-17, 12-21, 21-15తో రుస్తావిటో (ఇండోనేసియా)పై నెగ్గాడు.

మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఒక స్థానం మెరుగుపర్చుకొని 95,861 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్... మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి ఈ ఏడాది జరిగిన రెండు ప్రధాన టోర్నీల్లోనూ (మలేసియా ఓపెన్-1000, ఇండియా ఓపెన్-750) అద్భుత ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించాక సాత్విక్-చిరాగ్ తొలిసారి వరల్డ్ నంబర్‌వన్‌గా అవతరించింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రణయ్ ఒక స్థానం పురోగతి సాధించి ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచాడు.

ఓటమితోనే ముగింపు



దోహా: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా సిరియాతో జరిగి న చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని టీమిండియా 0-1 గోల్ తేడాతో ఓడిపోయింది. సిరియా తరఫున ఆట 76వ నిమిషంలో ఒమర్ ఖిరిబిన్ ఏకైక గోల్ చేసి తమ జట్టును గెలిపించాడు. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్క గోల్ కూడా చేయకుండానే, ఒక్క విజయం కూడా లేకుండా నిష్క్రమించింది. తొలి మ్యాచ్‌లో భారత్ 0-2తో ఆస్ట్రేలియా చేతిలో, రెండో మ్యాచ్‌లో 0-3తో ఉజ్బెకిస్తాన్ చేతిలో పరాజయం పాలైంది. ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియా, ఐదు పాయింట్లతో ఉజ్బెకిస్తాన్ ఈ గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించాయి.

ఎదురులేని జొకోవిచ్



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 11వసారి సెమీఫైనల్లోకి

క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్‌పై విజయం

మెల్‌బోర్న్: తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) తన జోరు కొనసాగిస్తూ 11వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ 7-6 (7/3), 4-6, 6-2, 6-3తో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. 3 గంటల 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 20 ఏస్‌లతో హడలెత్తించాడు. 52 విన్నర్స్ కొట్టిన ఈ సెర్బియా స్టార్ నెట్ వద్దకు 20 సార్లు దూసుకొచ్చి 13సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 36 ఏళ్ల జొకోవిచ్ ఈ టోర్నీలో గతంలో సెమీఫైనల్ చేరిన 10 సార్లూ విజేతగా తిరిగి రావడం విశేషం. మరో క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6-4, 7-6 (7/5), 6-3తో ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా)ను ఓడించి సెమీఫైనల్లో జొకోవిచ్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. ఈ టోర్నీలో సినెర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సెమీఫైనల్ చేరుకునే క్రమంలో సినెర్ ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం.

సూపర్ సబలెంకా...





కోకో గాఫ్

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6-2, 6-3తో తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్)పై, కోకో గాఫ్ 7-6 (8/6), 6-7 (3/7), 6-2తో మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్)పై విజయం సాధించారు. క్రిచికోవాతో 71 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సబలెంకా నాలుగు ఏస్‌లు సంధించడంతో పాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

రవిశాస్త్రికి జీవిత సాఫల్య పురస్కారం

ఒకేసారి నాలుగేళ్ల వార్షిక అవార్డులను అందజేసిన బీసీసీఐ





గిల్

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రవిశాస్త్రి

సాక్షి, హైదరాబాద్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాజీ కెప్టెన్, మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. 1983లో భారత్ నెగ్గిన తొలి వన్డే ప్రపంచకప్ విజేత సభ్యుడైన రవిశాస్త్రి అంతర్జాతీయ కెరీర్ అనంతరం టీవీ వ్యాఖ్యతగా బుల్లితెర ప్రేక్షకుల్ని అలరించారు. తదనంతరం భారత పురుషుల టీమ్ డైరెక్టర్‌గా, హెడ్ కోచ్‌గా విజయవంతమయ్యారు. టెస్టులు, వన్డేలు, టి20ల్లో జట్టును మరో దశకు తీసుకెళ్లారు. ఓ ఆటగాడిగా, కోచ్‌గా రవిశాస్త్రి దేశానికి చేసిన సేవల్ని గుర్తించిన బీసీసీఐ 2019-20 సీజన్‌కుగాను 'సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' (జీవిత సాఫల్య) అవార్డుతో సత్కరించింది. ఆయనతో పాటు ఫరూఖ్ ఇంజినీర్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. పురుషుల విభాగంలో అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించిన ఆటగాళ్లకు ఇచ్చే 'పాలీ ఉమ్రీగర్ బెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుల్ని 2019-20 సీజన్‌కుగాను షమీ, అశ్విన్ (2020-21), జస్‌ప్రీత్ బుమ్రా (2021-22), శుబ్‌మన్ గిల్ (2022-23) అందుకున్నారు.

మహిళల కేటగిరీలో బెస్ట్ క్రికెటర్ అవార్డుల్ని దీప్తి శర్మ (2019-20, 2022-23), స్మృతి మంధాన (2020-21, 2021-22) గెలుచుకున్నారు. ఓపెనింగ్‌లో చిచ్చర పిడుగల్లే రాణిస్తున్న యశస్వి జైస్వాల్ 2022-23 సీజన్‌కు ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం అవార్డు చేజిక్కించుకున్నాడు. ఈ విభాగంలో మయాంక్ అగర్వాల్ (2019, 20), అక్షర్ పటేల్ (2020-21), శ్రేయస్ అయ్యర్ (2021-22)లకు అవార్డులు దక్కాయి. కరోనా మహమ్మారి వల్ల 2019-20, 2020-21, 2021-22, 2022-23 సీజన్లలో బీసీసీఐ వార్షిక అవార్డులు ప్రదానం చేయలేకపోయారు. దీంతో మంగళవారం ఓ స్టార్ హోటల్‌లో నిర్వహించిన వేడుకలో నాలుగు సీజన్లకు సంబంధించిన పురుషులు, మహిళల, దేశవాళీ క్రికెటర్లకు అవార్డుల్ని ఒకేసారి ప్రదానం చేశారు.

కేఎల్ రాహుల్ బ్యాటర్‌గానే...

- హెడ్ కోచ్ ద్రవిడ్ వెల్లడి
- వికెట్ కీపర్‌గా భరత్‌కు చాన్స్!



సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌లో కేఎల్ రాహుల్ బ్యాటర్ పాత్రే పోషిస్తాడని భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వెల్లడించాడు. దీంతో ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. రేపటి నుంచి ఉప్పల్ స్టేడియంలో జరగనున్న భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు నేపథ్యంలో ద్రవిడ్ మీడియాతో ముచ్చటించాడు. 'ఐదు టెస్టుల సిరీస్ కావడంతో సెలక్షన్‌పై అప్పుడే కసరత్తు చేశాం. వికెట్ కీపర్లుగా శ్రీకర్ భరత్, ధ్రువ్ జురెల్‌లను జట్టులోకి తీసుకున్నాం. కేఎల్ రాహుల్ ఈ సిరీస్ ఆసాంతం వికెట్ల వెనుక కీపింగ్ చేయడు. బ్యాటర్‌గానే అతన్ని బరిలోకి దించుతాం. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో రాహుల్ కీలక భూమిక పోషించడం వల్లే సిరీస్‌ను 1-1తో సమం చేసుకోగలిగాం' అని ద్రవిడ్ అన్నాడు. భారత్‌లోని స్పిన్ పిచ్‌లపై అశ్విన్, జడేజా మాయాజాలానికి స్పెషలిస్టు వికెట్ కీపర్ అవసరమవుతాడని కోచ్ వివరించాడు. రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదం తర్వాత భారత సెలక్టర్ల కంటపడిన శ్రీకర్ భరత్ అవకాశమిచ్చిన టెస్టు సిరీస్‌లలో తన సత్తా చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో జురెల్ కంటే భరత్‌కే ఎక్కువ అవకాశాలున్నాయి.

ఇంగ్లండ్‌కు స్పిన్ పరీక్ష

హైదరాబాద్‌లో జరిగే తొలి టెస్టులో ఇంగ్లండ్‌కు స్పిన్ పరీక్ష తప్పదు. అయితే పిచ్ స్వభావం గురించి ఒక అంచనాకు రావడం కష్టమని ద్రవిడ్ అన్నాడు. మ్యాచ్ రోజే అర్థం చేసుకోవచ్చని చెప్పాడు. వికెట్ టర్నింగ్‌పై తమకు ఏ బెంగాలేదన్నాడు. నెట్స్‌లో భారత ఆటగాళ్లంతా గంటల తరబడి శ్రమించారు. మంగళవారం ప్రాక్టీస్ తప్పనిసరేం కాకపోయినా చెమటోడ్చారు. కానీ ఒక్క బుమ్రా మాత్రం గైర్హాజరయ్యాడు.

పుణేరి, ముంబా మ్యాచ్ 'టై'

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తొలి 'టై' నమోదు చేసింది. యు ముంబా, పుణేరి పల్టన్ జట్ల మధ్య గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్ 32-32 పాయింట్లతో 'టై'గా ముగిసింది. యు ముంబా ప్లేయర్ గుమన్ సింగ్ 15 పాయింట్లు స్కోరు చేయడం విశేషం. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తెలుగు టైటాన్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

23 నుంచి డబ్ల్యూపీఎల్

న్యూఢిల్లీ: వచ్చే నెల 23 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్ జరుగనుంది. బెంగళూరులో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. సీజన్‌లోని మొత్తం 22 మ్యాచుల్ని బెంగళూరు (11 మ్యాచ్‌లు), న్యూఢిల్లీ (11 మ్యాచ్‌లు) వేదికల్లో నిర్వహిస్తారు. ఐదు ఫ్రాంచైజీల (ముంబై, బెంగళూరు, ఢిల్లీ, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్) మధ్య ఈ లీగ్ జరుగుతుంది. మార్చి 13 వరకు లీగ్ దశ పోటీలు జరుగుతాయి. 15న ఎలిమినేటర్, 17న టైటిల్ పోరు ఢిల్లీలో నిర్వహిస్తారు.

సినిమా










గత ఏడాది బాక్సాఫీస్ దగ్గర సంచలన వసూళ్లు కురిపించిన దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ 'ఒప్పెన్‌హైమర్', దర్శకురాలు గ్రెటా గెర్విగ్ 'బార్బీ' చిత్రాలు ఆస్కార్ అవార్డ్స్‌లోనూ పోటీలో నిలిచాయి. 96వ ఆస్కార్ అవార్డులకు సంబంధించిన నామినేషన్లు మంగళవారం సాయంత్రం (భారతీయ కాలమాన ప్రకారం) వెలువడ్డాయి. 23 విభాగాల్లోని ప్రధాన విభాగాల్లో 'ఒప్పెన్‌హైమర్'కు 13 నామినేషన్లు దక్కగా, 'బార్బీ' ఎనిమిది నామినేషన్లను సొంతం చేసుకుంది. నామినేషన్ల జాబితాను నటుడు జాక్ క్వైడ్, నటి జాజీ బీట్జ్ ప్రకటించారు. ఇంకా అత్యధిక నామినేషన్లు దక్కించుకున్న చిత్రాల్లో 11 నామినేషన్లతో యోర్గోస్ లాంతిమోస్ దర్శకత్వం వహించిన 'పూర్ థింగ్స్', పది నామినేషన్లతో మార్టిన్ స్కోర్సెస్ దర్శకత్వం వహించిన 'కిల్లర్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్', ఏడు నామినేషన్లతో 'మేస్ట్రో' ఉన్నాయి. ఉత్తమ చిత్రం విభాగంలో 'ఒప్పెన్‌హైమర్', 'బార్బీ' పోటీ పడుతుండటంతో 'ఇది బార్బెన్‌హైమర్ పోరు' అని హాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఉత్తమ దర్శకుల విభాగంలో 'బార్బీ' దర్శకురాలు గ్రెటా గెర్విగ్‌కి నామినేషన్ దక్కుతుందనే అంచనాలు నెలకొన్న నేపథ్యంలో ఆమె నామినేట్ కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని హాలీవుడ్ అంటున్న మాట. కానీ ఇదే చిత్రానికి సహాయ నటి విభాగంలో అమెరికా ఫెర్రెరాకి దక్కడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఫెర్రెరాకి నామినేషన్ దక్కుతుందనే కనీస అంచనాలు లేకపోవడమే ఈ ఆశ్చర్యానికి కారణం. అలాగే 'బార్బీ'లో టైటిల్ రోల్ చేసిన మార్గెట్ రాబీకి ఉత్తమ నటి నామినేషన్ దక్కకపోవడం ఘోరం అనే టాక్ కూడా ఉంది. ఇక దర్శకుల విభాగంలో గ్రెటా గెర్విగ్‌కి దక్కకపోయినప్పటికీ 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్' చిత్రదర్శకురాలు జస్టిన్ ట్రైట్‌కి దక్కడంతో ఈ కేటగిరీలో ఓ మహిళ ఉన్నట్లు అయింది. ఇక మార్చి 10న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్లో (భారత కాలమానం ప్రకారం మార్చి 11) ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. మూడేళ్లుగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కెమ్మెల్ ఈసారి కూడా ఆ బాధ్యతను నిర్వర్తించనున్నారు. ఇదిలా ఉంటే గతేడాది 'ఆర్‌ఆర్‌ఆర్' ('నాటు నాటు...' పాటకు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' అవార్డు), బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఆస్కార్ అవార్డు దక్కించుకుని, భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటాయి. ఈసారి దేశం నుంచి ఏ సినిమా పోటీలో లేదు. అయితే కెనడాలో స్థిరపడ్డ భారత సంతతికి చెందిన నిషా పహుజా దర్శకత్వం వహించిన కెనెడియన్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'టు కిల్ ఏ టైగర్'కి నామినేషన్ దక్కింది.

'బార్బెన్‌హైమర్' పోరు ఖరారు!

- 96వ ఆస్కార్ అవార్డుల నామినేషన్ల ప్రకటన



మార్టిన్ స్కోర్సెస్



జాన్ విలియమ్స్

ఉత్తమ చిత్రం: అమెరికన్ ఫిక్షన్ • అటానమీ ఆఫ్ ఎ ఫాల్ • బార్బీ • ది హోల్డోవర్స్ • కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్ • మేస్ట్రో • ఒప్పెన్‌హైమర్ • పాస్ట్ లైవ్స్ • పూర్ థింగ్స్ • ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్ **ఉత్తమ దర్శకుడు:** • అటానమీ ఆఫ్ ఎ ఫాల్: జస్టిన్ ట్రైట్ • కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్: మార్టిన్ స్కోర్సెస్ • ఒప్పెన్ హైమర్: క్రిస్టోఫర్ నోలన్ • పూర్ థింగ్స్: యోర్గోస్ • ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్: జొనాథన్ గ్లేజర్ **ఉత్తమ నటుడు:** • బ్రాడ్లీ కూపర్: మేస్ట్రో • కోల్మన్ డొమింగో: రస్టిన్ • పాల్ జియామటి: ది హోల్డోవర్స్ • కిలియన్ మర్ఫీ: ఒప్పెన్ హైమర్ • జెఫ్రీ రైట్: అమెరికన్ ఫిక్షన్ **ఉత్తమ నటి:** • అన్నెతే బెనింగ్: నయాడ్ • లిల్లీ గ్లాడ్‌స్టోన్: కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్ • సాండ్రా హల్లర్: అటానమీ ఆఫ్ ఎ ఫాల్ • కెర్రీ ములిగన్: మేస్ట్రో • ఎమ్మా స్టోన్: పూర్ థింగ్స్.

★ 91 ఏళ్ల కంపోజర్ జాన్ విల్లియమ్స్ 54వ నామినేషన్ దక్కించుకున్నారు. 'ఇండియా జోన్స్ అండ్ ది డయల్ ఆఫ్ డెస్టినీ' చిత్రానికి గాను ఆయనకు నామినేషన్ దక్కింది. అత్యధిక సార్లు నామినేషన్ దక్కించుకున్న సంగీతదర్శకుడిగా ఆయన రికార్డ్ సాధించారు. ఇప్పటికే ఐదు ఆస్కార్ అవార్డులు సొంతం చేసుకున్న జాన్‌కి ఈ చిత్రం కూడా ఆస్కార్ తెచ్చి, ఆనందపరుస్తుందా అనేది చూడాలి ★ ఈ ఏడాది నామినేషన్స్ 61 ఏళ్ల జోడీ ఫాస్టర్‌ని మళ్లీ పోటీలో నిలబెట్టాయి. 29 ఏళ్ల తర్వాత 'నయాడ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటి విభాగంలో ఆమె నామినేషన్ దక్కించుకున్నారు. అంతకు ముందు 'నెల్' చిత్రానికిగాను 1995లో ఆమెకు నామినేషన్ దక్కింది. కాగా 'ది అక్యూస్డ్', 'ది సైలెన్స్ ఆఫ్ ది ల్యాంబ్స్' చిత్రాలకు గాను ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డులు అందుకున్నారు జోడీ. ఇప్పుడు సహాయ నటి అవార్డును ఇంటి తీసుకెళతారా చూడాలి ★ 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో దర్శకుడు మార్టిన్ ఏ స్కోర్సెస్‌కి ఉత్తమ దర్శకుడిగా నామినేషన్ దక్కింది. దర్శకుడిగా పది నామినేషన్లు దక్కించుకుని, ప్రస్తుతం జీవించి ఉన్న వ్యక్తిగా ఆయన రికార్డు సొంతం చేసుకున్నారు. ఉత్తమ దర్శకునిగా స్టీవెన్ స్పీల్‌బర్గ్ తొమ్మిది నామినేషన్స్ దక్కించుకున్నారు. అయితే ఇప్పటివరకు పది సార్లు నామినేషన్ దక్కించుకున్న మార్టిన్‌కు ఒక ఆస్కార్ అవార్డు మాత్రమే దక్కింది. 2006లో వచ్చిన 'డిపార్టెడ్' సినిమాకు అవార్డు అందుకున్నారు మార్టిన్. ఇదిలా ఉంటే.. తొమ్మిదిసార్లు నామినేట్ అయినప్పటికీ రెండు సార్లు ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అందుకున్నారు స్టీవెన్ సీల్‌బర్గ్. ఉత్తమ దర్శకుడి విభాగంలో విలియమ్ వైలర్ 12 నామినేషన్స్ దక్కించుకుని రికార్డు సొంతం చేసుకున్నారు.. అలాగే మూడు ఆస్కార్ అవార్డులు సాధించారు. అయితే ప్రస్తుతం ఆయన జీవించి లేరు.

జూన్‌లో ఎమర్జెన్సీ



కంగనా రనౌత్

ఈ ఏడాది జూన్‌లో వెండితెరపై 'ఎమర్జెన్సీ' విధించనున్నట్లు హీరోయిన్ కంగనా రనౌత్ ప్రకటించారు. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. జీ స్టూడియోస్‌తో కలిసి మణికర్ణిక ఫిల్మ్స్‌పై కంగనా రనౌత్ నిర్మించిన ఈ సినిమా కొత్త విడుదల తేదీ ఖరారైంది. 2023 నవంబరు 24న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్ 14న సినిమాని రిలీజ్ చేయనున్నట్లు కంగనా రనౌత్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ''ఇండియా చీకటి రోజుల వెనక కథని చూడండి. జూన్ 14న 'ఎమర్జెన్సీ' సినిమా విడుదలవుతుంది. చరిత్ర మరోసారి కళ్ల ముందుకు రానుంది' అని ఎక్స్‌లో (ట్విట్టర్) పోస్ట్ చేశారు కంగనా రనౌత్. 'ఎమర్జెన్సీ' చిత్రంలో ఇందిరా గాంధీ పాత్రలో కంగనా కనిపించనున్నారు. 1975లో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ టైమ్‌లో జరిగిన ఘటనలతో ఈ మూవీ రూపొందింది.

అత్తారింట్లో ఆంక్షలు లేవు

- లావణ్యా త్రిపాఠి



''వరుణ్ తేజ్‌తో పెళ్లి తర్వాత పాత్రల ఎంపిక విషయంలో వరుణ్, కుటుంబ సభ్యులు నాకు ఎలాంటి షరతులు, ఆంక్షలు విధించలేదు. కెరీర్ విషయంలో అత్తారింట్లో నాకు ఫుల్ సపోర్ట్ ఉంది. మంచి కథ కుదిరితే వరుణ్‌తో నటించడానికి సిద్ధం'' అని లావణ్యా త్రిపాఠి అన్నారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో లావణ్యా త్రిపాఠి, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో 'మిస్ పర్ఫెక్ట్' అనే వెబ్ సిరీస్ రూపొందింది. అన్నపూర్ణ స్టూడియోస్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సిరీస్ ఫిబ్రవరి 2 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ట్రైలర్ రిలీజ్ వేడుకలో లావణ్యా త్రిపాఠి మాట్లాడుతూ- ''మిస్ పర్ఫెక్ట్' సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్.. సిరీస్ పూర్తయ్యేలోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యాను. టైటిల్‌కు తగినట్లే 'మిస్ పర్ఫెక్ట్' బాగుంటుంది. మెగా కోడలు అనే ట్యాగ్ నటిగా మరింత బాధ్యత పెంచింది.. ఈ పిలుపుని ప్రత్యేకంగా భావిస్తున్నాను'' అన్నారు. ''కొత్త ప్రతిభని ప్రోత్సహించడం కోసమే నాగేశ్వరరావు, నాగార్జునగార్లు అన్నపూర్ణ సంస్థ స్థాపించారు. 'మిస్ పర్ఫెక్ట్'తో మేమూ అదే ప్రయత్నం చేశాం'' అన్నారు సుప్రియ యార్లగడ్డ.

అందుకు ధైర్యం కావాలి

- యండమూరి వీరేంద్రనాథ్



యండమూరి వీరేంద్రనాథ్, దీపక్

''సిద్ధార్థ్ రాయ్' లాంటి సినిమా ఏ భాషలోనూ రాలేదు. ప్రతి మనిషిలో రెండు సంఘర్షణలుంటాయి.. ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి. ఈ సినిమా విజయం సాధిస్తుంది'' అని ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. తన్వీ నేగి హీరోయిన్. వి. యశస్వి దర్శకత్వంలో జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకలో యండమూరి వీరేంద్రనాథ్, దర్శకులు సాయి రాజేష్, వీరశంకర్, రచయిత లక్ష్మీ భూపాల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వి. యశస్వి మాట్లాడుతూ-''సుకుమార్ గారికి మా సినిమా చూపిస్తే, ఫస్ట్ హాఫ్ అవగానే.. 'సినిమా అదిరింది.. నీ తర్వాతి చిత్రం నా బ్యానర్‌లో చేయాలి'' అన్నారు.

నాలుగు కథలతో...



శ్రీనివాస్ రెడ్డి, సాయికుమార్

సాయి కుమార్, శ్రీనివాస్ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మూడో కన్ను'. 'ప్లాన్ బి' మూవీ డైరెక్టర్ కేవీ రాజమహి, సునీతా రాజేందర్ దేవులపల్లి నిర్మించిన ఆంథాలజీ చిత్రం ఇది. నాలుగు కథలతో రూపొందిన ఈ చిత్రానికి సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయి సురేంద్రబాబు దర్శకత్వం వహించారు. అమెరికాలో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన 'మూడో కన్ను' ట్రైలర్‌ని నటుడు శ్రీకాంత్ విడుదల చేసి, ఈ చిన్న సినిమా పెద్ద సక్సెస్ సాధించాలన్నారు. ''ఈ నెల 26న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కేవీ రాజమహి, సునీత రాజేందర్.

తండ్రీ కొడుకుల కథ

హాస్య నటుడిగా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందిన ధనరాజ్ కొరనాని తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామం రాఘవం'. సముద్ర ఖని, ధనరాజ్ కొరనాని తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పొలవరపు నిర్మిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల కథతో రూపొందుతోన్న చిత్రం 'రామం రాఘవం'. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ధనరాజ్.



సముద్రఖని, ధనరాజ్

ఇది కనులు కల గన సాధ్యమా...



హెబ్బా పటేల్, చైతన్యా రావు

'నిజమా.. ఇది కనులు కల గన సాధ్యమా..' అంటూ ప్రేమ పాట పాడుకున్నారు చైతన్యా రావు, హెబ్బా పటేల్. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రంలోని పాట ఇది. ఎన్‌ఆర్‌ఐ ఎంటర్టైన్మెంట్స్ (యుఎస్ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్‌పై కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. బాల రాజశేఖరుని దర్శకుడు. ఈ చిత్ర సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ స్వరపరిచి, సునీతతో కలిసి పాడినన 'నిజమా...' పాటను దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ- ''నిజమా..' పాట చాలా మెలోడియస్‌గా ఉంది. లొకేషన్స్ బాగున్నాయి. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''రామ్‌గోపాల్ వర్మగారితో 'బ్యూటీ ఆఫ్ ప్యాషన్, ఆట' అనే రెండు హాలీవుడ్ చిత్రాలకు పనిచేశాను. నేను దర్శకుడు కావడానికి 'శివ' చిత్రం స్ఫూర్తి. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు బాల రాజశేఖరుని.